




GST NO: 36ACPPF9587L2ZM
TELTEL/2013/53323

# సమయజ్యోతి

ప్రతీ అక్షరం - ప్రజలకోసం

తెలుగు దిన పత్రిక

CELEBRATING 12TH YEAR ANNIVERSARY


సంపుటి : 12 సంచిక : 131 పేజీలు : 12 ఆదిలాబాద్ వెల రూ : 01 బుధవారం 30 జూలై 2025 ఎడిటర్ : ఫైసల్ ఖాన్





## అఖిలపక్షంకన్నా ఎన్నికల ప్రచారమే

# ముఖ్యమా?



● ఉగ్రవాదులను ఏరివేసామని అబద్దాలు ప్రచారం చేస్తారా ● అబద్దాల కార్ఖానాలు ఏర్పాటు చేసిన బిజెపి ● సిందూర్‌పై రాజ్యసభ చర్చలో ఖర్గే ఘాటు వ్యాఖ్యలు ● నడ్డా అభ్యంతరం.... విపక్షం డిమాండ్‌తో క్షమాపణలు

**న్యూఢిల్లీ,జూలై29(సమయజ్యోతి):**

ఆపరేషన్ సిందూర్ పై రాజసభ్యలోనూ వాడీవేడీ చర్చ జరిగింది. ఈ క్రమంలో రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గేపై సభాపక్ష నేత జేపీ నడ్డా అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం తీవ్ర వాగ్వాదానికి కారణమైంది. దీంతో అధికార, విపక్ష సభ్యుల చప్పుళ్లతో సభ కొద్దిసేపు దద్దరిల్లింది. చివరకు తన వ్యాఖ్యలను నడ్డా వెనక్కి తీసుకొని, క్షమాపణ చెప్పడంతో సభ సద్దుమణిగింది.పహల్గాం దాడి, ఆపరేషన్ సిందూర్‌పై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దాదాపు గంటపాటు- ప్రసంగించారు. ఈ క్రమంలో ప్రధాని మోదీపైనా తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఖర్గే ప్రసంగం ముగిసిన వెంటనే స్పందించిన నడ్డా.. కాంగ్రెస్ అధ్యక్షుడు 'మానసిక సమతుల్యత' కోల్పోతున్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

02


## ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రమూకలకు

# బుద్ధి చెప్పాం

- ట్రంప్ మధ్యవర్తిత్వ ప్రకటనను తోసిపుచ్చిన మోడీ
- సిందూర్‌లో త్రివిధ దళాలు సత్తా చాటాయి
- కేవలం 22 నిమిషాల్లో ఆపరేషన్ పూర్తి చేసిన త్రివిధ దళాలు
- ఆపరేషన్‌పై కాంగ్రెస్, విపక్షాల తీరు దారుణం
- సైన్యం స్థయిర్యం దెబ్బతినేలా వ్యాఖ్యాలు
- హెడ్‌లైన్స్‌లో ఉండేలా చేస్తున్న వారికి ప్రజల్లో స్థానం లేదు
- ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో ప్రధాని మోడీ సమాధానం

### కాల్పుల విరమణలో మూడో దేశం జోక్యం లేదు

**న్యూఢిల్లీ,జూలై29(సమయజ్యోతి):**



పాక్‌తో కాల్పుల విరమణలో అమెరికా పాత్రను లోక్‌సభ వేదికగా ప్రధాని మోడీ తోసిపుచ్చారు. ఇందులో మూడో వ్యక్తి ప్రమేయం లేదని తేల్చి చెప్పారు. ఇదే సందర్భంలో ప్రధాని మోదీ.. కాంగ్రెస్, విపక్షాల తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఉగ్రవాదులను మట్టిలో కలిపినందుకు భారత్ విజయోత్సవాలు చేసుకుంటోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడం, భారత సేనల శౌర్య, ప్రతాపాల ప్రదర్శన తర్వాత విజయోత్సవాలు చేసుకుంటున్నామన్నారు. 140 కోట్ల భారతీయుల ఐక్యత, ఇచ్ఛాశక్తి ఫలాలతో భారత్ విజయోత్సవాలు చేసుకుంటోందని తెలిపారు. 'ఆపరేషన్ సిందూర్'పై లోక్‌సభలో వాడీ వేడిగా జరిగిన చర్చకు సమాధానం గా ప్రధాని మోదీ ప్రసంగించారు. ఆపరేషన్ సిందూర్ ఆపాలని ప్రపంచంలో ఏ నేత కూడా మాకు చెప్పలేదు. మే 9న అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నాతో ఫోన్‌లో మాట్లాడారు. పాక్ భారీగా దాడి చేయబోతోందని ఆయన హెచ్చరించారు. పాక్ భారీ మూల్యం చెల్లించుకుంటుందని జేడీ వాన్స్‌కు చెప్పా. పాక్‌కు ఎవరు సాయం చేసినా.. చూస్తూ ఊరుకొనేది లేదని చెప్పాం. పాక్ ఎలాంటి దాడి చేసినా మేం చూసుకుంటామని వాన్స్‌కు చెప్పాం. బుల్లెట్‌కు బుల్లెట్‌తోనే సమాధానం చెప్తామని జేడీ వాన్స్‌కు చెప్పాం. పాక్‌కు ఎవరు సహాయం చేసినా.. చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టం చేశాం.

2లో

## దమ్ముంటే ట్రంప్ వ్యాఖ్యలను

# ఖండించాలి

### సైన్యం చేతులు కట్టేసి..పాక్‌తో సయోధ్య

ఉగ్రదాడులకు దీటుగా సమాధానం చెప్పడంలో విఫలం

-ఆపరేషన్ సిందూర్ చర్చపై రాహుల్

**న్యూఢిల్లీ,జూలై29(సమయజ్యోతి):**



ఆపరేషన్ సిందూర్ సమయంలో మన సైనికుల చేతులు కట్టేశారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. సాయుధ దళాలకు మద్దతుగా నిలిచే విషయంలో ప్రభుత్వానికి రాజకీయ సంకల్పం కొరవడిందని విమర్శించారు. తాము యుద్ధం కోరుకోవడం లేదని పాకిస్థాన్‌కు భారత ప్రభుత్వమే తెలియజేసిందన్నారు. 'ఆపరేషన్ సిందూర్ 'పై చర్చ సందర్భంగా లోక్‌సభలో రాహుల్ ప్రసంగిస్తూ.. పహల్గాం ఉగ్రదాడిని పాకిస్థాన్ కుట్రపన్నిన క్రూరమైన ఘటనగా పేర్కొన్నారు. సాయుధ దళాలను ఉపయోగించాలనుకుంటే.. బలమైన రాజకీయ సంకల్పం ఉండాలి. వారికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలి. కానీ.. ఆపరేషన్ సిందూర్ విషయంలో మన సైనికుల చేతులు కట్టేశారు.

## కాశ్మీర్‌లో సాధారణ పరిస్థితి ఉందని ఎలా చెబుతారు

ఉగ్రవాదుల దాడికి ఎవరు బాధ్యులో చెప్పరా?

పహల్గామ్ దాడి ముమ్మాటికీ నిఘా వైఫల్యమే

సిందూర్‌పై చర్చలో ప్రియాంక విమర్శలు

**న్యూఢిల్లీ,జూలై29(సమయజ్యోతి):**


జమ్మూకశ్మీర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని కేంద్రం చెబుతుండటంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ ప్రశ్నించారు. అంతా సజావుగానే ఉంటే, శాంతి భద్రతలు నెలకొని ఉంటే పహల్గాం ఉగ్రదాడి ఎలా జరిగిందని ప్రశ్నించారు. ఆపరేషన్ సిందూర్, పహల్గాం ఉగ్రదాడిపై లోక్‌సభలో రెండో రోజు మంగళవారం జరిగిన ప్రత్యేక చర్చలో ప్రియాంక గాంధీ మాట్లాడారు. భారత సాయుధ బలగాల సేవలు, త్యాగాలను ప్రశంసించారు. జాతీయ భద్రతపై చెక్కుచెదరని వారి సంకల్పాన్ని కొనియాడారు. పహల్గాంలో పర్యాటకులను దారుణంగా చంపారని, వివరాలు అడిగి మరీ చంపారని ప్రియాంక ఆవేదన వ్యక్తం చేశారు.



2లో

## జూబ్లీహిల్ ఉప ఎన్నికల్లో గెలుస్తాం: పొన్నం

**హైదరాబాద్,జూలై29(సమయజ్యోతి):**



జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. అభ్యర్థుల విషయంలో కాంగ్రెస్ నుంచి గట్టి పోటీ ఉందని వివరించారు. పలువురు నేతలు జూబ్లీహిల్స్ నుంచి పోటీకి ఆసక్తి చూపుతున్నట్లు- పేర్కొన్నారు. పార్టీ అధిష్ఠానం ఎవరికి టికెట్ ఇస్తే వారే పోటీ- చేస్తారని తెలిపారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అభ్యర్థిపై సర్వే జరుగుతోందని వెల్లడించారు. అభ్యర్థులు ఎవరున్నా.. అందరూ కలిసి పనిచేస్తారని తెలిపారు. జూబ్లీహిల్స్‌లో ఈసారి కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ చేస్తున్నమంచి పనులే గెలిపిస్తాయని అన్నారు. బిఆర్ఎస్‌ను ఎవరూ నమ్మడం లేదన్నారు.

## అరుణాచల్‌లో

# ఆక్రమణలు అబద్ధం

1962 నుంచి యధాతథ స్థితి: కిరణ్ రిజిజు

**న్యూఢిల్లీ,జూలై29(సమయజ్యోతి):**



2లో

భారత భూభాగంలోకి చైనా ఒక్క అంగుళం కూడా చొరబడలేదని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు అన్నారు. అరుణాచల్ ప్రదేశ్‌లో ఎలాంటి ఆక్రమణలకు పాల్పడలేదని చెప్పారు. 1962 నుంచి ఇదే పరిస్థితి అని మంగళవారం లోక్‌సభకు వెల్లడించారు. రికార్డులను సరిచేయడం ఎంతోముఖ్యమని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. నా సొంత రాష్ట్రంలోకి చైనా ప్రవేశించి, ఆక్రమణలకు పాల్పడిందని ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ అన్నారు. దీనిపై స్పష్టత ఇవ్వడం ముఖ్యమని నేను భావించాను. అరుణాచల్‌ప్రదేశ్‌లో ప్రస్తుతం చైనా అధీనంలో ఉన్న ప్రాంతం 1962 యుద్ధానికి ముందు లేదా ఆ సమయంలో ఆక్రమించారు. ఆ తర్వాత అలాంటి పరిస్థితి తలెత్తలేదు' అని వెల్లడించారు. వాస్తవాధీన రే(ఎల్ఏసీ) వెంబడి భారత్ భూభాగాన్ని చైనా ఆక్రమించిందని గతంలో పలు కథనాలు వెలువడ్డాయి. అరుణాచల్‌ప్రదేశ్ (ఆసషశ-ఠశ సశ।ఠ) లోని పలు ప్రాంతాల పేర్లను మార్చడానికి డ్రాగన్ యత్నించింది. దానిని పలుమార్లు భారత్ తిరస్కరించింది కూడా. అరుణాచల్‌ప్రదేశ్ భారత్‌లో అంతర్భాగమని.. అది విడదీయరాని భాగమని.. పేర్లు మార్చినంత మాత్రాన ఈ వాస్తవాన్ని మార్చలేరని స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే.. ఇక గత ఏడాది ఈ ఆసియా దేశాల మధ్య గస్తీ దోస్తీ కుదిరింది. ఇరు దేశాల సైనికులు 2020లో గస్తీ నిర్వహించిన పెట్రోలింగ్ పాయింట్లకు ఇక స్వేచ్ఛగా వెళ్లొచ్చు. గల్వాన్ ఘర్షణ తర్వాత దెబ్బతిన్న సంబంధాలు.. ఆ ఒప్పందం తర్వాత కాస్త మెరుగయ్యాయి.

## కాలుష్యరహిత నగరంగా హైదరాబాద్

25 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు

అధికారులకు సిఎం రేవంత్ ఆదేశం



**హైదరాబాద్,జూలై29(సమయజ్యోతి):**

హైదరాబాద్‌ని కాలుష్యరహితంగా మార్చేందుకు అవసరమైన సంస్కరణలు తీసుకురావాలని అధికారులను సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వచ్చే 25 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారంరాష్ట్ర సచివాలయంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో పలు కీలక అంశాలపై చర్చించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబులింగ్‌లని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి మార్గ నిర్దేశం చేశారు. కోర్ అర్బన్ రీజియన్‌లో కాలుష్య నియంత్రణకు శాశ్వత పరిష్కారం చూపాలని.. ఇందుకు సంబంధించి ఢిల్లీ, బెంగళూరు, చెన్నై లాంటి నగరాల్లో సమస్యలను అధ్యయనం చేయాలని దిశానిర్దేశర చేశారు. హైదరాబాద్‌కు అలాంటి పరిస్థితి రాకుండా పరిష్కార మార్గాలను సిద్ధం చేయాలని సూచించారు. మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు.

## బిసి రిజర్వేషన్ల కోసం 72 గంటల నిరాహార దీక్ష

ప్రభుత్వ అనుమతితో

4 నుంచి దీక్షకు దిగుతా

లేదంటే ఎక్కడుంటే అక్కడే దీక్ష చేస్తా

జాగృతి అధ్యక్షురాలు కవిత హెచ్చరిక

**హైదరాబాద్,జూలై29(సమయజ్యోతి):**

బీసీ రిజర్వేషన్ల సాధన కోసం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఆగస్టు 4, 5, 6 తేదీల్లో తాను 72 గంటల పాటు నిరాహార దీక్ష చేయబోతున్నానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మంగళవారం ప్రకటించారు. ప్రభుత్వ అనుమతి కోరి దీక్షకు దిగుతానని ఒక వేళ అనుమతి ఇవ్వకపోతే ఎక్కడ కూర్చుంటే అక్కడే నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు.

2లో



# ఆపరేషన్ సిందూర్‌పై సందేహాలా

**ఉగ్రమూకలను అణచివేస్తే సంతోషించరా**
**మాజీ హోంమంత్రికి ఉగ్రవాదుల ఉనికిపై అనుమానాలా**
**లోక్‌సభలో సిందూర్ అమిత్ షా ప్రసంగం**
**చిందబరం వ్యాఖ్యలపై గట్టిగా కౌంటర్**
**ముగ్గురు పహల్గా ఉగ్రవాదులను మట్టుబెట్టామని వెల్లడి**

న్యూఢిల్లీ,జూలై29(సమయజ్యోతి): పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారణంగా ఆపరేషన్ సింధూర్ పేరుతో భారత్ చేపట్టిన ఆపరేషన్‌పై విపక్షాలు సంతోషం వ్యక్తం చేస్తాయనుకుంటే.. సందేహాలు వ్యక్తం చేస్తున్నాయంటూ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. లోక్‌సభలో రెండో రోజు మంగళవారం జరిగిన ప్రత్యేక చర్చలో అమిషా మాట్లాడారు. విపక్ష ఎంపీల వ్యాఖ్యలు దారుణంగా ఉన్నాయన్నారు. ఉగ్రవాదులను మట్టు-బెడితే ఆనందం వ్యక్తం చేస్తారనుకున్నానని.. కానీ విపక్ష సభ్యులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఎలాంటి ప్రశ్నలు అడుగుతున్నారో ఒకసారి ఆలోచించాలంటూ హితవు పలికారు. ఉగ్రవాదులు చని పోయారన్న సంతోషం వారిలో కనిపించలేదని చెప్పారు. ఉగ్రవాదులు పాక్ నుంచే వచ్చారనేందుకు.. ఆధారాలు ఉన్నాయా అన్న చిదంబరం ప్రశ్నకు అమిత్ షా స్పందించారు. పాక్‌ను కాపాడే ప్రయత్నం చేస్తున్నారా.. అని ప్రశ్నించారు. పాక్‌కు క్లీన్‌చిట్ ఇవ్వాల్సిన అవసరం ఏంటంటూ కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రశ్నించారు. కేంద్ర హోంశాఖ మంత్రిగా పనిచేసిన వ్యక్తి ఇలా మాట్లాడటం తగదని హితవు పలికారు. ఉగ్రవాదులు పాకిస్తాన్ నుంచి వచ్చారనేందుకు తమ వద్ద ఆధారాలున్నాయని స్పష్టం చేశారు. ఉగ్రవాదుల నుంచి కొన్ని పాక్ వస్తువులను కూడా స్వాధీనం చేసుకున్నామని అమిత్‌షా క్లారిటీ ఇచ్చారు.ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకున్నట్లు- కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. పహల్గాం ప్రతీకారాన్ని ధృవీకరించారు. ఈ దాడికి పాల్పడిన ఉగ్రవాదుల్లో ముగ్గురిని మట్టుబెట్టినట్లు వెల్లడించారు. పహల్గాంలో పర్యాటకులను హత్య చేశారు. టూరిస్టులను ఉగ్రవాదులు అతికిరాతకంగా హత్య చేశారు. కుటుంబ సభ్యులు ముందే కాల్చి చంపారు. మంతం, పేరు అడిగి మరీ చంపడం దారుణం. పహల్గాం దాడికి పాల్పడిన ఉగ్రవాదుల్లో ముగ్గురిని హతమార్చం. ఈనెల 22న శాటిలైట్ ఫోన్ సిగ్నల్ ద్వారా ఉగ్రవాదుల కదలికలను గుర్తించాం. ఆపరేషన్ మహాదేవ్‌లో ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. ఉగ్రదాడి జరిగిన రోజునే జమ్ము భద్రతపై సమీక్షించాం. ఉగ్రవాదులను ఆశ్రయం ఇచ్చిన వారిని కూడా అరెస్ట్ చేశాం. ఉగ్రశిబిరాలను మట్టిలో కలిపేశాం. ఆర్మీ, సీఆర్‌పీఎఫ్, జమ్ము పోలీసులకు అభినందనలు' అని అమిత్ షా తెలిపారు. ఉగ్రవాదుల్ని హతమార్చాం అంటే విపక్షాలు సంతోషిస్తాయను కున్నానని, కానీ సందేహాలు వ్యక్తం చేస్తున్నారంటూ షా వ్యాఖ్యానించారు. జమ్ముకశ్మీర్‌లోని శ్రీనగర్ సమీపంలో ఉన్న హర్వాన్ ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కినట్టు- నిఘా వర్గాల నుంచి సమాచారం అందడంతో గడిచిన నెలరోజులుగా ఆ అటవీ ప్రాంతంలో భద్రతా దళాలు గాలింపు చర్యలు చేపట్టాయి. లష్కరే, జైషే ఉగ్రవాదుల కదలికల కోసం గడిచిన 14 రోజులుగా మరింత ముమ్మరంగా నిఘాను పెంచాయి. ఈ క్రమంలో దాచిగామ్ నేషనల్ పార్క్ పరిసరాల్లో రెండు రోజుల కిందట అనుమానస్పద కమ్యూనికేషన్లను భారత సైన్యం పసిగట్టింది. సోమవారం ఉదయం 11.30 గంటల సమయంలో దాచిగామ్ నేషనల్ పార్క్ పరిసరాల్లో ముగ్గురు ఉగ్రవాదులను గుర్తించిన భద్రతాదళాలు.. మెరుపు వేగంతో కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో ఉగ్రవాది సులేమాన్ షాతో పాటు- పహల్గాం దాడికి కారణమైన మరో ఉగ్రవాది యాసిర్ హతమైనట్టు- అధికారులు తెలిపారు. ఈ కాల్పుల్లో మరో ఉగ్రవాది అబూ హామ్జా కూడా హతమైనట్టు- పేర్కొన్నారు. వీరందరూ విదేశీ ఉగ్రవాదులేనని తెలిపారు. అమాయక పౌరులపై దాడులు చేస్తే మా ప్రతి స్పందన గట్టిగా ఉంటుందని హెచ్చరించారు. విపక్ష ఎంపిల వ్యాఖ్యలు దారుణంగా ఉన్నాయని, ఎలాంటి ప్రశ్నలు అడుగుతున్నారో ఒకసారి ఆలోచన చేయాలని డిమాండ్ చేశారు. పహల్గాం దాడి బాధితులను కలిసి వారి బాధలు తెలుసుకున్నామని, పహల్గాం దాడి ఘటనను వెంటనే ఎన్ఐఎకు అప్పగించామని వివరించారు.ఉగ్రవాదులు పాక్ నుంచి వచ్చారనేందుకు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని, ఉగ్రవాదుల నుంచి పాక్‌లో తయారైన పత్రాలు, చాక్లెట్లు- స్వాధీనం చేసుకున్నామని, కేంద్ర హోంశాఖ మంత్రిగా పని చేసిన వ్యక్తి ఇలా మాట్లాడడం తగదని అమిత్ షా చురకలంటించారు. దేశ ప్రజల ఆశలు, ఆకాంక్షలు గమనించి కాంగ్రెస్ నేతలు మాట్లాడాలని సూచించారు.ఆపరేషన్ సింధూర్‌పై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వివరంగా చెప్పారని, పహల్గాం తీవ్రవాదుల దాడిలో 26 మంది మృతి చెందారని, మృతుల్లో నేపాల్ వ్యక్తి కూడా ఉన్నారని తెలియజేశారు. పహల్గాం దాడి కేవలం పర్యాటకులపై కాదు అని, దేశంపై దాడి పరిగణించాలని, పహల్గాంలో దాడి చేసిన ఉగ్రవాదులను మట్టిలో కలిపేశామని, ఆనాడు 140 కోట్ల మంది ప్రజల గుండెచప్పుడును ప్రధాని మోడీ వివరించారని అమిత్ షా గుర్తు చేశారు. పాక్‌పై దాడులు చేసేందుకు భద్రతాబలగాలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని, మే 7న ఆపరేషన్ సింధూర్ చేపట్టామని, 9న ఉగ్ర శిబిరాలు ధ్వంసం చేశామని, మన భద్రతా దళాల దాడుల్లో ఒక్క పాక్ పౌరుడు కూడా మరణించలేదన్నారు. పాక్‌లో వందల కిలో మీటర్ల లోపలికి వెళ్లి ఉగ్ర శిబిరాలను ధ్వంసం చేశామన్నారు. భద్రతా దళాల దాడుల్లో పలువురు ఉగ్రవాద నేతలు కూడా హతమయ్యారని వివరించారు. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని ప్రపంచానికి చాటిచెప్పామని, పాకిస్థాన్ దాడుల్లో ఇక్కడి గురుద్వారా, దేవాలయం ధ్వంసమయ్యాయని హోంశాఖ మంత్రి తెలియజేశారు.

మొదటి పేజీ తరువాయి

# అఖిలపక్షంకన్నా ఎన్నికల ప్రచారమే ముఖ్యమా?

మోదీపై ఖర్గే చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.దీంతో నడ్డా చర్యలను తీవ్రంగా తప్పుపట్టిన విపక్షాలు క్షమాపణ చెప్పాలంటూ బల్లలు చరుస్తూ ఆందోళన చేపట్టాయి. అనంతరం ఖర్గే కూడా మాట్లాడుతూ.. ఎన్డీయే ప్రభుత్వంలో తాను గౌరవించే మంత్రుల్లో నడ్డా కూడా ఒకరని, అయినప్పటికీ తనపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం శోచనీయమన్నారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. వెంటనే కేంద్ర మంత్రి నడ్డా స్పందిస్తూ.. ఇప్పటికే తన మాటలు వెనక్కి తీసుకున్నానని, క్షమాపణ కూడా చెప్పానని అన్నారు. నరేంద్ర మోదీ ప్రపంచంలోనే అత్యంత ఆదరణ ఉన్న నాయకుడు. అందుకు భాజపానే కాదు దేశం మొత్తం గర్విస్తోందని కేంద్ర మంత్రి నడ్డా పేర్కొన్నారు. ఖర్గే మాత్రం ఆయన స్థాయిని పట్టించుకోకుండా అభ్యంతరకరంగా మాట్లాడారని విమర్శించారు. కాంగ్రెస్ అధ్యక్షుడికి సుదీర్ఘ అనుభవం ఉన్నప్పటికీ తన పరిధిని దాటి ప్రధానిపై వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. అవి ఆయన స్థాయికి తగినట్లు- లేవని, వాటిని రికార్డుల నుంచి తొలగించాల్సిన అవసరం ఉందని జేపీ నడ్డా పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్, పహల్గాం ఉగ్రదాడిపై ఉభయసభల్లో చర్చ జరుగుతుండగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సభలో లేకపోవడాన్ని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే తప్పుపట్టారు. తామంతా అఖిల పక్ష సమావేశంలో పాల్గొంటే ఆయన బీహార్‌లో రాజకీయ ర్యాలీలో పాల్గొన్నారని అన్నారు. ఇంతటి క్లిష్ట సమయంలో ఎన్నికల ప్రచారానికి వెళ్లడం అవసరమా అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ప్రభుత్వ రంగ సంస్థలు ఏర్పాటయ్యాయ్యాయని ఖర్గే తెలిపారు. తమరు ప్రభుత్వ రంగ కార్ఖానాలు కాదు.. అబద్ధపు కార్ఖానాలు ఏర్పాటు- చేశారని అన్నారు. కీలకమైన అంశంపై పార్లమెంటులో చర్చ జరుగుతుంటే ప్రధాని నరేంద్రమోడీ సభలో లేరని, కీలకమైన చర్చను వదిలేసి బిహార్ ఎన్నికల ప్రచారానికి వెళ్లారని విమర్శించారు. పహల్గాం ఉగ్రదాడి ఈ ఏడాది ఏప్రిల్ నెలలో జరిగిందని తెలియజేశారు. పార్లమెంటుకు రాకుండా ఎన్నికల ప్రచారానికి వెళ్లడమే దేశభక్తి అవుతుందా? అని ప్రశ్నించారు. పార్లమెంటు- సమావేశాలు నిర్వహించాలని అడిగితే మోడీ స్పందించలేదని, ఘటన జరిగిన 3 నెలల తర్వాత పార్లమెంటులో చర్చ పెట్టారని మండిపడ్డారు. విపక్షాలు పాకిస్థాన్ కు మద్దతు ఇస్తున్నాయని అసత్య ఆరోపణలు చేస్తున్నారని, అసత్యాలతో ఎక్కువకాలం ప్రజలను మభ్య పెట్టలేరని అన్నారు. తాము ఎప్పుడూ పాకిస్థాన్ కు మద్దతు ఇవ్వలేదని, ఇవ్వబోము అని చెప్పారు. కాంగ్రెస్ దేశాన్ని నిర్మించిన పార్టీ.. కాంగ్రెస్ కు చాలా చరిత్ర ఉందని కొనియాడారు. పహల్గాం ఘటనతో సంబంధం లేని అంశాలను లేవనెత్తుతున్నారని, పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని పోషిస్తోందని ధ్వజమెత్తారు. తాము మొదట నుంచి చెబుతున్నామని, ఉగ్రవాద సమస్య బిజెపి హయాంలో మూడింతలు అయ్యిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉగ్రవాదాల మూలాలు దెబ్బతీస్తున్నట్లు- కేంద్ర హోం మంత్రి అమిత్ షా జమ్మూకశ్మీర్ పర్యటనలో చెప్పారని అన్నారు. పాక్ ఉగ్రవాదులు పహల్గాం వరకు ఎలా వచ్చారని, పహల్గాం దాడికి 3 రోజుల ముందు ప్రధాని జమ్మూ పర్యటన రద్దు చేసుకున్నారని ఎద్దేవ చేశారు. ప్రధాని పర్యటన రద్దు చేసుకుంటారని.. పర్యాటకులను ఎలా అనుమతించారని నిలదీశారు. పహల్గాం దాడి కచ్చితంగా భద్రతా వైఫల్యమని జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ అన్నారని మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. అన్నీ తన ఘనతగా చెప్పుకునే జవాబుదారీ మోడీ.. పహల్గాం ఘటనకు ఎందుకు బాధ్యత వహించరు? అని మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. సైనికులు సాధించిన విజయాన్ని కూడా రాజకీయం చేయడం తగదని.. ఆపరేషన్ సిందూర్ లో భారత విజయంపై కాంగ్రెస్ కూడా విజయోత్సవ ర్యాలీలు నిర్వహించిందని మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు.

మొదటి పేజీ తరువాయి

# ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రమూకలకు బుద్ధి చెప్పాం

పాక్‌కు చిరకాలం గుర్తుండి పోయే సమాధానం ఇచ్చాం. పాక్ డీజీఎం అర్ధరాత్రి ఫోన్ చేసి దాడులు ఆపాలని బతిమాలితేనే ఆపరేషన్ సిందూర్ నిలిపివేశామని అన్నారు. ఈ ఆపరేషన్ సందర్భంగా త్రివిధ ధళాలకు సంపూర్ణ స్వేచ్ఛ నిచ్చామని మోదీ తెలిపారు. భారత సైన్యం పాక్‌లో ఉగ్రవాద స్థావరాలను మట్టుబెట్టిందని, ఊహలకు కూడా అందని విధంగా టెర్రరిస్టులను శిక్షించామని, ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదులను మట్టిలోనే కలిపేశామని అన్నారు. ఏప్రిల్ 22న కేవలం 22 నిమిషాల్లో ఆపరేషన్ పూర్తి చేశామన్నారు. మతాల మధ్య చిచ్చు పెట్టేందుకే పహల్గాం దాడులు అన్నారు. ఈ దాడి తర్వాత ఉగ్రవాదులను మట్టిలో కలుపుతామని ప్రతినబూనాం. ద్రోహులకు కలలో కూడా ఊహించని విధంగా శిక్షిస్తామని చెప్పాం. ఉగ్రవాదులకు గట్టి గుణపాఠం చెప్పాలని అఖిలపక్ష భేటీలోనూ చర్చించాం. పాక్ భూభాగంలోకి వెళ్లి ఉగ్రస్థావరాల్ని ధ్వంసం చేశాం. పాక్ ఎయిర్ బేస్‌లు ఇప్పటికీ ఐసీయూలో ఉన్నాయి. అణుబాంబులు బెదిరింపులు చెల్లవని పాక్‌ను హెచ్చరించాం. 193 దేశాల్లో 190 దేశాలు ఆపరేషన్ సిందూర్‌ని సమర్థించాయి. పాక్‌కు కేవలం మూడు దేశాలే అండగా నిలిచాయని అన్నారు. ఆపరేషన్ సిందూర్‌ను కాంగ్రెస్ మాత్రమే తప్పుపడుతోందని,స్వార్థ రాజకీయాల కోసం సైనికుల పరాక్రమాలను తక్కువ చేస్తోంది. తమ స్వార్థ రాజకీయాల కోసం కాంగ్రెస్ నేతలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మోడీ మండిపడ్డారు.తద్వారా సైన్యం మనోస్థయిర్యాన్ని దెబ్బతీస్తున్నారు. మీడియా హెడ్‌లైన్లలో వచ్చేందుకు కొందరు నేతలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. కాంగ్రెస్ నేతలు మీడియా హెడ్‌లైన్లలో ఉండొచ్చేమో గానీ.. ప్రజల మనస్సుల్ని గెలవలేరని అన్నారు. పాకిస్థాన్‌ను కాంగ్రెస్ వెనకేసుకురావడం దౌర్భాగ్యం. సర్జికల్ ÷-టస్ట్రైక్స్ విషయంలోనూ కాంగ్రెస్ నేతలు ఇలాగే మాట్లాడారు. పైలట్ అభినందన్ పాక్‌కు చిక్కినప్పుడూ ఇలాగే మాట్లాడారు. పాక్ నుంచి అభినందన్‌ను మోదీ ఎలా తెస్తారో చూస్తామన్నారు. మేం ఆయన్ను సురక్షితంగా భారత్‌కు తీసుకొచ్చాం. విపక్షాల తీరు చూసి దేశమంతా నవ్వుకుంటోంది. భారత రక్షణ దళాల శక్తి, సామర్థ్యాలపై పూర్తి విశ్వాసం ఉంది. భారత రక్షణ దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చాం. నేనెప్పుడూ భారత ప్రజల పక్షమే. భారతీయుల భావనలతో నా స్వరం మిళితం చేసుకొని ముందుకెళ్తున్నా. ఆపరేషన్ సిందూర్ సమయంలో నాపై నమ్మకం ఉంచినందుకు దేశ ప్రజలకు రుణపడి ఉన్నానని మోడీ అన్నారు. పాకిస్థాన్ మళ్లీ ఎలాంటి కుయుక్తులు చేసినా ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుంని స్పష్టం చేశారు. పాక్ ఎలాంటి దుశ్చర్యలకు పాల్పడినా దీటుగా బదులిస్తాంఅని ప్రధాని మోదీ హెచ్చరించారు. పహల్గాం దాడి ఉగ్రవాదులను సైతం మట్టు-బెట్టామన్నారు. ఆపరేషన్ మహాదేవ్ చేపట్టి ఉగ్రవాదుల్ని ఏరివేస్తున్నట్లు- చెప్పారు. ..

మొదటి పేజీ తరువాయి

# దమ్ముంటే ట్రంప్ వ్యాఖ్యలను ఖండించాలి

ఈ ఆపరేషన్‌కు సంబంధించిన సున్నితమైన వివరాలను దాయాదికి వెల్లడించారు. అర్ధరాత్రి 1.05 గంటలకు ఆపరేషన్ ప్రారంభమైందని.. 1.35కు పాకిస్థాన్‌కు ఫోన్ చేసి సైనికేతర లక్ష్యాలను ఛేదించామని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారన్నారు. ఉద్రిక్తతలు పెంచే ఆలోచన లేదని దాయాదితో చెప్పామన్నారు. అంటే.. పాక్‌తో యుద్ధం చేసే ఆలోచన లేదని ఆయన చెప్పకనే చెప్పారని రాహుల్ గాంధీ విమర్శించారు.పాక్ విజ్ఞప్తి మేరకు యుద్ధాన్ని ఆపామని ప్రభుత్వం చెబుతోంది. మరోవైపు.. భారత్-పాక్ యుద్ధాన్ని తానే ఆపానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటివరకు 29 సార్లు చెప్పుకొన్నారు. ఇందిరా గాంధీలా ధైర్యం ఉంటే.. ట్రంప్ 'అబద్ధాలకోరు' అని, భారత్ యుద్ధవిమానాలకు ఎటువంటి నష్టం వాటిల్లలేదని ప్రధాని మోదీ లోక్‌సభలో ప్రకటించాలని రాహుల్ డిమాండ్ చేశారు. 'ఆపరేషన్ సిందూర్'కు ముందు అన్ని పార్టీలు ఏకతాటిపై నిలిచాయని, తాను పహల్గాం దాడి బాధిత కుటుంబాలను పరామర్శించినట్లు- తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి అమానుషమని, ఈ దాడి అనంతరం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు ప్రతిపక్షాలు ముక్తకంఠంతో ప్రభుత్వానికి మద్దుతు తెలిపాయని, ఇందుకు తాము గర్విస్తున్నామని రాహుల్ గాంధీ అన్నారు.హహల్గాం ఉగ్రదాడిలో పర్యాటకులను అత్యంత కిరాతకంగా కాల్చి చంపారని రాహుల్ అన్నారు. ఉగ్రదాడిలో పిల్లలు, యువకులు, వృద్ధులు చనిపోయారని, భార్య కళ్ల ముందే భర్తను కాల్చి చంపేశారని ఆవేదన వ్యక్తం చేసారు. విపక్షాలుగా దేశ భద్రత విషయంలో తాము ప్రభుత్వానికి అండగా నిలిచామని, ఆపరేషన్ సిందూర్‌కు ముక్తకంఠంతో మద్దతు తెలిపామని చెప్పారు.

మొదటి పేజీ తరువాయి

# బిసి రిజర్వేషన్ల కోసం 72 గంటల నిరాహార దీక్ష

**ప్రభుత్వ అనుమతితో 4 నుంచి దీక్షకు దిగుతా**
**లేదంటే ఎక్కడుంటే అక్కడే దీక్ష చేస్తా**
**జాగృతి అధ్యక్షురాలు కవిత హెచ్చరిక**

హైదరాబాద్,జూలై29(సమయజ్యోతి): బీసీ రిజర్వేషన్ల సాధన కోసం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఆగస్టు 4, 5, 6 తేదీల్లో తాను 72 గంటల పాటు నిరాహార దీక్ష చేయబోతున్నానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మంగళవారం ప్రకటించారు. ప్రభుత్వ అనుమతి కోరి దీక్షకు దిగుతానని ఒక వేళ అనుమతి ఇవ్వకపోతే ఎక్కడ కూర్చుంటే అక్కడే నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు. ఉమ్మడి రాష్ట్రంలో అంబేద్కర్ విగ్రహ సాధన కోసం తాను 72 గంటలు దీక్ష చేస్తే నాటి కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వం దిగివచ్చిందని గుర్తు చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో కవిత మీడియాతో మాట్లాడుతూ .... 2018 పంచాయతీ రాజ్ సవరణ చట్టాన్ని సవరణ చేస్తూ తెలంగాణ జాగృతి చేసిన డిమాండ్ తోనే రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ చేసిందని చెప్పారు. తమిళనాడులో గవర్నర్ జాప్యం చేస్తే కోర్టుకు వెళ్లి తీర్పు తెచ్చుకున్నారని మరి తెలంగాణ ప్రభుత్వం గవర్నర్ వద్ద పెండింగ్ అంశంపై కోర్టుకు ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. గవర్నర్, రాష్ట్రపతి వద్ద ఉన్న పెండింగ్ బిల్లులపై తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్తే సానుకూల తీర్పు వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే కోర్టులో కేసు వేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీజేపీకి ఉన్న ఒప్పందం కారణంగానే రేవంత్ రెడ్డి ప్రభుత్వం కోర్టుకు వెళ్లడం లేదని కవిత ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలన్నా రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో కేసు వేయాలన్నారు. తాము ఢిల్లీలో చేసే ధర్నాకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అంటు-న్నారు... ఇదేమైనా సత్రం భోజనమా ? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అఫీషియల్ గా అఖిలపక్షంను ఢిల్లీకి తీసుకువెళ్లాలని డిమాండ్ చేశారు. అఖిలపక్షం ఢిల్లీకి రావాలని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేలు, అన్ని రాజకీయ పార్టీలకు ప్రభుత్వం లేఖలు రాయలన్నారు. పొన్నం ప్రభాకర్ బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీహార్ అసెంబ్లీ ఎన్నికల కోసం డ్రామా చేస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా శూన్యం అని రిజర్వేషన్ల విషయంలో బీజేపీ తప్పించుకుంటోందని విమర్శించారు. బీజేపీ బీసీ సీఎం, బీసీ పీఎం అంటు-న్న బీజేపీకీ బీసీలపై చిత్తశుద్ధి లేదని కవిత ధ్వజమెత్తారు.

# మానవత్వం చాటుకున్న రాహుల్

న్యూఢిల్లీ,జూలై29(సమయజ్యోతి): కాంగ్రెస్ అగ్ర నాయకుడు, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి మానవత్వం చాటుకున్నారు. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా జమ్మూ కాశ్మీర్‌లోని పూంచ్ సెక్టార్‌లో పాకిస్తాన్ సైన్యం జరిపిన కాల్పుల్లో తల్లిదండ్రులను కోల్పోయిన 22 మంది పిల్లలను దత్తత తీసుకోవాలని ఆయన నిర్ణయించుకున్నారు. కాంగ్రెస్ అగ్రనేత నిర్ణయంపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. కాగా, పహల్గాంలో ఏప్రిల్ 22న ఉగ్రదాడి జరిగిన విషయం తెలిసిందే. దాడిలో 26 మంది టూరిస్టులు చనిపోయారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారం భారత ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్ చేపట్టింది.



# రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులను ఆధునికరిస్తాం

**ప్రాజెక్టుల్లో పేరుకున్న పూడికను తొలగిస్తాం**
**26 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్న సాగర్**
**మంత్రి అడ్లూరితో కలసి సాగర్ గేట్లు ఎత్తిన మంత్రి ఉత్తమ్**

నాగార్జునసాగర్,జూలై29(సమయజ్యోతి): రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులను ఆధునికరిస్తామని,అలాగే పూడిక తీస్తామని ,రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన రాష్ట్ర ఎస్సీ ,ఎస్టీ ,మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి, నల్గొండ జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి నాగార్జునసాగర్ క్రస్ట్ గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ చేతుల మీదుగా శంకుస్థాపన చేయబడిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఒక ఆధునిక దేవాలయం అని అన్నారు. నాగార్జున సాగర్ మనకు ఆధునిక దేవాలయం అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సాగర్ నుంచి గేట్లు ఎత్తడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. 18 ఏళ్ల తర్వాత జులైలోనే నాగార్జున సాగర్ జలాశయం నిండిందని తెలియజేశారు. సాగర్ కు దివంగత ప్రధాని నెహ్రూ గాంధీ పునాది వేస్తే దివంగత ప్రధాని ఇందిరాగాంధీ ప్రారంభించారని, 26 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించిన గొప్ప ప్రాజెక్టు ఇది అని కొనియాడారు. సాగర్ కాలువల ద్వారా రెండు రాష్ట్రాల్లోని ప్రతీ ఎకరాకు నీరు చేరిందని, మన రాష్ట్రంలో రికార్డు స్థాయిలో వరి పండిందని ఉత్తమ్ కుమార్ పేర్కొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# కాశ్మీర్‌లో సాధారణ పరిస్థితి ఉందని ఎలా చెబుతారు

భార్య కళ్లముందే శుభమ్ అనే వ్యక్తిని చంపేశారని అన్నారు. పహల్గాంలో పర్యాటకుల దగ్గర భద్రతా సిబ్బంది ఎందుకు లేరని సూటిగా ప్రశ్నించారు. పర్యాటకుల భద్రత కేంద్ర ప్రభుత్వానిది కాదా? అంటూ నిలదీశారు. ఇది నిఘా సంస్థల వైఫల్యం కాదా? అని ధ్వజమెత్తారు.పహల్గాం ఉగ్రదాడి బాధ్యత ఎవరిది? ప్రధాన మంత్రిదా? హోం మంత్రిదా? రక్షణ మంత్రిదా? నేషనల్ సెక్యూరిటీ- అడ్వయిజర్‌దా? ఎవరైనా రాజీనామా చేశారా? అని ప్రశ్నించారు. జాతీయ భద్రత విషయంలో తీవ్రలోపం జరిగిందన్నారు. ఉగ్రవాదాన్ని తుదముట్టించామని అమిత్‌షా చెబుతున్నారని, అయితే కశ్మీర్‌లో గతంలోనూ టీఆర్‌ఎఫ్ దాడులు చేసిందని గుర్తు చేశారు. టీఆర్‌ఎఫ్ వరుస దాడులు చేస్తుంటే కేంద్రం ఏం చేస్తోందన్నారు. రక్షణమంత్రి గంటసేపు సభలో చాలా విషయాలు మాట్లాడారని, కానీ ఒక పాయింట్ ప్రస్తావించలేదన్నారు. ఏప్రిల్ 12న పట్టపగలే ఉగ్రదాడి ఎలా, ఎందుకు జరిగిందో చెప్పలేదన్నారు.2008 బాట్లా హౌస్ ఎన్‌కౌంటర్‌లో టెర్రరిస్టులను చంపినందుకు సోనియా గాంధీ కంటతడిపెట్టారంటూ హోంమంత్రి అమిత్‌షా ఆరోపించడాన్ని ప్రియాంక గాంధీ తిప్పికొట్టారు. తన కుటుంబం కూడా వ్యక్తిగతంగా నష్టపోయిందన్నారు. ఉగ్రవాదుల చేతిలో తన తండ్రి ప్రాణాలు కోల్పోయినప్పుడు తన తల్లి కన్నీళ్లు పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# గంజాయి కేసుల చేదనలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన సిబ్బందికి ప్రోత్సాహకాలు, ప్రసంశ పత్రాలు అందజేసిన జిల్లా ఎస్పీ.

**సమయజ్యోతి న్యూస్ సిరిసిల్ల ప్రతినిధి.**

గంజాయి అక్రమ రవాణాపై,గంజాయి కేసులలో నిందుతులుగా ఉన్నవారిపై పటిష్ట నిఘా జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఐపిఎస్.జిల్లాలో ఆరు నెలల వ్యవధిలో 37 కేసులలో 95 మంది అరెస్ట్,3.500 గ్రాముల గంజాయి,12 గంజాయి చెట్లు స్వాధీనం.జిల్లాలో గంజాయి అక్రమ రవాణా,గంజాయి కేసులల్లో నిందుతులుగా ఉన్నవారిపై నిఘా కఠినతరం చేసి గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని సిబ్బందికి సూచించారు.జిల్లా పోలీస్ కార్యాలయంలో గంజాయి కేసుల చేదనలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పోలీస్ సిబ్బందికి ప్రోత్సాహకాలు,ప్రసంశ పత్రాలు అందించి అభినందించిన జిల్లా ఎస్పీ.జిల్లాలో గంజాయి నిర్మూలనకు పటిష్ట చర్యలు తీసుకోవడం జరుగుతుందని, గంజాయి నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని,గంజాయి కొన్న,సేవించిన,రవాణా చేసిన,విక్రయించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి జిల్లాలో స్పెషల్ డ్రైవ్ లు,నార్కోటిక్ జగిలాలతో తనిఖీలు చేపడుతూ అక్రమ గంజాయి రవాణాపై,గంజాయి కేసులల్లో నిందుతులుగా ఉన్న వారిపై జిల్లా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి ఉక్కుపాదం మోపుతున్నారన్నారు.,గడిచిన ఆరు నెలల్లో జిల్లాలో 37 కేసులలో 95 మందిని అరెస్ట్ చేసి 3.500 గ్రాముల గంజాయి,12 గంజాయి చెట్లు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు.జిల్లాలో గంజాయికి సంబంధించిన సమాచారం సబంధిత పోలీస్ వారికి అందించి గంజాయి రహిత జిల్లాగా మర్చడంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని కోరారు.



# నిర్మల్ నివాసి డాక్టర్ దామెర రాములుకు సి ఎన్ ఆర్ అవార్డు

**సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో జూలై 29.**

నిర్మల్ నివాసి డాక్టర్ దామెర రాములుకు సమైక్య ఆదిలాబాద్ జిల్లా నుండి సి ఎన్ ఆర్ అవార్డు లభించింది. యాదాద్రి భువనగిరి జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరిలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాల సి ఎన్ ఆర్ అవార్డుల సమావేశంలో ఆయనను సత్కరించి సి ఎన్ ఆర్ అవార్డును ప్రదానం చేశారు.ఈ సమావేశంలో సి ఎన్ ఆర్ 94వ జయంతి సందర్భంగా తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి కోనూరు లక్ష్మణ్ తెలంగాణ సాహిత్య అకాడమీ మొదటి అధ్యక్షురాలు నందిని సిద్ధారెడ్డి మరియు ఇతర ప్రముఖుల చేతుల మీదుగా సి ఎన్ ఆర్ అవార్డును అందుకున్నారు.



# నాగులపంచమి పర్వదినం.. భక్తులకు ఆవుపాలు పంపిణీ

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

నాగుల పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని బాల్కొండ మండల కేంద్రంలోని మంగళవారం హనుమాన్ ఆలయం వద్ద భక్తులు భూస సత్యనారాయణ ఆధ్వర్యంలో గణేష్ పంతులు చేతుల మీదుగా భక్తులకు ఆవుపాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఏటా నాగుల పంచమి పర్వదినం రోజున సత్యనారాయణ ఆవుపాలను పంపిణీ చేయడం విశేషం.



# ఆన్లైన్ మోసానికి గురై పోలీసులను ఆశ్రయించిన బాధితుడు...

## సైబర్ క్రైమ్ కేసు నమోదు

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

బాల్కొండ మండల కేంద్రంలో ఆన్లైన్ మోసానికి గురై, మొత్తంగా రూ.1,71,690/-లను పలు దఫాలుగా పోగొట్టుకున్న బాధితుడు మాలెం సత్యసాగర్, స్థానిక ఎస్సై శైలేందర్ ను ఆశ్రయించగా సైబర్ క్రైమ్ కేసు నమోదయింది. బాధితుడి వివరాలు ఇలా ఉన్నాయి. 27న ఫోన్ కాల్ వచ్చింది. కాల్ చేసిన వ్యక్తి తాను అమెజాన్ డెలివరీ హబ్ నుండి మాట్లాడుతున్నానని, బాల్కొండ వద్ద ఒక డెలివరీ హబ్ ఏర్పాటు చేయాలనుకుంటున్నామని, దానికి మీరు నమోదు కావాలంటే ముందుగా డబ్బు చెల్లించాలనగా, అతని మాటలు నమ్మి, ఫోన్ పే ద్వారా రూ.17,700/- పంపించాడు. తర్వాత 25.07.2025న ఒప్పందం కోసం 28,972/- పంపించాడు. అదే నంబర్ నుండి మరో కాల్ వచ్చి, “మెటీరియల్, కంప్యూటర్లు మరియు డెస్క్టాప్ కోసం డబ్బు పంపండి” అని చెప్పడంతో, అజ్ఞాత వ్యక్తి కాల్ చేసి తనను అభిషేక్ అని పరిచయం చేసుకుని విజయవాడ నుండి అమెజాన్ డెలివరీ హబ్ పరిశీలన కోసం వచ్చానని చెప్పి, ఆధార్, పాన్ కార్డు కాపీలు మరియు ఫోటోలు తీసుకున్నాడు. మరోసారి కాల్ వచ్చి డబ్బు అడిగిన సమయంలో బాధితుడు మోసపోయినట్టు గ్రహించి సైబర్ క్రైమ్ హెల్ప్లైన్ 1930కి కాల్ చేసి, పోలీస్ స్టేషన్కు వచ్చి ఫిర్యాదు చేశాడు.

# ప్రజల ఆరోగ్యాల పరిరక్షణ బాధ్యత మీదే

## వైద్యాధికారులతో కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

## మాక్లూర్ లో విస్తృత తనిఖీలు నిర్వహించిన జిల్లా పాలనాధికారి

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి నిజామాబాద్, బ్యూరో**



ప్రజల ఆరోగ్యాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వ వైద్యాధికారులదేనని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఆయన మాక్లూర్ మండల కేంద్రంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్వాడి సెంటర్, మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం, వ్యవసాయ సహకార సంఘం ఎరువుల గోడౌన్, శాఖా గ్రంథాలయం, సబ్ పోస్టాఫీస్ తదితర కార్యాలయాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శిని ఇందిరమ్మ ఇళ్ళ ప్రగతి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముందుగా మాక్లూర్ పీ.హెచ్.సీని సందర్శించిన కలెక్టర్, ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్ , ల్యాబ్, ఇన్ పేషంట్ వార్డు, వ్యాక్సినేషన్ రూమ్ తదితర విభాగాలను తనిఖీ చేశారు. మెడికల్ ఆఫీసర్ తో పాటు, విధుల్లో ఉన్న సిబ్బంది హాజరును పరిశీలించారు. ఆరోగ్య కేంద్రం ద్వారా ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. సీబీపీ, షుగర్, రక్తపోటు తదితర వ్యాధుల నిర్ధారణ కోసం సగటున ప్రతిరోజు ఎన్ని రక్తపరీకలు జరుపుతున్నారు, వాటి ఫలితాలను ఎలా తెలియజేస్తున్నారని ప్రశ్నించారు. రక్త పరీక్షల నిర్వహణ వివరాలతో కూడిన రికార్డులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ప్రభుత్వ బడులు, వసతి గృహాలలో విద్యార్థిని విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించే సమయంలో పిల్లల రక్త నమూనాలను సైతం సేకరించాలని, పీ.హెచ్.సీలలో పరీక్షలు జరిపి వాటి ఫలితాల ఆధారంగా అవసరమైన విద్యార్థులకు మెరుగైన చికిత్సలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. వ్యాక్సినేషన్, టీ.బీ నిర్ధారణ పరీక్షలు శత శాతం జరిగేలా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, పాముకాటు మందు, ఇతర అన్ని రకాల ఔషధాలు అందుబాటులో ఉండాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. పీ.హెచ్.సీతో పాటు దీని పరిధిలోని ఆరు సబ్ సెంటర్ల ద్వారా అందించాల్సిన వైద్య సేవలు పక్కాగా ప్రజలకు అందేలా పర్యవేక్షణ జరపాలని మెడికల్ ఆఫీసర్ కు సూచించారు. ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే, వాటిని వెంటనే సరిదిద్దుకోవాలని, ప్రజల ఆరోగ్యాలను పరిరక్షించే గురుతర బాధ్యతను సమర్ధవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ హితవు పలికారు. మాతాశిశు మరణాలు చోటుచేసుకోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ఒకవేళ ఇలాంటి దురదృష్టకర సంఘటనలు చోటుచేసుకుంటే వెంటనే పై అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. దీనివల్ల ఆ తరహా సంఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. అనంతరం కలెక్టర్ అంగన్వాడీ సెంటర్ ను సందర్శించి, అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని, కేంద్రాన్ని సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అంగన్వాడీ సెంటర్ కు ఆనుకుని ఉన్న ఎంఈఓ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించగా, పలువురు సిబ్బంది విధుల్లో లేకపోవడాన్ని గమనించి హాజరు పట్టికను తనిఖీ చేశారు. సిబ్బంది గైర్హాజరు గురించి ఇంచార్జ్ ఎం.ఈ.ఓ సత్యనారాయణను ఆరా తీయగా, సెలవులో ఉన్నారని తెలిపారు. అక్కడినుండి కలెక్టర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎరువుల గోడౌన్ ను సందర్శించి, ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఎరువుల కోసం వచ్చిన రైతులను పలుకరించి, అవసరాలకు సరిపడా ఎరువులు అందిస్తున్నారా అని ఆరా తీశారు. ఎరువులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయని, ఎలాంటి కొరత లేదని రైతులు తెలిపారు. గోడౌన్ వద్ద ఎరువుల స్టాక్ వివరాలతో కూడిన బోర్డును ప్రదర్శించడాన్ని గమనించిన కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. కాగా, శాఖా గ్రంథాలయాన్ని కలెక్టర్ సందర్శించిన సమయంలో అది మూసి ఉండడం పట్ల కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుగ్గారెడ్డిని ఫోన్ ద్వారా సంప్రదించి, లైబ్రరీ ఎందుకు తాళం వేసి ఉందని నిలదీశారు. జిల్లాలోని 24 గ్రంథాలయాలు సమయ పాలన పాటించేలా పర్యవేక్షణ జరపాలని, ఇకనుండి రోజువారీ నివేదికను తనకు పంపాలని ఆదేశించారు. లైబ్రరీని తెరిపించి, అందుబాటులో ఉన్న పత్రికలు, పుస్తకాలు, మ్యాగజైన్స్, పోటీ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ ను కలెక్టర్ పరిశీలించారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు అన్ని గ్రంథాలయాలు తెరిచి ఉండేలా చూడాలన్నారు. అనంతరం సబ్ పోస్టాఫీస్ ను సందర్శించిన కలెక్టర్, ఆసరా పెన్షన్లు పంపిణీ చేస్తున్నారా అని ఆరా తీశారు. నగదు కొరత నెలకొనకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, లబ్దిదారులకు సకాలంలో పెన్షన్ మొత్తాలను అందజేయాలని సూచించారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాల ప్రగతి గురించి పంచాయతీ కార్యదర్శిని వాకబు చేశారు. మంజూరీలు పొందిన ప్రతి లబ్ధిదారు ఇంటి నిర్మాణం చేపట్టేలా ప్రోత్సహించాలని, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ జరుపుతూ అవసరమైన వారికి ఐకేపీ ద్వారా రుణం అందేలా చొరవ చూపాలని సూచించారు.

# శ్రీరామ్ సాగర్ కు భారీగా వరద

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు రిజర్వాయర్ లోకి వరదలు రావడం భారీగా పెరుగుతోంది. ప్రస్తుతం గోదావరి నది ద్వారా ఒక లక్ష ఐదువేల క్యూసెక్కుల నీరు ఇన్ఫ్లోలుగా రిజర్వాయర్లోకి వచ్చి చేరుతున్నాయి. గత మూడు రోజుల నుండి వరదలు రావడం పెరగడంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రిజర్వాయర్ నీటిమట్టం వేగంగా పెరుగుతోంది. 10 91 అడుగుల గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం గల రిజర్వాయర్ నీటిమట్టం ప్రస్తుతం 10 76 అడుగులకు చేరుకుంది. మహారాష్ట్ర ప్రాంతం నుండి గోదావరి ద్వారా ఇంకా ఇన్ఫ్లోలు వస్తుండడంతో నీటిమట్టం క్రమంగా పెరుగుతున్నట్లు అధికారులు తెలిపారు.



# లయన్స్ భవనంలో ఉచిత కంటి వైద్య శిబిరం

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

బాల్కొండ మండలం కిసాన్ నగర్ లోని లయన్స్ భవనంలో మంగళవారం బాల్కొండ లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. ఆర్మూర్ లయన్స్ కంటి ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ పుణ్యరాజు 20 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో మోతి బిందు ఉన్న వారిని గుర్తించి శస్త్ర చికిత్సల కోసం ఆర్మూర్ లయన్స్ ఆసుపత్రికి తరలించారు. లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ చాకులింగం, జిల్లా అధ్యక్షుడు జ్ఞాన సాగర్ రెడ్డి, బాల్కొండ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దినేష్ పటేల్, కోశాధికారి వంశీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# నేరాల నివారణే లక్ష్యం

## : ఎస్పీ డా. జి. జానకి షర్మిల

**సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో జూలై 29.**

కడెం పోలీస్ స్టేషన్ ను మంగళవారం జిల్లా ఎస్పి డా.జి. జానకి షర్మిల ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా స్టేషన్ కు సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పెండింగ్ కేసులు, కోర్టు కేసులు, ప్రస్తుతం దర్యాప్తులో వున్న కేసుల గురించి ఎస్ఐ ను అడిగి తెలుసుకున్నారు.అనంతరం సిబ్బందిని ఎవరెవరూ ఏయే విధులు నిర్వహిస్తున్నారు అని అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పైన వెంటనే స్పందిస్తూ బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా భరోసా కల్పించాలని అన్నారు. నేరాల నివారనే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. గంజాయి వినియోగం పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.యువతకు ప్రత్యేకంగా సైబర్ నేరాల నివారణ పై చైతన్యాన్ని తీసుకురావాలని సూచించారు.ఎడ తెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో, పక్కనే కడెం ప్రాజెక్టు ఉన్నందున వరదలు సంభవించే ప్రాంతాల్లో సిబ్బంది చాలా అలర్ట్ గా ఉండాలని, ఏవైనా విపత్కర పరిస్థితులు ఏర్పడితే తక్షణమే అధికారులు, సిబ్బంది సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం సిబ్బంది తో మాట్లాడుతూ... పోలీస్ స్టేషన్ అంతా పరిశుభ్రంగా గా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా ఉంటూ విధి నిర్వహణలో క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. సిబ్బంది కి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని, ఏమైనా ఉంటే తమ దృష్టి కి తీసుకొని రావాలి అని సూచించారు. అనంతరం ఎస్ఐ సాయి కిరణ్ ను, సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



# పారిశుద్ధ్యం చర్యల కోసం.. ఈవోకు బిజెపి వినతి

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు చేపట్టాలని కోరుతూ మంగళవారం ముఖ్య కార్యనిర్వాహణ అధికారి రమేష్ కు మండల బిజెపి అధ్యక్షులు సౌళ్ళ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు కార్యకర్తలు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.కార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శి ఎదునూరి గోపికృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి మల్లారపు సంతోష్ రెడ్డి, మెంగని మహేందర్, మీస శంకర్, చిట్నేని శ్రీనివాస్ రావు, పద్మ, దీటి సత్యం, కాసోడి రమేష్, వరి వెంకటేష్, ఒరగంటి సత్యం, బుర్ర శ్రీనివాస్, పున్నం అనిల్, మద్దికుంట రమేష్, దారవేని రాజు పాల్గొన్నారు



GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/5332

సమయజ్యోతి
ప్రతీ అక్షరం - ప్రజలకోసం
తెలుగు దిన పత్రిక

## సంపాదకీయం

# పులుల సంరక్షణతోనే జీవ వైవిధ్యం !

దేశంలో పర్యావరణంపై ఆసక్తి, శ్రద్ధ లేకుండా పోతోంది. మానవజాతి పెరుగుతున్నా కొద్దీ పక్కనున్న ప్రకృతిని, పర్యావరణాన్ని ధ్వంసం చేస్తున్నారు. అడవులను నరికివేస్తూనే..అడవుల్లోని జంతుజాలాన్ని కూడా ఉనికి లేకుండా చేస్తున్నారు. దీంతో ఇప్పటికే అనేక జంతుజాతులు నశించాయి. మనం బతికితే చాలు...మిగతా ఏమయితే ఏమిటన్న ధోరణి ప్రబలింది. ఈ క్రమంలో అడవుల విధ్వంసంతో జంతుజాలం నశిచింది. ప్రపంచవ్యాప్తంగా విచక్షణారహితంగా అడవుల నరికివేత, అక్రమంగా పులులను వేటాడడం లాంటి పలు కారణాలతో పులి జాతి అంతరించే స్థాయికి చేరడాన్ని గమనించిన ఐరాస ప్రతి ఏట 29 జులై రోజున 'అంతర్జాతీయ పులుల దినం లేదా ఇంటర్నేషనల్ టైగర్ డే' పాటించడం ఆనవాయితీగా మారింది.2010 నుంచి ఇది అమల్లోకి వచ్చింది. పులులను కాపాడుకోవడం, వాటి ఆవాసాలను సంరక్షించుకోవడం, అక్రమ వేటలను మానుకోవడం, జీవ వైవిధ్యాన్ని కాపాడే ప్రాధాన్యాన్ని వివరించడం, టైగర్ ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం చేయడం, టైగర్ రిజర్వులను నియంత్రించడం లాంటి అంశాల్లో సామాన్య జనాలకు అవగాహన కల్పించడానికి ఈ వేదికలను ఉపయోగించుకోవాలి. పిల్లుల జాతిలో అతి పెద్ద జంతువుగా పులికి పేరుంది. 2025 అంతర్జాతీయపులుల దినం ఇతివృత్తంగా మానవులు, పులులు సామరస్యంగా సహజీవనం చేయడం అనే అంశాన్ని తీసుకొని పులుల సంరక్షణ బాధ్యతలను వివరించడం జరుగుతుంది. ఇటీవల ఆదిలాబాద్ కవ్వాల్ రక్షణకు జివో 49ని తెలంగాణ ప్రభుత్వం తీసుకుని వచ్చింది. కానీ అందరూ ఒక్కటై దానిని అమలు చేయకుండా పక్కన పెట్టేయించారు. ఇది అమలు చేయడం ద్వారా పులుల సంరక్షణకు ప్రభుత్వం పూనుకుంది. కానీ గిరిజనుల జీవనానికి ఇది అడ్డంకిగా మారిందన్న ఆందోళనతో పులుల రిజర్వ్ ఫారెస్ట్ రోణ పక్కకు పోయింది. నిజానికి ఇది ప్రజల్లో అవగాహన లేమి కారణంగా జరుగుతున్నదని వేరుగా చెప్పాల్సిన పనిలేదు. జీవవైవిధ్యం కాపాడటంలో పులులదే కీలక పాత్ర. వాటికి తెలియకుండానే అడవిని రక్షిస్తుంటాయి. మొక్కలను తినే జీవ జాతులను పులులు చంపి తినకపోతే అడవి అనేదే మిగలదు. అంటే...సాధు జంతువులను వేటాడుతూ...పులులు ఎకో సిస్టమ్‌ను బ్యాలెన్స్ చేస్తూ ఉంటాయి. అయితే రానురాను అడువులు ధ్వంసం అవుతుండటం వల్ల వీటి సంఖ్య తగ్గిపోతోంది. అవి మనుగడ సాగించేందుకు అవసరమైన అనుకూల వాతావరణం ఉండటం లేదు. క్రమంగా ఇవి అంతరించి పోయే ప్రమాదముందని గుర్తించిన ప్రపంచ దేశాలు, ఏటా జులై 29న అంతర్జాతీయ పులుల దినోత్సవం జరుపుకుంటున్నారు. ఒక పులి సంచరించే ప్రాంతం చుట్టు-పక్కల మరో పులి సంచరించదు. 25 నుంచి 30 కిలోమీటర్ల మేర ఒక పులి తన సామ్రాజ్యాన్ని విస్తరిస్తుంది. ఫుడ్ పిరమిడ్లో అగ్రస్థానంలో ఉండే పెద్ద పులి నివసించాలంటే ప్రాంతంలో చిన్నా, పెద్దా అన్నిరకాల జంతువులుండాలి. మంచి వర్షపాతం ఉండాలి. పచ్చని చెట్లతో కూడిన దట్టమైన అడవి ఉండాలి. అందుకే ఈ లెక్కన ఇప్పుడున్న పరిస్థితుల్లో పులులు. మనుగడ సాగించాలంటే...ఒక్కో పులికి 25 వేల ఎకరాల అడవిని కాపాడుకోవాల్సి ఉంటుందని శాస్త్రవేత్తలు తేల్చిచెప్పారు. పులి తన ప్రాణాలు కాపాడుకోవడానికి నానా తంటాలు పడుతుంది. మూడేళ్ల వయసు రాగానే మగ పులి సొంత సామ్రాజ్యాన్ని ఏర్పాటు- చేసుకునేందుకు ప్రయత్నిస్తుంది. అయితే అడవులు అంతరించడం. అడవుల్లో నీటి కుంటలు లేకపోవడం వల్ల అవి ఊళ్లలోకి రావాల్సి వస్తోంది. నగరాలు పెరగడం, గ్లోబలైజేషన్ ప్రభావంతో రానురానూ అడవులు తగ్గిపోతున్నాయి. ప్రస్తుతం 93 శాతం పులులు కేవలం అడవుల నరికివేత వల్ల అంతరించిపోతున్నాయని ఓ అధ్యయనంలో వెల్లడైంది. ప్రస్తుతం కేవలం ఆరు జాతుల పులులు మాత్రమే మనుగడ సాగిస్తున్నాయి. అనేక టైగర్ జాతులు పూర్తిగా అంతరించి పోయాయి. 2014 వరల్డ్ వైడ్ ఫండ్ లెక్కల ప్రకారం వందేళ్ల క్రితం సుమారు లక్ష పులులు ఉండేవి. కాని ఇప్పుడు వాటి సంఖ్య చాలా తగ్గిపోయిందని వరల్డ్ వైడ్ ఫండ్ ప్రతినిథులు చెబుతున్నారు. పులుల సంఖ్య పెరగడం ద్వారా ఎకో సిస్టమ్ లో మంచి మార్పులు రావడమే కాకుండా, పర్యాటక రంగం కూడా అభివృద్ధి చెందుతుంది. పులులు అంతరిపోవడానికి వేట, వాతావరణ మార్పులతోపాటు, పులులకు షెల్టర్ లేకపోవడం ముఖ్యమైన కారణాలు. అంతేకాకుండా పులి చర్మం, గోళ్లకు డిమాండ్ ఎక్కువ. చైనీస్ సంప్రదాయ వైద్యంలో పులుల గోళ్లు, పళ్లు,మీసాలను ఉపయోగిస్తారు. వాటి కోసం ఎక్కువ ధర చెల్లిస్తారు. అందుకే పులుల వేట, స్మగ్లింగ్ కూడా ఎక్కువైంది. దీంతో కేవలం పులులు మాత్రమే కాదు. ఇతర జీవులు కూడా మెల్లగా అంతరిస్తున్నాయి. కేవలం అడవుల్ని నరకడం వల్లనే దాదాపు 93 శాతం వాటి ఆవాసాల్ని కోల్పోతున్నాయని సర్వేలు వెల్లడిస్తున్నాయి. పులుల్ని, ఇతర జీవరాశులని సంరక్షించుకోవాలంటే.. అడవులు పెంచడం ఒక్కటే మార్గమని అర్థం అవుతోంది. అడవులు పెంచడం ద్వారా జంతువుల సంఖ్య పెరగడమే కాక పర్యావరణ సమతుల్యం కూడా దెబ్బ తినకుండా ఉంటుంది. వాతావరణ మార్పులు కూడా జంతువులు అంతరించ డానికి కారణం కాబట్టి వాతావరణ మార్పులకు కారణమయ్యే ప్లాస్టిక్, కాలుష్యాన్ని కూడా తగ్గించాల్సిన అవసరం ఏర్పడింది. మనదేశంలో పులి జాతీయ జంతువు కాబట్టి కొంతవరకైనా పులుల్ని కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికైనా మేలుకోకపోతే ఉన్న నాలుగు జాతులు కూడా అంతరించిపోయే ప్రమాదం ఉందని గత కొన్నేళ్ల నుంచి -టైగర్ ట్రాకర్స్ వ్యవస్థను బలపరిచారు. ప్రపంచం మొత్తం మీద ఉన్న పులుల సంఖ్యలో సగానికి పైగా మనదేశంలోనే ఉన్నాయి. పులులను కాపాడుకోవల్సిన అవసరాన్ని మనదేశం ఎప్పుడో గుర్తించింది. 1972లోనే పులిని జాతీయ జంతువుగా ప్రకటించి, తర్వాతి ఏడాది నుంచే ప్రాజెక్ట్ -టైగర్ ను ప్రారంభించింది. పులుల్ని వేటాడే వారికి కఠిన శిక్షలు పడేలా చట్టాలు తెచ్చినా వాటి అంతం ఆగడం లేదు. వాటి సంరక్షణ కోసం భారీగా ఖర్చు చేస్తోంది. దేశంలో 48 పులి అభయారణ్యాలను ఏర్పాటు-చేశారు. పులుల సంరక్షణ గురించి ప్రజల్ని చైతన్యవంతం చేయడం కోసం ఇండియన్ రైల్వే.. టైగర్ ఎక్స్ ప్రెస్ పేరుతో టూరిస్ట్ రైలు సేవలను కూడా ప్రారంభించింది. ఇందులో బాంధవగడ నేషనల్ పార్క్, కన్హా నేషనల్ పార్కులో సఫారీకి తీసుకెళ్తారు.ప్రపంచ పులుల్లో 70 శాతానికి పైగా భారత్‌లోనే ఉండడం విశేషం. నేడు పులుల జనాభా వృద్ధి రేటు- 6.1 శాతంగా నమోదు అవుతున్నది. శతాబ్దం క్రితం ఒక లక్ష వరకు ఉన్న పులులు నేడు కేవలం 5,574 మాత్రమే ఉండడం విచారకరం. పులుల ఆవాసాలైన అడవులను నరికి వేస్తుండటంతో అవి మానవ ఆవాసాల్లోకి రావడం జరుగుతోంది.పులుల్లో చాలా అరుదైన జాతి రాయల్ బెంగాల్ -టైగర్.. దీన్ని పెద్ద పులి అంటారు. ఇది మన దేశం లో తప్ప ఇంకెక్కడా కనిపించదు. బెంగాల్ టైగర్ గాండ్రింపు సుమారు రెండు కిలోమీటర్ల వరకు వినిపిస్తుంది. ఇవి రోజుకు దాదాపు 21 కిలోల మాంసాన్ని తింటాయి. పులులు అడవిలో వాటి సరిహద్దులను అవే ఏర్పాటు- చేసుకుంటాయి. ఆ సరిహద్దులకు లోపల వున్న ప్రాంతమంతా వాటి సామ్రాజ్యమే. ఆ సరిహద్దులు దాటి ఏ ఇతర జంతువులు ప్రవేశించినా వాటికి మరణమే. ప్రతి రెండేళ్లకోసారి ఒక్కో ఆడ పులి రెండు నుంచి నాలుగు పిల్లల్ని పెడుతుంది. పులులు పుట్టిన 18 నెలల నుంచే వేటాడటం మొదలు పెడతాయి. ఇలా పులలను రక్షిస్తేనే అడవులు పెరుగుతాయి. జీవవైవిధ్యం పెరుగుతుందని గుర్తించాలి.

# పంటలు రసాయనాల వినియోగం - ప్రజారోగ్యంపై ప్రభావం



భారతదేశం వ్యవసాయ ఆధారిత దేశం. రుతుపవనాలపై ఆధారపడి సాగే ఈ వర్షాకాలపు వ్యవసాయం (ఖరీఫ్) దేశ ఆహార భద్రతకు వెన్నెముక. ఈ కాలంలో వరి, మొక్కజొన్న, పప్పుధాన్యాలు (కందులు, పెసలు, మినుములు), పత్తి, వేరుశనగ వంటి పంటలను విస్తారంగా సాగు చేస్తారు. వర్షాలు సకాలంలో, సమృద్ధిగా కురిస్తే రైతన్న ముఖంలో సంతోషం వెల్లివిరుస్తుంది. ఈ వర్షాకాల సమయం లో రైతులు ఇంటివద్ద కంటే పొలం వద్దనే పంట పండించే పనిలో నిమగ్నం అవుతారు. కానీ తెగుళ్ల బెడద రైతులను నిరంతరం సవాలు చేస్తూనే ఉన్నాయి. వీటన్నిటిని తట్టుకొని నిలబడడానికి చేసే అప్పులు వాటిని తీర్చాలనే అధిక దిగుబడి ఆశతో, గత్యంతరం లేని పరిస్థితుల్లో రైతులు విత్తనము నాటే రోజునుండి వాడే రసాయన మందులు, ఎరువులు భూమిని, నీటిని కలుషితం చేయడమే కాకుండా, చివరికి ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అధిక తేమ, వెచ్చని వాతావరణం పురుగులకు, తెగుళ్లకు అనుకూలం. దోమపోటు, అగ్గి తెగులు, బూడిద తెగులు, కాండం తొలిచే పురుగులు, పచ్చ పురుగులు, వంటివి వరి, పత్తి, మొక్కజొన్న వంటి పంటలను భారీ నష్టాన్ని కలిగిస్తాయి. వీటికి తోడు కలుపు మొక్కలు పెరగడం కూడా దిగుబడిని తగ్గిస్తుంది. ఈ సవాళ్లను ఎదుర్కోవడానికి, అధిక దిగుబడి సాధించి నష్టాల నుండి బయటపడటానికి రైతులు తరచుగా రసాయన ఎరువులు పురుగు మందులు కలుపు మందులపై ఆధారపడ్డారు.నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి ఎరువులను పంట ఎదుగుదలకు, అధిక దిగుబడికి విరివిగా వాడుతున్నారు. ఇవి పంటలకు తక్షణ పోషణ నిచ్చినప్పటికీ, భూసారాన్ని దీర్ఘకాలంలో దెబ్బతీస్తాయి.కీటకాల బారి నుండి పంటను రక్షించడానికి క్లోరిపైరిఫాస్, ఎండోసల్ఫాన్, మోనోక్రోటోఫాస్, థయోమెథాక్సామ్ వంటి విషపూరిత పురుగు మందులను ఉపయోగిస్తున్నారు. వీటిని పిచికారీ చేయడం ద్వారా పురుగులు నశించినప్పటికీ, అవి పంటపై అవశేషాలుగా మిగిలిపోతాయి.కలుపు మొక్కల నివారణకు గ్లైఫోసేట్, అట్రాజిన్ వంటి కలుపుమందులను వాడుతున్నారు. ఇవి కలుపును సమర్థవంతంగా నివారిస్తాయి కానీ, మట్టిలో కలిసిపోయి భూమిలోని సూక్ష్మజీవులను ప్రభావితం చేస్తాయి.ఈ మందుల వాడకం వల్ల పంట నాణ్యత తగ్గడం, భూగర్భ జలాలు కలుషితం కావడం, పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం వంటి దుష్ప్రభావాలు జరుగుతాయి. ప్రజలు రసాయన ఎరువులు పురుగు మందులతో పండించిన వారి, జొన్న కందులు పెసలు వంటి ఆహార పంటలు వినియోగిండం వలన పురుగు మందులలోని కార్సినోజెనిక్ శరీరంలో చేరడం వలన క్యాన్సర్ లు వచ్చే అవకాశం పెరుగుతుంది.కొన్ని పురుగుమందులు నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతాయి. పార్కిన్సన్స్ వ్యాధి, అల్జీమర్స్, జ్ఞాపకశక్తి లోపం, దృష్టి సమస్యలు, నరాల బలహీనత వంటివి వస్తాయి. పిల్లల్లో ఏకాగ్రత లోపం, అటెన్షన్ డెఫిసిట్ హైపర్‌యాక్టివిటీ డిజార్డర్ వంటి సమస్యలకు కూడా ఇవి కారణమవుతాయని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఎండోక్రైన్ డిస్ట్రప్టింగ్ కెమికల్స్ అని పిలువబడే కొన్ని పురుగుమందులు శరీరంలోని హార్మోన్ల పనితీరును ప్రభావితం చేస్తాయి. ఇది సంతానలేమి సమస్యలు, థైరాయిడ్ సమస్యలు, మధుమేహం, ఊబకాయం వంటివాటికి దారితీస్తుంది. పురుగు మందుల అవశేషాలు జీర్ణ వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. ఇది వాంతులు, విరేచనాలు, కడుపు నొప్పి, కాలేయ సమస్యలు, మూత్రపిండాల వ్యాధులకు దారి తీస్తుంది. పురుగుమందుల స్ప్రేయింగ్ సమయంలో గాలిలో కలిసే రసాయనాలు శ్వాస సంబంధిత సమస్యలను పెంచుతాయి.పిల్లల రోగనిరోధక శక్తిపై, మెదడు పనితీరుపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఈ రసాయనాల అవశేషాలు పంటలలోనే కాకుండా, భూమిలో, నీటిలో, పశువుల దాణాలో కూడా ఉండి, ఆహార గొలుసు ద్వారా మానవుల శరీరంలోకి ప్రవేశిస్తాయి. ఆహార పదార్థాలను ఎంత శుభ్రం చేసినా, లోపల ఇంకిపోయిన రసాయనాలను పూర్తిగా తొలగించడం కష్టం.కావున సేంద్రియ వ్యవసాయం అవశ్యకమై ఉన్నది.అధిక దిగుబడి ఆశతో పంటను కాపాడుకోవడానికి అధిక దిగుబడి సాధించి నష్టాల నుండి బయటపడటానికి రైతులు తరచుగా రసాయన ఎరువులు, పురుగుమందులు, కలుపుమందులపై ఆధారపడతారు.అధిక దిగుబడి పేరుతో రసాయనాలకు అలవాటుపడిన వ్యవసాయ విధానం ప్రస్తుతానికి ఆహార ఉత్పత్తిని పెంచినా, దీర్ఘకాలంలో మానవజాతి మనుగడకు, పర్యావరణానికి పెను ముప్పుగా పరిణమిస్తోంది

**ఇపుడు చేయాలిసింది సేంద్రీయ వ్యవసాయం**

రసాయన ఎరువులు, పురుగుమందులకు బదులుగా సేంద్రీయ ఎరువులు (పశువుల ఎరువు, కంపోస్ట్), జీవన ఎరువులు (బ్యాక్టీరియా, శిలీంధ్రాలు), వేప నూనె వంటి సహజసిద్ధమైన పురుగు నివారణ పద్ధతులను ప్రోత్సహించాలి. పంటల మార్పిడి చేయడం, సరైన సమయంలో విత్తడం, యాంత్రిక పద్ధతులు పురుగులను చేతితో ఏరివేయడం వంటి పద్ధతులను అవలంబించాలి. ఒకే రకమైన పంటను కాకుండా, వాతావరణానికి, నేల స్వభావానికి అనుగుణంగా వివిధ రకాల పంటలను పండించడం వల్ల తెగుళ్ల బెడద తగ్గుతుంది, భూసారం మెరుగుపడుతుంది. ప్రభుత్వం, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు రైతులను సేంద్రీయ వ్యవసాయం వైపు మళ్లించడానికి శిక్షణ కార్యక్రమాలు, ఆర్థిక ప్రోత్సాహకాలు అందించాలి. ప్రజలు కూడా ఆరోగ్య స్పృహతో సేంద్రీయ ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. దీనివల్ల సేంద్రీయ వ్యవసాయానికి డిమాండ్ పెరిగి రైతులు ఆ దిశగా అడుగులు వేస్తారు. ప్రభుత్వం, శాస్త్రవేత్తలు, రైతులు, మరియు వినియోగదారులు అందరూ కలిసికట్టుగా కృషి చేసినప్పుడే ఆరోగ్యకరమైన ఆహారం, ఆరోగ్యకరమైన సమాజం, సురక్షితమైన భవిష్యత్తు సాధ్యమవుతుంది. రసాయన రహిత వ్యవసాయం మన భవిష్యత్ తరాలకు మనం అందించే అత్యంత విలువైన వారసత్వంగా ఉండాలి.

**దుప్పటి. మొగిలి ఉపాధ్యాయులు**
**భూపాలపల్లి**

# పులుల జాడేది?



సమయజ్యోతి ప్రత్యేకం తెలుగు దినపత్రిక

2010లో రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్ లో జరిగిన పులుల సంరక్షణ సమావేశంలో జులై 29న ప్రతి ఏటా అంతర్జాతీయ పులుల దినోత్సవం జరపాలని నిర్ణయించారు..పులుల సహజ ఆవాసాలను పరిరక్షించే విధంగా వ్యవస్థను ప్రోత్సహించడం, పులి సంరక్షణ గురించి ప్రజలలో అవగాహన పెంచి వారినుండి సహాయాన్ని అందుకోవడం వంటి లక్ష్యాలతో ఈ దినోత్సవం ఏర్పడింది.మానవులు మరియు పులుల మధ్య సామరస్యపూర్వక సహజీవనం".అనే థీమ్ తో ఈ ఏడాది అంతర్జాతీయ పులుల దినోత్సవం జరుపుతున్నారు.పులిని రాజసానికి చిహ్నంగా భావిస్తారు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో పులులు మనుగడ కోల్పోతున్నాయి.1973లో పులిని జాతీయ జంతువుగా ఎంపిక చేశారు. ప్రపంచంలో ఉన్న పులుల్లో 75శాతం భారత దేశంలోనే ఉన్నాయి. 1969లో వన్యప్రాణి బోర్డు సింహాన్ని జాతీయ జంతువుగా ప్రకటించింది. అయితే 1973లో సింహానికి జాతీయ జంతు హోదాను తొలగించి.. పులిని జాతీయ జంతువుగా ప్రకటించారు.పులి ఒకప్పుడు పశ్చిమాన తూర్పు అనటోలియా ప్రాంతం నుండి అమూర్ నదీ పరీవాహక ప్రాంతం వరకు, దక్షిణాన హిమాలయాల పర్వత ప్రాంతాల నుండి సుంద ద్వీపాలలో బాలి వరకూ విస్తృతంగా ఉండేది. 20 వ శతాబ్దం ఆరంభం నుండి, పులి జనాభా కనీసం 93% తగ్గిపోయింది. పశ్చిమ, మధ్య ఆసియాలో, జావా, బాలి ద్వీపాల నుండి, ఆగ్నేయ, దక్షిణ ఆసియా, చైనాల్లోని విశాలమైన ప్రాంతాలలో పులి కనుమరుగైపోయింది. నేటి పులి జనాభా సైబీరియా సమశీతోష్ణ అడవుల నుండి భారత ఉపఖండం, సుమత్రాల్లోని ఉపఉష్ణమండల, ఉష్ణమండల అడవుల మధ్య ప్రదేశాల్లో చెదురుమదురుగా విస్తరించి ఉంది. పులిని, 1986 నుండి ఐయుసిఎన్ రెడ్ జాబితాలో అంతరించిపోతున్న జాబితాలో చేర్చారు.1973 లో అప్పటి భారత ప్రధాని ఇందిరా గాంధీ ప్రారంభించిన ప్రాజెక్ట్ టైగర్ అనేక పులుల సంరక్షణా స్థలాలను స్థాపించింది. 1973 లో 1,200 ఉన్న అడవి బెంగాల్ పులుల సంఖ్య 1990 నాటికి 3,500 దాటింది. సంఖ్యను మూడు రెట్లు పెంచిన ఘనత ఈ ప్రాజెక్టుకు దక్కింది, కాని 2007 జనాభా లెక్కల ప్రకారం, ఇది తిరిగి 1400 కు తగ్గింది. పులులు వేటగాళ్ళకు బలవడమే దీనికి కారణం.2022 నాటికి మరలా వీటి సంఖ్య 3160 వరకు చేరింది. భారతదేశంలో పులుల ప్రస్తుత సంఖ్య 3,682 (3,167 నుండి 3,925 మధ్య) అని అంచనా వేయబడింది. జాతీయ పులుల పరిరక్షణ అథారిటీ (ఎన్ టీ సీ ఏ) మరియు భారత ప్రభుత్వం 2023 జూలై 29న విడుదల చేసిన తాజా పులుల అంచనా ప్రకారం ఈ సంఖ్య వెల్లడైంది. 2010 నుండి పులుల సంఖ్య రెట్టింపు అయిందని, ఇది ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశం మరియు ప్రపంచ పులుల ఆవాసాలలో 18% మాత్రమే ఉన్నప్పటికీ, పరిశోధకులు ఇప్పుడు భారతదేశంలో 3,600 కంటే ఎక్కువ పులులు ఉన్నాయనితెలిపారు.ప్రస్తుతం అడవులు తగ్గి పోవడంతో పులులు వంటి అనేక వన్యప్రాణులు జనావాసాల్లోకి వస్తున్నాయి.దీంతో ప్రజలు భయ భ్రాంతులకు గురౌతున్నారు. మానవ మనుగడకు జీవ వైవిధ్యం అత్యంత అవసరం. అడవులను రక్షించడం ద్వారానే వన్యప్రాణులను కాపాడుకోగలం.

**కామిడి సతీష్ రెడ్డి భూపాల్ పల్లి జిల్లా**

**అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకొని )**

# జైనథ్ మండల పశు వైద్యశాల ఆకస్మిక తనిఖీ.

## జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

జిల్లా ఆదిలాబాద్,జైనథ్ మండలం లోని పశు వైద్య శాలను మంగళవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆకస్మికంగా తనిఖీ చేశారు.తనిఖీ సందర్భంగా కార్యాలయ పనితీరును,పశువైద్యుల హాజరు,ఔషధాల నిల్వలు,రోగ నిర్ధారణ పరికరాల వినియోగం,రికార్డ్ నిర్వహణ వంటి అంశాలను సమీక్షించారుఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,ప్రభుత్వ పశువైద్య సేవలు సమర్ధంగా,సమయానికి అందుబాటులో ఉండాలని రైతులు పశుపాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని సూచించారు.ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి పశువులకు ఎలా వైద్యం చేస్తున్నారో ప్రత్యక్షంగా పరిశీలించి,మండల పశు సంపద వివరాలు,మందుల కొరత ఉందని తెలుసుకొని మందుల కొరత లేకుండ వారం రోజుల్లో అందుబాటులో ఉంచుతామని రైతులకు తెలిపారు.ఈ సందర్భంగా పశు వైద్య శాల అధికారుల పనితీరును అభినందించారు.ఈ కార్యక్రమంలోఆర్డీఓ స్రవంతి,అసిస్టెంట్ కంపౌండర్ ముజిద్ ఖాన్,ఎంపీవో మహేష్,తదితరులు పాల్గొన్నారు.



# గిర్నూర్ లో డా భీం రావ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

**సమయజ్యోతి న్యూస్ జూలై 29 బజార్ హత్నూర్**

బజార్ హత్నూర్ మండలం లోని గిర్నూర్ గ్రామంలో బజార్ హత్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డా భీం రావ్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు వైద్య పరీక్షలు వైద్యం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు అలగే మందుల పంపిణీ చేశారు అనంతరం డాక్టర్ మాట్లాడుతూ వర్షాల వల్ల వచ్చే సీజనల్ వ్యాధులు రాకుండ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి నీటి నిల్వ లేకుండా చూడలని ఇంటి పక్కన పిచ్చి మొక్కలు ఉండకుండ చూడాలని గ్రామస్తులకు సూచించారు ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఆశ కార్య కర్త తదితరులు పాల్గొన్నారు



# ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్తున్నారా..

## పోలీసులకు సమాచారం ఇవ్వండి

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**




కొంతకాలంగా జిల్లాలో తాళం వేసి ఉన్న ఇండ్లలో దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంగళవారం బాల్కొండ ఎస్సై శైలేందర్, ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. విలువైన వస్తువులను బ్యాంకు లాకర్ లో పెట్టుకోవాలని, ఎవరైనా ఇంటికి తాళం వేసి విహారయాత్రలు లేదా బంధువుల ఇండ్లకు వెళ్లే సందర్భంలో పోలీసులకు సమాచారం అందించాలని, గ్రామంలో ఎవరైనా అనుమానస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే బాల్కొండ పోలీస్ స్టేషన్ కు 871265975 నంబర్ కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు.

# జల్ - జమీన్ - జంగిల్ గిరిజన హక్కుల కోసం కాంగ్రెస్ కట్టుబడి ఉంది

## ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ షబ్బీర్ అలీ

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి నిజామాబాద్ బ్యూరో**




జల్ - జమీన్ - జంగిల్ ( నీరు, అటవీ, భూ వనరులు) పై గిరిజన హక్కుల కోసం కాంగ్రెస్ కట్టుబడి ఉందని ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ షబ్బీర్ అలీ పేర్కొన్నారు. నిజామాబాద్ పట్టణంలోని హరిత హోటల్లో మంగళవారం నిర్వహించిన “తెలంగాణ ఆదివాసి గిరిజన” కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో ఆయన, మంత్రి సీతక్క, మాజీ ఎంపీ మధు యాష్కీ గౌడ్. బెల్లయ్య నాయక్ లతో కలిసి, ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. సహజ వనరులపై గిరిజనుల హక్కుల కోసం రాహుల్ గాంధీ యాత్ర చేశారు. ప్రధానిగా రాహుల్ గాంధీ చూడాలని మనందరి కల. ఈ కల కోసం కాంగ్రెస్ కార్యకర్తలు సైనికులుగా పనిచేయాలి. ప్రజల ఆక్రందన, ఆవేదనను అర్థం చేసుకోవడమే రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర లక్ష్యం. గిరిజనుల హక్కులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాలరాస్తోంది. పెట్టుబడి దారుల లబ్ధి కోసం మోదీ ప్రభుత్వం గిరిజనుల హక్కులను లాక్కోవడానికి కుట్ర పన్నుతోంది. బీజేపీ ఇప్పటికీ మతం పేరిట రాజకీయాలు చేసి, ఓట్ల లబ్ధి పొందాలని ప్రయత్నిస్తోంది. గిరిజనుల కోసం పరితపిస్తున్న నాయకుడు రాహూల్ గాంధీ. ఖ్యకాంగ్రెస్ పార్టీ ఆదివాసిల పరిరక్షణ కోసం ఎనలేని కృషి చేసింది. మంత్రి సీతక్క మాట్లాడుతూ ఆదివాసులు గిరిజనులు అమాయకులు తమ అస్తిత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. వారిపై కొన్ని దుష్టశక్తులు మను వాదాన్ని రుద్దే ప్రయత్నం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరాగాంధీ హయాం నుండి ఆదివాసుల కోసం దళిత గిరిజనులకు సమాజంలో సమానత్వం కోసం నేటి వరకు పనిచేస్తూనే ఉంది. తెలంగాణలో చేసిన ఆదివాసుల మేలు కోరకుకుల గణన సర్వే దేశ వ్యాప్తంగా చర్చ జరగుతుంది. కుల గణన సర్వే 90 శాతం పూర్తయింది గిరిజనులు హక్కుల కోసం సంఘటితం కావాల్సిన అవసరం ఉంది.అటవీ హక్కుల చట్టాన్ని కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చిందని గిరిజనులు మొదట విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి. గిరిజనులు అటవీ భూములు, ఇతర వనరులు హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ ఎల్లపుడూ పోరాడుతూనే ఉంటుంది. గత పదేళ్లలో బిఆర్ఎస్ తెలంగాణాను అప్పుల కుప్పగా మార్చింది,రానున్న రోజుల్లో మిగతా హామీల అమలు కోసం కృషి చేస్తాం. ఈ శిక్షణ శిబిరంలో శిక్షణ పొందిన వారు ఆదివాస గిరిజనులకు సరైన మార్గంలో నడిపించి రాహుల్ గాంధీని ప్రధాని చేసేవరకు కష్టపడాలి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

# జిల్లా ఎస్ పి ని మర్యాద పూర్వకంగా కలిసిన బోథ్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గుడాల అనీష్ కుమార్

**సమయజ్యోతి న్యూస్ జూలై 29 బజార్ హత్నూర్**

జిల్లా ఎస్ పీ కార్యాలయం లో ఆదిలాబాద్ జిల్లా ఎస్ పీ అఖిల్ మహాజన్ ని మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించి నూతన మండలం అయిన సోనాల లో తొందరగా పోలీస్ స్టేషన్ ఏర్పాటు అయ్యేలా మీ వంతు కృషి చేయండి అని ఎందుకంటే సోనాల మండల పరిధి లో సివిల్ మరియు క్రిమినల్ కేసులు ఎక్కువ గా నమోదు కావడం మరియు మహారాష్ట్ర సరిహద్దుల్లో మా మండలం ఉండడం వలన గుర్తు తెలియని వ్యక్తుల వల్ల మా మండల ప్రజలకు ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డం వలన వీటి నివారణకు పోలీస్ స్టేషన్ ఏర్పాటు తప్పనిసరిగా మారిందని విన్నవించగా ఎస్ పీ అఖిల్ మహాజన్ వీలైనంత తొందరలో అయ్యేలా నా వంతు కృషి చేస్తానని చెప్పడం జరిగింది. వారికి మా మండల ప్రజల అందరి తరపున ధన్యవాదములు తెలియచేయడం జరిగింది. ఎస్ పి మాట్లాడుతూ యువత యాంటీ డ్రగ్స్ సోల్జర్స్ గా మారి సమాజానికి సేవ చేయాలని, యువకులు ఉన్నత స్థానాలకు ఎదిగి తమ గ్రామాల పేరు ను కీర్తి ని పతాక స్థాయికి చేర్చాలని చెడు వ్యాసనాల బారిన పడకుండా సన్మార్గం వైపు పయనించాలన్నారు. ఈ కార్యక్రమం లో బోథ్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గుడాల అనీష్ మరియు నడికుంట ప్రవీణ్ ఉన్నారు




# నాగుల పంచమి సందర్భంగా పలు ఆలయాలను దర్శించుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**సమయజ్యోతి న్యూస్ జూలై 29 బజార్ హత్నూర్**

ఇచ్చోడ మండలంలోని సిరిచెల్మ పురాతన శివాలయం లో ఉన్న శ్రీ. మల్లిఖార్జున ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అనంతరం నేరడిగొండ మండలంలోని కుంటాల రోడ్డు సమీపంలో ఉన్న శివాలయాన్ని దర్శించుకొని బోథ్ ఎక్స్ రోడ్డు ఉన్న పురాతన పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు అనంతరం బోథ్ నియోజకవర్గ ప్రజలకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నాగుల పంచమి శుభాకాంక్షలు తెలిపారు



# 31న గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

ముస్తాబాద్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల (బాలుర) లో ఖాళీగా ఉన్న ఎంపీసీ 15, బైపిసి 33 సీట్లకు ఈనెల 31న స్పాట్ అడ్మిషన్లను నిర్వహిస్తున్నట్లుగా మంగళవారం ప్రిన్సిపల్ ఎం ఉదయకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి మార్కుల మెమో, కులము ఆదాయ ధ్రువీకరణ పత్రాలను వెంట తేవాలన్నారు.



# బీడీ కార్మికుల పిల్లలు ఉపకార వేతనాలకు దరఖాస్తు చేయాలి

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

బీడీ కార్మికుల పిల్లలు ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని మంగళవారం బాల్కొండ ఎంఈఓ బట్టు రాజేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి ప్రోత్సాహక ఉపకార వేతనాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయాలని తెలిపారు. 1 నుంచి 10 తరగతి విద్యార్థులూ ఆగస్టు 31 లోగా, ఇంటర్ నుంచి డిగ్రీ, వృత్తి విద్య కోర్సుల విద్యార్థులూ అక్టోబర్ 31 లోపు దరఖాస్తు చేయాలి. విద్యార్థి పాస్ మార్క్ మెమో, బ్యాంకు పాస్ బుక్, అధార్‌కార్డు, అదాయ, కుల ధ్రువీకరణ పత్రం, కార్మికురాలి బీడీ కంపెనీ, గుర్తింపు కార్డు, ఆపాయింట్‌మెంట్ లెటర్ వెబ్సైట్ నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ %ఖఖఖ.ంఎష్ట్రశ్రీశీతీ- ంష్ట్రఱఙూం. స్త్రశీజ.ఱఅ% అప్లోడ్ చేయాలని సూచించారు. సందేహాల నివృత్తి కోసం హెల్ప్‌లైన్ నంబర్ 0120%-%6619540లో లేదా వెల్ఫేర్ కమిషనర్, లేబర్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్, కేంద్రీయ సదన్, సుల్తాన్‌బజార్, హైదరాబాద్ 50001 లేదా ఫోన్ నంబర్ 040-29561297 నంబర్‌తో పాటు దగ్గరలో ఉన్న బీడీ కార్మికుల దవాఖాన భీమ్ గల్, మెడికల్ ఆఫీసర్‌ను సంప్రదించాలి.

# త్రిబుల్ ఐటీ కి బాల్కొండ విద్యార్థిని ఎంపిక



**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

మహబూబ్ నగర్ క్యాంపస్ త్రిబుల్ ఐటీ కి బాల్కొండ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని బోట్ల స్ఫూర్తి ఎంపికవడం పట్ల మంగళవారం ఎంఈఓ బట్టు రాజేశ్వర్ హర్షం వ్యక్తం చేసి, స్ఫూర్తిని అభినందించారు. ఈ పాఠశాల విద్యార్థులు మొత్తంగా ఈ యేడు ఆరుగురు త్రిబుల్ ఐటీ లో ప్రవేశానికి ఎంపికవడం విశేషం. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

# కలెక్టర్..40 మందికి ఇన్‌పుట్ డీలర్లకు సర్టిఫికెట్ల పంపిణీ, అభినందన

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

ఇన్‌పుట్ డీలర్ల డిప్లొమా కోర్సు పూర్తి చేసుకున్న అభ్యర్థులు, రైతులకు ఉత్తమ సేవలు అందించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. ఇన్‌పుట్ డీలర్ల డిప్లొమా కోర్సు పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ సర్వీస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్ల (డీఏఈఎస్ఐ ) కోర్సు జిల్లాలోని 40 మంది అభ్యర్థులు పూర్తి చేసుకోగా, వారికి రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ లో కలెక్టరు మంగళవారం సర్టిఫికెట్లు పంపిణీ చేసి, అభినందించారు. వ్యవసాయంలో ఇన్‌పుట్ డీలర్ల సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించడానికి ఒక సంవత్సరం డిప్లొమా ప్రోగ్రామ్ రూపొందించి, ఎస్ఏఎంఈటీఐ వారి నుంచి శాస్త్రవేత్తలు, అర్హత కలిగిన నిపుణుల ఆధ్వర్యంలో శిక్షణా అందించారు. నేల ఆరోగ్య నిర్వహణ, వ్యవసాయ ఉత్పాదకతలో నేల ఆరోగ్యం – దాని ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడం, ఇంటిగ్రేటెడ్ తెగులు నిర్వహణ పద్ధతులను నేర్చుకోవడం, వ్యవసాయ పనిముట్లు – పరికరాలులి: యంత్రాలపై పరిచయం, విస్తరణ విధానాలు– పద్ధతులులి: రైతులతో సమర్థవంతంగా సంభాషించడానికి నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, విత్తన ఉత్పత్తి – నిర్వహణను అర్థం చేసుకోవడం, నీటిపారుదల పద్ధతులను నేర్చుకోవడంపై శిక్షణ అందించారు. ఈ కోర్సు విజయవంతంగా పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేసి, రైతులకు ఉత్తమ సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం పాల్గొన్నారు.



# అచ్చంపేట పట్టణంలో కార్డెన్ సర్చ్ నిర్వహించిన పోలీసులు.

సమయజ్యోతి న్యూస్ అచ్చంపేట.

అచ్చంపేట పట్టణంలోని ఇంద్రానగర్ కాలనీలో ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు కార్డెన్ సర్చ్ నిర్వహించారు. డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలో భాగంగా డీఎస్పీ శ్రీనివాస్ కాటన్ సెర్చ్ లో భాగంగా 20 వాహనాలకు ఎలాంటి నెంబర్ ప్లేట్లు లేవు నెంబర్ ప్లేట్లు లేని బండ్లు నడుపుతే కాలనీవాసులు ఎందుకు పోలీసు వాళ్లకు ఫోన్ చేయడం లేదు అని అడిగారు. నెంబర్ ప్లేట్లు లేని బండ్లు నడిపితే పోలీస్ వాళ్లకు ఫోన్ చేయాలి అని తెలియజేశారు. నెంబర్ ప్లేట్ లేని వాహనాలను పోలీసులు తనిఖీ చేస్తుండగా నెంబర్ ప్లేట్ లేని వ్యక్తులు హరి బారిగా పారిపోయి యాక్సిడెంట్ అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలియజేశారు. వాహనాలు నడిపేవారు తప్పకుండా వాహన పత్రాలు ఉండాలి. ఈరోజు కాటన్ సెర్చ్ లో భాగంగా పత్రాలు లేని ఒక కారు ఒక ఆటో 20 బైక్లను సీజ్ చేసినట్లు పోలీసులు తెలియజేశారు. ఇల్లు కిరాయికి ఇచ్చేటప్పుడు తప్పకుండా వారి పూర్తి సమాచారం తెలుసుకుని ఇవ్వాలి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యక్తులు ఎవరైనా ఉంటే పోలీసు వాళ్లకు తప్పకుండా సమాచారం ఇవ్వాలి కిరాకి ఇచ్చేటప్పుడు వారి యొక్క అడ్రస్ ను చూసుకొని ఇవ్వాలి. ముఖ్యంగా ఈ మధ్యలో అచ్చంపేటకు సంబంధించిన వ్యక్తి బీహార్, గుజరాత్ రాష్ట్రాలలో 8 నుండి 10 కోట్ల రూపాయలు మోసం చేసినట్లు తెలిసింది. ఇలాంటి వ్యక్తి అచ్చంపేట వాసి కావడంతో చాలా బాధాకరమైన విషయమని డిఎస్పీ శ్రీనివాసులు తెలియజేశారు. ఈ మధ్యకాలంలో సైబర్ నేరగాళ్లు అనేక లింకులు పంపిస్తూ ఓటిపిలు వచ్చాయని చెబుతూ ఫోన్ చేస్తున్నారు కాబట్టి తెలిసిన వ్యక్తి యొక్క ఫోన్ మాత్రమే స్పందించాలి ఇతర వ్యక్తులతోటి స్పందించకూడదు. ఈ మధ్యకాలంలో బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నాము బ్యాంకుకు ఓటిపి చెప్పండని సైబర్ నెరకాల్లో ప్రజలను అడుగుతున్నారు కాబట్టి బ్యాంకు నుంచి బ్యాంకు ఉద్యోగులు ఎలాంటి ఓటిపి అడగరు అని తెలియజేశారు. అదేవిధంగా గంజాయి,పోక్సో నియమాలు మైనర్ వివాహాలు చేయకూడదు విద్యార్థులు కాలేజీకి పోతున్నారా లేదా అనేది తల్లిదండ్రులు విద్యార్థుల పైన దృష్టి పెట్టాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ఇద్దరు సిఐలు 5 మంది ఎస్సైలు 80 మంది పోలీసులు పాల్గొన్నారు.



# బదిలీల తర్వాత పదోన్నతులు కల్పించాలి

సమయజ్యోతి ప్రతినిధి భూపాల్ పల్లి

ఉపాధ్యాయుల బదిలీల తర్వాత పదోన్నతులు కల్పించాలని పిఎస్ హెచ్ఎం సంఘం జిల్లా కమిటీ భూపాలపల్లి ఆధ్వర్యం లో భూపాల్ పల్లి విద్యాధికారి ఎం రాజేందర్ కి వినతి పత్రం సమర్పించారు ఈ సందర్భంగా ప్రాథమిక పాటశాల ల ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎల్ గణపతి ప్రధాన కార్యదర్శి పంచిక భగవాన్ రెడ్డి జిల్లా సహ అధ్యక్షులు తంగెళ్ళ రాజి రెడ్డి లు మాట్లాడుతూ బదిలీలతో కూడిన ప్రమోషన్ షెడ్యూల్ ను విడుదల చేయాలని ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి లో పి స్ ప్రధానోపాధ్యాయులను ప్రత్యేకంగా గుర్తించాలని పండిత పిఈటి టీచర్లు అప్ గ్రేడేషన్ లో అర్హులైన వారికి ఫీటర్ క్యాటగిరి నుండి తీసుకోని న్యాయం చేయాలని ఎన్నికల సమయంలో క్యాడర్ వారిగా సీనియర్ జూనియర్లకు విధులు కేటాయించగలరని తరతర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అంద చేశారు అనంతరం పి ఎస్ హెడ్ మాస్టర్స్ సంఘం టేబుల్ క్యాలెండర్ ఆవిష్కరించారు కార్యక్రమము లో జిల్లా ప్లానింగ్ అధికారి రాజ గోపాల్ ఏ ఎం ఓ లక్ష్మణ్ మహా ముత్తారం మండల విద్యాధికారి మందల రవీందర్ రెడ్డి కామిడి సతీష్ రెడ్డి జలంధర్ లు పాల్గొన్నారు



# నిరంతర ప్రక్రియగా నూతన రేషన్ కార్డుల జారీ కొనసాగుతోంది

## కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, ఎమ్మెల్యే ఎం.సత్యం

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్



నిరంతర ప్రక్రియగా నూతన రేషన్ కార్డుల జారీ కొనసాగుతోందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. మంగళవారం కలెక్టర్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి బోయిన్ పల్లి మండల కేంద్రంలో రైతు వేదికలో లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ నేడు బోయిన్ పల్లి మండలంలో 1070 పేద కుటుంబాలకు నూతన రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామని, అదే సమయంలో ప్రస్తుతం ఉన్న 1971 రేషన్ కార్డు ల్లో కొత్త సభ్యులను జమ చేస్తున్నామని నూతనంగా దాదాపు 6,000 మంది ప్రజలకు రేషన్ అందనున్నందని కలెక్టర్ తెలిపారు.
ప్రజల జీవనంలో రేషన్ కార్డు చాలా కీలకమైన డాక్యుమెంట్ అని కరెంట్ కనెక్షన్, ఇందిరమ్మ ఇండ్లు, ప్రభుత్వ పథకాల అమలు వంటి అనేక కార్యక్రమాలకు రేషన్ కార్డు ఉపయోగ పడుతుందని కలెక్టర్ తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రేషన్ ద్వారా సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని అన్నారు. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, ఎవరైనా అర్హులు దరఖాస్తు చేసుకుంటే వెంటనే పరిశీలించి రేషన్ కార్డు మంజూరు చేస్తామని అన్నారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ రేషన్ కార్డు పేద ప్రజల జీవితంలో చాలా కీలకమైన పాత్ర పోషిస్తుందని అన్నారు. గత పది సంవత్సరాలుగా ఒక పేద కుటుంబానికి రేషన్ కార్డు, ఇండ్లు ఇవ్వలేదని అన్నారు. ప్రస్తుతం ప్రజా ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న ప్రతి పేద కుటుంబానికి రేషన్ కార్డు మంజూరు చేస్తున్నామని అన్నారు.నూతన రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగు తుందని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన సంవత్సర కాలంలో బోయిన్ పల్లి మండలంలో అత్యధికంగా ఇండ్లు మంజూరు చేసామని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో రేషన్ కార్డుతో 9 రకాల వస్తువులు ఇచ్చామని, గత పాలకుల హయాంలో ఆ సామాగ్రిని రద్దు చేశారని అన్నారు. మన ముఖ్యమంత్రి, జిల్లా కలెక్టర్ ఎటువంటి బియ్యం తింటారు పేద ప్రజలకు కూడా అటువంటి సన్న బియ్యం రేషన్ కార్డు ద్వారా సరఫరా చేయడం ఉగాది నుంచి ప్రారంభించామని, దీనితో రేషన్ కార్డ్ ప్రాముఖ్యత గణనీయంగా పెరిగిందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ప్రభుత్వం సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల చేపట్టామని అన్నారు. అనంతరం సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రజిత, బోయిన్ పల్లి తహసిల్దార్ నారాయణ రెడ్డి, ఎం. పి. డి. ఓ జయశిలా, సెస్ డైరెక్టర్ సుధాకర్, మార్కెట్ కమిటీ ఛైర్మెన్ సంబంధిత అధికారులు, స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# జిల్లాస్థాయి సమీక్షా సమావేశంలో చురుగ్గా అభివృద్ధి పనులు.. పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టి..

## మొహమ్మద్ అలీ షబ్బీర్, మంత్రి సీతక్క

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి నిజామాబాద్ బ్యూరో



చురుగ్గా అభివృద్ధి పనులు చేపట్టాలని పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, డెంగ్యూ వ్యాదులు సోకకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్ పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం సంబంధిత అధికారులతో ఇన్చార్జి మంత్రి సీతక్క తో కలిసి ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఎక్కడైనా అంటువ్యాధులు సోకితే వెంటనే అక్కడ హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలి. ప్రజలకు అవగాహన కల్పించాలి.వర్ష కాలంలో అంటువ్యాధులు సోకాకుండా, తాగునీటి కొరత ఏర్పడకుండా, వాటర్ ట్యాంక్ లు శుద్ధిచేసి, డ్రైనేజీలు వెంట వెంటనే క్లీన్ చేస్తూ దోమల నివారణ, ఎక్కడైనా వ్యాధులు ప్రబలకుండా హెల్త్ క్యాంపులు నిర్వహణ పై చర్యలు తీసుకోవాలి. అర్హులందరికీ రేషన్ కార్డులు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఇందిరమ్మ ఇండ్లకు ఉచితంగా ఇసుక అందేలా చూడాలి. ఇందిరమ్మ ఇళ్లకు ఏమైనా సాంకేతిక ఇబ్బందులు ఉంటే స్పందించి వాటిని పూర్తి చేయండి. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు ఏలాంటి ఇబ్బందులు రాకుండా మెరుగైన వైద్యం అందించాలని అన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో అలసత్వం తగదని, నిర్ణీత కాలవ్యవధిలో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమంలో నిర్లక్ష్యం వహించిన వారిపై కరినచర్యలుతీనుకుంటామని హెచ్చరించారు. నిధులు మంజూరై ఆరునెలలు గడుస్తున్నా పనులు సక్రమంగా జరగడంలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. పలు అభివృద్ధి పనులపై మంజూరైన, టెండర్ల వివరాలు ఆరా తీశారు. నిధుల వివరాలు వాటి పురోగతిని నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఏవైనా పెండింగ్ బిల్లులు ఉంటే తొందరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. నిర్లక్ష్యం వహించిన సంబంధిత అధికారుల పై తీవ్రమైన చర్యలు ఉంటాయని, గడువులోగా పనులు పూర్తిచేయాలని సూచించారు. ముఖ్యంగా త్రాగునీరు గోదావరి జలాలు అమృత్ 1 అమృత్ టు2 పారిశుధ్యం, రోడ్ డ్రైనేజ్ సెంట్రల్ లైటింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. అంగన్వాడి భవనాలను త్వరలో నిర్మిస్తాం. శిశు మహిళా సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది. డ్వాక్రా మహిళలు జీవిత బీమా చేసుకునే విధంగా అధికారులు కృషి చేయాలి. ఇందిరమ్మ ఇండ్లకు ఉచిత ఇసుకను సరఫరా చేయాలని, ఎవరికి ఇబ్బంది రాకుండా రవాణా చేయాలన్నారు. వ్యవసాయానికి విత్తనాలు, ఎరువుల కొరత రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, సుదర్శన్ రెడ్డి, భూపతి రెడ్డి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, ధన్ పాల్ సూర్యనారాయణ, రాకేష్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు, జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఈ-పాస్ యంత్రాలలోని, దుకాణాల్లోని నిల్వ సరిగా ఉండాలి: కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

జిల్లాలోని ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ సీడ్స్ షాపుల నిర్వాహకులు తమ ఈ పాస్ యంత్రాలలోని నిల్వ దుకాణాల్లో ఎరువులు, ఇతర సరుకు నిల్వ సరిగా ఉండేలా చూసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ గోదాం, గొల్లపల్లిలో శ్రీ సాయినాథ్, బొప్పాపూర్ రోడ్ లోని శ్రీ మహేశ్వర ఆగ్రో ఏజెన్సీ ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ సీడ్స్ దుకాణాల్లో కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి దుకాణాల్లోని రికార్డులను సరుకు నిలువను లైసెన్సులను వారు అమ్మే పురుగు మందులను పరిశీలించారు.ఇకముందు స్టాక్ లో తేడా ఉండవద్దు.. ఈ సందర్భంగా ఆయా ఎరువుల దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లను, లైసెన్సులను పరిశీలించారు. ఈపాస్ యంత్రంలోని స్టాకు.. గోదాంలో ఉన్నటువంటి స్టాకు యూరియా బస్తాలను స్వయంగా లెక్కించి, సరి చూసారు. స్టాకులో స్వల్ప తేడాను గమనించి ఇకముందు ఈ విధంగా స్టాక్ లో తేడా లేకుండా సరియైన విధంగా నిర్వహించాలని షాపు యజమానులను ఆదేశించారు. పురుగు మందులను శాంపుల్ టెస్ట్ చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. వర్షాల నేపథ్యంలో రైతులకు ఎరువులు, ఇతర సామాగ్రి విషయంలో ఇబ్బందులు రాకుండా చూడాలని సూచించారు. ఎరువుల, విత్తనాలు విక్రయాలు నిబంధనల ప్రకారం నాణ్యమైనవి విక్రయించాలని చేయాలని పేర్కొన్నారు.ఈ పర్యటనలో జిల్లా వ్యవసాయ అధికారి అఫజల్ బేగం, కలెక్టర్ వెంట ఉన్నారు.



# నిండుకుండలా నాగార్జున సాగర్

## 14 గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసిన మంత్రులు

## 18 ఏళ్ల తరవాత జూలైలో ఈ మోతాదులో నీటి చేరిక

**నాగార్జునసాగర్,జూలై29(సమయజ్యోతి):** ఎగువ నుంచి వస్తున్న భారీ వరద ప్రవాహంతో నాగార్జునసాగర్ జలాశయం నిండుకుండలా మారింది. దీంతో ప్రాజెక్టు క్రస్ట్ గేట్లు- ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థం 590.00అడుగులకుగాను ప్రస్తుతం 586.60 అడుగులకు చేరింది. ప్రాజెక్టు గేట్లు- ఎత్తిన నేపథ్యంలో.. దిగువ భాగంలో లోతట్టు- ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. 18 ఏళ్ల తర్వాత.. నెల ముందుగానే నాగార్జున సాగర్ నుంచి నీటిని విడుదల చేయడం ఇదే తొలిసారి. వరద ప్రవాహం పెరగడంతో మంగళవారం నాగార్జున సాగర్ గేట్లను ఎత్తారు. మంత్రులచేతుల మీదుగా ఉదయం 11 గంటలకు గేట్లను తెరిచారు. మొత్తం 14 గేట్లను 5 అడుగుల మేర ఓపెన్ చేశారు. అయితే సాగర్ గేట్లను ఎత్తడానికి ముందు బేగంపేట ఎయిర్‌పోర్టులో మంత్రుల గొడవపడ్డారు. షెడ్యూల్ ప్రకారం నల్లగొండ జిల్లా మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ చేతుల మీదుగా మంగళవారం ఉదయం 10 గంటలకు నాగార్జున సాగర్ గేట్లను తెరువాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఉదయం 9 గంటలకు అందరూ బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుని, అక్కడి నుంచి హెలికాప్టర్‌లో నాగార్జునసాగర్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అనుకున్న ప్రకారం మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ ఉదయం 9 గంటలకే బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. కానీ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గంట ఆలస్యంగా 10 గంటలకు వచ్చారు. ఈ విషయంలో కోమటిరెడ్డికి, ఉత్తమ్‌కు మధ్య వాగ్వాదం జరిగింది. ఆ తర్వాత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తాను నాగార్జునసాగర్‌కు రానని అలిగి బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి వెళ్లిపోయారు. దాంతో మంత్రులు



ఉత్తమ్‌కుమార్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ మాత్రమే హెలికాప్టర్‌లో నాగార్జునసాగర్‌కు వెళ్లారు. పూజా కార్యక్రమం నిర్వహించి సాగర్ 14 గేట్లను ఎత్తారు. దాంతో కృష్ణమ్మ దిగువకు పరవళ్లు తొక్కుతూ పరుగులు తీస్తోంది. కాగా నాగార్జునసాగర్ జూలై నెలలో ఈ స్థాయిలో నిండటం గడిచిన 18 ఏళ్లలో ఇదే తొలిసారని అధికారులు తెలిపారు.

---

4వేల టన్నుల బొగ్గు మాయంపై

# హైకోర్టు ఆగ్రహం

## వానదేవుడే బొగ్గును మాయం చేశాడు

## భారీ వర్షాలకు కొట్టుకు పోయి ఉంటుంది

## మేఘాలయ మంత్రి ఆసక్తికర సమాధానం

**షిల్లాంగ్,జూలై29(సమయజ్యోతి):** మేఘాలయాలో సుమారు నాలుగు వేల టన్నుల బొగ్గు అదృశ్యమైంది. ఆ నల్ల బంగారం మాయం కావడం పట్ల రాష్ట్ర సర్కారుపై హైకోర్టు సీరియస్ అయ్యింది. బొగ్గు ఎక్కడికెళ్లిందో చెప్పాలని కోర్టు నిలదీసింది. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రానికి చెందిన ఎక్సైసజ్ శాఖ మంత్రి కిర్మెన్ షిల్లా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బహుశా వర్షాలు, వరదల వల్ల ఆ బొగ్గు కొట్టుకుపోయి ఉంటుందని ఆయన అన్నారు. జోరు వానల వల్ల బొగ్గు మాయమై ఉంటుందన్నారు. రాజాజూ, డెంగన్‌గాన్ గ్రామాల్లో ఉన్న బొగ్గు నిల్వల నుంచి సుమారు 4 వేల టన్నుల బొగ్గు కనిపించకుండాపోయింది. ఆ కేసులో అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. బొగ్గు మాయం గురించి అడిగిన సమయంలో మంత్రి మాట్లాడుతూ.. మేఘాలయాలో అత్యధిక వర్షపాతం కురుస్తుందని, మీకు ఈ విషయం తెలియదని, ఆ వానల వల్ల బొగ్గు కొట్టుకుపోయే ఛాన్సు ఉందని అన్నారు. బొగ్గు ఎలా అదృశ్యమైందో చెప్పడం తన ఉద్దేశం కాదు అని, సహజ పద్ధతిలో ఆ బొగ్గు మాయమైందా లేక అక్రమ విధానాల వల్ల అది పోయిందా అన్న విషయాన్ని తేల్చలేకపోతున్నట్లు- ఆయన చెప్పారు. మేఘాలయాలో 2014 నుంచి బొగ్గు మైనింగ్‌ను నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆపేసింది. పర్యావరణ కారణాలు, అసురక్షిత పద్ధతుల వల్ల బొగ్గు తొవ్వకాలను నిలిపివేశారు. మేఘాలయాలో అక్రమ రీతిలో మైనింగ్ జరుగుతున్నట్లు- ఆరోపణలు ఉన్నాయి. అయినా ఈ ఏడాది ఆరంభంలో ఈస్ట్ జైంతియా కొండల్లో బొగ్గు మైనింగ్‌ను ప్రారంభించారు. ఒకవేళ బొగ్గు మాయమైనా.. అది బ్రతకడం కోసమైతే అక్రమంగా జరిగి ఉంటుందేమో అని, లేదంటే ఆ బొగ్గును ఎవరు తీసుకెళ్తారని మంత్రి అన్నారు.



---

# భూ వివాదం కేసులో రేవంత్ రెడ్డికి ఊరట

## పెద్దిరాజు తదితరులు వేసిన పిటిషన్ తిరస్కరణ

## ఫిర్యాదుదారుకు కోర్టు దఉక్రణ కింద నోటీసులు

**న్యూఢిల్లీ,జూలై29(సమయజ్యోతి):** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. భూవివాదం కేసులో ఎన్ పెద్దిరాజు వేసిన కేసులో.. రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా ఎటువంటి ఆధారాలు లేవంటూ పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు క్వాష్ చేసింది.అయితే హైకోర్టు ఆదేశాలపై ఎన్ పెద్దిరాజు సుప్రీంకోర్టులో సవాలు వేశారు. ఈ కేసును వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలంటూ సుప్రీంను ఆశ్రయించారు.ఆ పిటిషన్‌లో హైకోర్టు తీర్పునకు సంబంధించ అంశాలతో పాటూ జడ్జి పైన అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినట్లు- సమాచారం. ఎన్ పెద్దిరాజు వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ధర్మాసనం డిస్మిస్ చేసింది. అలాగే ఎన్ పెద్దిరాజుతో పాటు-, ఆయన అడ్వకేట్ రితేష్ పాటిల్‌కు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. పిటిషనర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సీజేఐ బీఆర్ గవాయి తదుపరి విచారణకు పిటిషనర్ అండ్ పెద్దిరాజు వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాలని ఆదేశించారు. భూ వివాదం వ్యవహారంలో సొసైటీ- స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించారని 2016లో రేవంత్‌రెడ్డి, ఆయన సోదరుడు కొండల్ రెడ్డి, లక్ష్మయ్య పై పెద్దిరాజు ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పీఎస్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. తనపై కేసును కొట్టివేయాలని సీఎం రేవంత్‌రెడ్డి 2020లో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం.. ఫిర్యాదు దారు ఆరోపణల్లో సరైన సాక్ష్యాధారాలు లేవని పేర్కొంది. రేవంత్‌పై నమోదైన కేసును కొట్టివేసింది. తెలంగాణ హైకోర్టు తీర్పు అనంతరం.. కేసు విచారణను మరో రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరుతూ పెద్దిరాజు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌ను మంగళవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిష్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం డిస్మిస్ చేసింది.పిటిషన్‌లో.. ఉత్తర్వులు ఇచ్చిన హైకోర్టు న్యాయమూర్తిపై అభ్యంతరకర వ్యాఖ్యలు ఉన్నాయని సీజేఐ జస్టిస్ గవాయ్ తెలిపారు. ఒక న్యాయవాదిగా న్యాయమూర్తిపై వ్యాఖ్యలు చేస్తూ .. పిటిషన్ ఎలా దాఖలు చేస్తారని సీజేఐ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్.పెద్దిరాజుతోపాటు- ఆయన తరఫు న్యాయవాది రితేష్ పాటిల్‌కు ధర్మాసనం కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణకు పిటిషనర్ పెద్దిరాజు వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశాలిచ్చింది. కోర్టు సాక్షిగా పిటిషనర్ తరఫు న్యాయవాది రితీష్ పాటిల్ క్షమాపణ కోరారు. అందుకు నిరాకరించిన సీజేఐ.. పిటిషన్ రాసేటప్పుడు, దాఖలు చేసేటప్పుడు గుడ్డిగా ఎలా వేశారని ప్రశ్నించారు. పిటిషన్ ఉ వ న ం వ ా ర ి ం చ ు క ు న ే ం ద ు క ు అనుమతివ్వాలని న్యాయవాది రితీష్ పాటిల్ కోరగా.. అందుకు సీజేఐ నిరాకరించారు. పిటిషన్ దాఖలు చేసే ముందు న్యాయవాదిగా అన్ని విషయాలు చూసుకోవాల్సిన బాధ్యత ఉంటుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కోర్టు ధిక్కరణ కింద ఎందుకు చర్యలు తీసుకోవద్దంటూ జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రశ్నించారు. కోర్టు ధిక్కరణ నోటీసుపై లిఖిత పూర్వకంగా సమాధానం ఆదేశించారు. సమాధానం ఆమోదయోగ్యంగా ఉంటేనే కోర్టు పరిగణనలోకి తీసుకుంటుందని స్పష్టం చేస్తూ... విచారణ ఆగస్టు 11కు వాయిదా వేశారు.

---

# కేరళ నర్సు నిమిష ప్రియ ఉరిశిక్ష

## రద్దయ్యిందన్న వార్తలను

## ఖండించిన కేంద్రం

**న్యూఢిల్లీ,జూలై29(సమయజ్యోతి):** కేరళ నర్సు నిమిష ప్రియ ఉరిశిక్ష రద్దయ్యిందంటూ వస్తున్న వార్తలపై కేంద్ర ప్రభుత్వ వర్గాలు ఖండించాయి. అవన్నీ అవాస్తవమని పేర్కొన్నాయి. నిమిష ప్రియ ఉరిశిక్ష రద్దు కాలేదని మంగళవారం వెల్లడించాయి. నిమిష ఉరిశిక్షను రద్దు చేస్తూ యెమెన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందంటూ భారత గ్రాండ్ ముఫ్తీ, సున్నీ మత ప్రబోధకుడు కాంతపురం ఏపీ అబూబకర్ ముస్లియార్ కార్యాలయం సోమవారం రాత్రి ప్రకటించింది. అక్కడ జరిగిన ఉన్నత స్థాయి భేటీలో ఉరిశిక్షణ రద్దు నిర్ణయం తీసుకున్నట్లు- తెలిపింది. దీనిపై భారత విదేశాంగ శాఖ వర్గాలు తాజాగా స్పందించాయి. నిమిష మరణశిక్ష రద్దు చేశారంటూ కొంత మంది వ్యక్తులు నుంచి వచ్చిన సమాచారం అవాస్తవమని వెల్లడించాయి. ఈ విషయంపై తమకు యెమెన్ నుంచి ఇప్పటి వరకూ ఎలాంటి అధికారిక సమాచారం రాలేదని పేర్కొన్నాయి.యెమెన్ జాతీయుడు మహద్ హత్యకేసులో నిమిష ప్రియకు మరణశిక్ష పడిన విషయం తెలిసిందే. మహద్‌తో కలిసి ఆమె వ్యాపారం చేసింది. అయితే ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో ఆమె తన పాస్‌పోర్టు కోసం అడిగింది. కానీ పాస్‌పోర్టు ఇచ్చేందుకు మహద్ నిరాకరించడంతో అతడికి మత్తుమందు ఇచ్చి తీసుకునేందుకు నిమిష ప్రయత్నించింది. అయితే డోస్ ఎక్కువ కావడంతో మహద్ మరణించాడు.దాంతో యెమెన్ పోలీసులు నిమిషను హత్య కేసులో అరెస్ట్ చేశారు. ఆమె ముందుగా స్థానిక కోర్టు మరణశక్ష విధించింది. ఆ శిక్షను టాప్ కోర్టు సమర్థించింది. దాంతో ఈ నెల 16న నిమిషకు ఉరిశిక్ష అమలు చేయనున్నట్లు- ప్రకటించారు. నిమిషకు శిక్ష తప్పించేందుకు చివరి నిమిషం వరకు ప్రయత్నించిన భారత ప్రభుత్వం.. ఇక తాను చేసేదేమీ లేదని చేతులెత్తేసింది. జూలై 16న అమలు చేయాల్సిన మరణశిక్ష చివరి నిమిషంలో వాయిదా పడింది.

---

# మరోమారు హైడ్రా దూకుడు

## మూసీ కాలువలో భారీ కబ్జాల కూల్చివేత

**హైదరాబాద్,జూలై29(సమయజ్యోతి):** హైడ్రామరోమారు కొరడా ఝుళిపించింది. అక్రమణలపై వేటు వేసింది. హైదరాబాద్ ఎంజీబీఎస్ వద్ద మూసీ నదిలో అక్రమణలను హైడ్రా సిబ్బంది తొలగించారు. కొందరు ప్రైవేటు- వ్యక్తులు మూసీలో మట్టి పోసి పార్కింగ్ స్థలం ఏర్పాటు చేశారు. ఒక్కో బస్సు నుంచి రూ.300, ఒక్కో గుడిసె నుంచి రూ.1000 వసూలు చేస్తున్నారు. వాహనాల పార్కింగ్ స్థలంపై హైడ్రాకు ఫిర్యాదులు అందడంతో అధికారులు స్పందించారు. ప్రభుత్వ ఆదేశాలతో పార్కింగ్ స్థలాన్ని హైడ్రా పరిరక్షించింది. ఇలా మూసీనది గర్భంలో అక్రమణలను హైడ్రా అధికారులు తొలగించారు. చాదరఘాట్ బ్రిడ్జి నుంచి పాత బస్తీ ఉస్మానియా ఆస్పత్రి మార్చురీ వరకు పలు ప్రాంతాల్లో అక్రమణలు తొలగించారు. ఈ స్థలాన్ని వాహనాల పార్కింగ్ కోసం అక్రమణ దారులు వినియోగిస్తున్నారు. చదును చేసి షెడ్డులు నిర్మించిన కబ్జాదారులు కిరాయికి ఇస్తున్నారు. మూసీ అక్రమణలపై హైడ్రాకు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో చర్యలు చేపట్టారు. 3.10 ఎకరాల మేర కబ్జా చేసి షెడ్డు నిర్మించిన అక్రమణ దారు తికారంసింగ్ అక్రమ వ్యాపారం చేస్తున్నారు. అలాగే 1.30 ఎకరాల మేర కబ్జా చేశారు అక్రమణ దారు పూనమ్ చాంద్ యాదవ్. 5.22 ఎకరాల మేర కబ్జా చేశారు జయకృష్ణ. కబ్జా చేసిన వారంతా అక్కడ షెడ్లు వేసి.. వాటిని అద్దెకు ఇచ్చి వ్యాపారం చేస్తున్నట్లు- హైడ్రా అధికారులు వెల్లడించారు. బస్సులు, లారీల పార్కింగ్ కోసం కిరాయికి ఇస్తూ అక్రమణ దారులు వినియోగిస్తున్నారు. ఆ ప్రాంతంలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు- స్థానికులు హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. మూసీ గర్భంలో మట్టిపోసి షెడ్డులని నిర్మించినట్లు- హైడ్రా అధికారులు గుర్తించారు. నర్సరీ బిజినెస్ నిర్వహణ, అక్రమణలను హైడ్రా అధికారులు తొలగించారు. హైడ్రా అధికారులు తీసుకుంటు-న్న చర్యలపై పరిసర ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

---

# మానసిక సమస్యలతో సతమతం

## ఆఫీస్ నుంచి దూకి

## టెక్కీ ఆత్మహత్య

**ముంబై,జూలై29(సమయజ్యోతి):** మహారాష్ట్రలోని పుణెలో ఓ ఐటీ- ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నారు. జీవితంపై విరక్తితో ఆత్మహత్యకు పాల్పడ్డట్లు గుర్తించారు. ఆఫీసులో మీటింగ్ జరుగుతుండగా మధ్యలో బయటకు వెళ్లిన ఆ టెకీ.. భవనంపై నుంచి దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నాసిక్‌కు చెందిన 23 ఏళ్ల పీయూష్ అశోక్ కవాడే పుణెలోని హింజెవాడి ఐటీ- పార్క్‌లోని ఓ కంపెనీలో ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. రోజూలాగే సోమవారం ఉదయం ఆఫీసుకు వచ్చిన అతడు కంపెనీ మీటింగ్‌కు హాజరయ్యాడు. మధ్యలో అస్వస్థతగా ఉందని చెప్పి మీటింగ్ నుంచి బయటకు వచ్చాడు. ఆ తర్వాత కొన్ని క్షణాలకే బిల్డింగ్ ఏడో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో తోటి ఉద్యోగులంతా ఉలిక్కిపడ్డారు. సమాచారమందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద సూసైడ్ నోట్‌ను గుర్తించారు. జీవితంలో విఫలమయ్యా. నన్ను క్షమించండి. మీకు కొడుకుగా ఉండేందుకు నాకు అర్హత లేదని కుటుంబసభ్యులనుద్దేశిస్తూ లేఖ రాసినట్లు- పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు- తెలిపారు. పీయూష్ గతేడాది జులైలోనే ఈ కంపెనీలో చేరాడు. పనిఒత్తిడి, మానసిక సమస్యల కారణంగానే అతడు బలవన్మరణానికి పాల్పడి ఉంటాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

---

# లైంగిక వేధింపుల కేసులో కో పైలట్ అరెస్ట్

## విమానం ల్యాండ్ కాగానే అదుపులోకి

## తీసుకున్న పోలీసులు

**న్యూయార్క్,జూలై29(సమయజ్యోతి):** అమెరికాలో భారతీయ సంతతికి చెందిన ఓ పైలట్ అరెస్ట్ చేశారు. విమానం ల్యాండింగ్ అయిన వెంటనే కాక్ పిట్‌లోకి ఎంటరయిన హోమ్‌ల్యాండ్ ఏజెంట్లు- మరో మాట లేకుండా పైలట్ ను అదుపులోకి తీసుకున్నారు. ప్రయాణికులు ఇంకా దిగకుండానే వారిని తోసుకుంటూ వెళ్లిను ఏజెంట్లు- బ్యాడ్జీలు, గన్స్ తో విమానంలోకి ప్రవేశించి కో పైలట్ ను బంధించారు. అసలు పైలట్ ను ఎందుకు అరెస్ట్ చేశారో పూర్తి వివరాల్లోకి వెళితే.. భారతీయ సంతతికి చెందిన డెల్టా ఎయిర్‌లైన్స్ కో-పైలట్ భగవాగర్‌ను శాన్ ఫ్రాన్సిస్కో విమానాశ్రయంలో అరెస్టు చేశారు. విమానం ల్యాండ్ అయిన వెంటనే డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ ఏజెంట్లు-, అధికారులు కాక్‌పిట్‌లోకి ప్రవేశించి అతన్ని అదుపులోకి తీసుకున్నారు. జూలై 27 ఆదివారం నాడు మిన్నియాపాలిస్ నుంచి వచ్చిన డెల్టా ఫ్లైట్ 2809 (బోయింగ్ 757-300) ల్యాండ్ అయిన పది నిమిషాల తర్వాత ఈ అరెస్ట్ జరిగింది. ప్రయాణికులు ఇంకా విమానం దిగకముందే, ఏజెంట్లు- వారిని పక్కకు తోసుకుంటూ బ్యాడ్జ్‌లు, తుపాకులతో కాక్‌పిట్‌లోకి వెళ్లి భగవాగర్‌ను బంధించారు. కాంట్రా కోస్టా షెరీఫ్ కార్యాలయం ఫేస్‌బుక్ పోస్ట్ ప్రకారం..ఒక చిన్నారిపై లైంగిక నేరాలకు పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదు తర్వాత డిటె-క్టివ్‌లు ఏప్రిల్ నుండి దర్యాప్తు చేస్తున్నారు. ఈ దర్యాప్తులో భగవాగర్ నిందితుడిగా గుర్తించడంతో అతనిపై అరెస్ట్ వారెంట్ జారీ చేయబడింది. ఏప్రిల్‌లో 10 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లవాడితో ఐదుసార్లు నోటి ద్వారా లైంగిక వేధింపులకు పాల్పడినట్లు భగవాగర్‌పై ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం భగవాగర్ మార్టినెజ్ డిటెన్షన్ ఫెసిలిటీ జైలులో ఉన్నారు. పైలట్ భగవాగర్ అరెస్ట్‌పై డెల్టా ఎయిర్‌లైన్స్ తీవ్రంగా స్పందించింది.

# నేడు ఆత్మకూరుకు మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి రాక

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి**

**ఆత్మకూరు వనపర్తి జిల్లా.**



రాష్ట్ర పాడి పరిశ్రమల, మత్స్య, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆత్మకూరుకు బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ఆత్మకూరు పట్టణంలోని మార్కెట్ యార్డు నూతన పాలక వర్గం చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణస్వీకార కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి విచ్చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నల్లగొండ శీను, మండల అధ్యక్షుడు రాయిచూర్ పరమేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

# మెరుగైన వైద్యం అందిస్తూ... ఆరోగ్య అవగాహన కల్పించాలి

## : కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

ప్రభుత్వ దవాఖానల్లో వచ్చే రోగులకు ఆరోగ్య సంరక్షణ పై అవగాహన కల్పించాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ ఆదేశించారు. సిరిసిల్ల పట్టణంలోని సుందరయ్య నగర్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దవాఖానలో ఆయా వార్డులు, రికార్డులు, మందులను పరిశీలించారు. అనంతరం ఆసుపత్రికి వచ్చిన ప్రజలతో కలెక్టర్ మాట్లాడారు. వైద్య సేవలు ఎలా అందుతున్నాయో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి ఆవరణలో గల సీ.సీ. కెమెరా ఊడిపోవడం గమనించి వాటిని సరి చేయాలని ఆదేశించారు. ఆస్పత్రి ఆవరణలో గడ్డి, పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రం చేయించాలని సూచించారు. దవాఖానకు వచ్చే వారికి వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించాలని సూచించారు. జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తితే ప్రభుత్వ వైద్య సేవలు పొందాలని సూచించారు.



# వర్షాకాల నేపథ్యం..

## సిపి సాయి చైతన్య..

## లోతట్టు ప్రాంతాలు, వాగుల సందర్శన

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి నిజామాబాద్ బ్యూరో**

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, మంగళవారం సిరికొండ మండలం కొండూరు, తుంపల్లి గ్రామాల్లో వరద ప్రభావితానికి గురయ్యే బ్రిడ్జిలను క్షేత్రస్థాయిలో సందర్శించారు. కొండూరు గ్రామ సరిహద్దులో గల వాగు, తుంపల్లి నుండి పాకాల మార్గ మధ్యలో గల కప్పల వాగు, సిరికొండ నుండి న్యావనంది మార్గమధ్యలో గల వాగు దొండ్ల వాగులను క్షుణ్ణంగా పర్యవేక్షించారు. పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు వరదల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ, ప్రజల భద్రతకు సంబంధించి కీలక సూచనలు ఇచ్చారు. అంతేకాకుండా, గ్రామ భద్రత దృష్ట్యా సీసీ కెమెరాల అవసరం, ప్రాముఖ్యత గురించి వివరించి, ప్రతి గ్రామంలో వీటిని ఏర్పాటు చేసుకోవాలని గ్రామ ప్రజలను ప్రోత్సహించారు. ధర్పల్లి ఇన్స్పెక్టర్ బిక్షపతి సిరికొండ ఎస్సై రామకృష్ణ పాల్గొన్నారు.



# డైరీ ఫామ్ పేరు తో 32 లక్షల తో వ్యక్త పరార్ కేసు నమోదు

**సమయజ్యోతి న్యూస్**

**జూలై 29 బజార్ హత్నూర్**

ఇచ్చోడ మండలం లో స్నేహం పేరు తో కుచ్చుటోపీ పెట్టి పరారైన వ్యక్తి పై కేసు నమోదైనట్లు ఇచ్చోడ సీ ఐ రాజు పేర్కొన్నారు ఇచ్చోడ చెందిన అక్కపెల్లి శివకుమార్ వద్ద చెన్న పవర్ అభిషేక్ డైరీ ఫామ్ పెడుతున్ననని స్నేహం పేరు తో 4,50,000 తీసుకొని పారి పోయాడు ఈ విషయం పై ఆరా తీయగా 20 మందిని నమ్మించి సుమారుగా 32 లక్షల ఉడాయించాడని తెలిసింది శివకుమార్ పిర్యాదు తోచీటింగ్ కేసు నమోదు చేసి నిందితుని కోసం గాలిస్తున్నట్లు సీ ఐ రాజు తెలిపారు



# సిఎం రమేశ్ బ్రోకరిజం అందరికీ తెలుసు

- దాడులకు భయపడి బిజెపిలో చేరింది నిజం కాదా
- కెటిఆర్‌ను గతంలో ఎన్నిసార్లు కలిశావో చెప్ప
- కంచెగచ్చిబౌలి భూములపై మధ్యవర్తిత్వం నెరిపావా లేదా
- కెటిఆర్‌పై విమర్శలకు కొప్పల ఈశ్వర్ ఘాటు స్పందన

**హైదరాబాద్,జూలై29(సమయజ్యోతి):**



బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అవుతుందని అంటూ ఎంపీ సీఎం రమేష్ చేసిన వ్యాఖ్యలు 'ఇయర్ ఆఫ్ ది జోక్' అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ఎన్నటికీ బీజేపీలోనే కాదు.. ఏ పార్టీలో విలీనం కాదన్నారు. సీఎం రమేష్ ఎప్పుడు బీజేపీలో చేరారు అని, బీజేపీలో ఆయనకు ఉన్న పరపతి ఎంత అని ప్రశ్నించారు. కంచెగచ్చిబౌలి భూముల విషయంలో సీఎం రమేష్ మధ్యవర్తిగా ఉన్నారా? లేదా? అని తెలంగాణ ప్రజలకు సీఎం రమేష్ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీది తెలంగాణ భావజాలం అని, బీజేపీది ఆర్ఎస్ఎస్ భావజాలం అని పేర్కొన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే వాళ్లకు బ్రోకరిజం చేసే సీఎం రమేష్ మాటలను తెలంగాణ ప్రజలు పట్టించుకోవద్దని కొప్పుల ఈశ్వర్ చెప్పుకొచ్చారు. కంచె గచ్చిబౌలి భూముల విషయంలో సీఎం రమేష్ మధ్యవర్తిత్వం వహించి 10 వేల కోట్ల రుణాలు ఇప్పించారన్నారు. దీనికి సీఎం రమేష్ సమాధానం చెప్పకుండా, విలీనం అంశం ఎందుకు మాట్లాడుతున్నారు. కంచెగచ్చిబౌలి భూముల విషయంలో సీఎం రమేష్ మధ్యవర్తిగా ఉన్నారా? లేదా తెలంగాణ ప్రజలకు చెప్పాలి. కేటీఆర్ నా ఇంటికి వచ్చి కలిశారని అంటున్న సీఎం రమేష్.. నీ కంపెనీ కోసం, నీ కాంట్రాక్టుల కోసం అధికారంలో వున్నప్పుడు కేటీఆర్ వెంటపడలేదా?. బీఆర్ఎస్ ఎన్నటికీ బీజేపీలోనే కాదు ఏ పార్టీలో విలీనం కాదు. ఇప్పటి వరకు బీఆర్ఎస్ బీజేపీతో పొత్తు పెట్టు- కోలేదు. భవిష్యత్తులో బీజేపీతో బీఆర్ఎస్ పార్టీకి ఎలాంటి పొత్తు ఉండదని కొప్పుల ఈశ్వర్ అన్నారు.రేవంత్ రెడ్డి ఆఫీస్ నుంచి వచ్చిన స్క్రిప్ట్ సీఎం రమేష్ చదువుతున్నారు. టీడీపి నుంచి రాజ్యసభ ఎంపీ అయ్యి ఈడీ, సీబీఐ కేసులకు భయపడి బీజేపీలో చేరిన సీఎం రమేష్ మాటలకు విలువ ఉందా?. సీఎం రమేష్ చరిత్ర రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు తెలుసు. ఆంధ్రా ఎంపీ సీఎం రమేష్ అక్కడ ఉన్న కుల పంచాయతీలు తెలంగాణకు తీసుకురావాలని చూస్తున్నారు. ఆయన లాంటి వాళ్ళతో తెలంగాణ ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. సీఎం రమేష్ ప్రస్తావన చేసిన కమ్మ, రెడ్డి సామాజిక వర్గాలకు కేసీఆర్ సీఎంగా వున్నప్పుడు ఉన్న ప్రాధాన్యత ఇప్పుడు ఉందా?. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కమ్మ, రెడ్డి సామాజిక వర్గాల వారు అత్యధికంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఎంపీలుగా, పార్టీ పదవుల్లో ఉన్నారు. బీఆర్ఎస్ పార్టీని అస్థిరపరచాలని రేవంత్ రెడ్డి ఇచ్చిన స్క్రిప్ట్ సీఎం రమేష్ చదివారు. తెలంగాణ వచ్చాక కేసీఆర్ నాయకత్వానికి అన్ని వర్గాలు మద్దతు తెలిపాయి. 2023లో బీఆర్ఎస్ అధికారంలోకి రాకపోయినా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఎక్కువ సీట్లు- గెలిచింది. సెటిలర్స్, కమ్మ, రెడ్డి, అన్ని సామాజిక వర్గాల వారు కేసీఆర్, కేటీ-ఆర్ నాయకత్వానికి ఆమోదం తెలిపారు. బీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇస్తున్న సామాజికవర్గాల వారిని కేటీ-ఆర్ ఎట్లా తిడతారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే వాళ్లకు బ్రోకరిజం చేసే సీఎం రమేష్ మాటలను తెలంగాణ ప్రజలు పట్టించుకోవద్దు' అని కొప్పుల ఈశ్వర్ సూచించారు.

# రాష్ట్ర పౌరసరఫరాల శాఖలో భారీ స్కాం

## రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారుల పాత్ర

## ఇడికి ఫిర్యాదు చేసిన బిఆర్ఎస్ నేతలు

**హైదరాబాద్,జూలై29(సమయజ్యోతి):**

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ స్కాంలో సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సంబంధిత అధికారులు ప్రత్యక్షంగా పాల్గొన్నారని బిఆర్ఎస్ సీనియర్ నేత పెద్దిరెడ్డి సుదర్శన్ రెడ్డి ఆరోపించారు. ఈ కుంభకోణంలో రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డినే ప్రధాన పాత్రధారులు అని పేర్కొన్నారు. పౌరసరఫరాల శాఖలో కుంభకోణంపై మాజీ మంత్రి గంగుల కమలాకర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి మంగళ వారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి)కి ఫిర్యాదు చేశారు. అనంతరం తెలంగాణ భవన్‌లో వారు మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి సుదర్శన్ మాట్లాడుతూ.. పద్దెనిమిది నెలల క్రితం జరిగిన ధాన్యం కొనుగోలు -టె-ండర్ల కుంభకోణంపై ఇప్పటికే ఎనిమిది సార్లు ప్రెస్‌మీట్ పెట్టామని, ఇదే అంశంపై అసెంబ్లీలో తమ నేతలు కెటిఆర్, హరీశ్‌రావు లేవనెత్తినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన రాలేదని అన్నారు. దీనిపై హైకోర్టును కూడా ఆశ్రయించామని తెలిపారు. రైస్ మిల్లర్ల నుంచి బిడ్డర్లు ధాన్యం టన్నుకు రూ.2230 అదనంగా వసూలు చేసి కాంగ్రెస్ పెద్దలకు పంపించారని ఆరోపించారు. అక్రమంగా డబ్బులు చేరిన 187 ఖాతాల వివరాలను సేకరించామని తెలిపారు. ఇందులో మనీలాండరింగ్ జరిగిందని పేర్కొన్నారు. తాము సేకరించిన ఆధారాలతో ఇడికి ఫిర్యాదు చేశామని చెప్పారు. ఇడితో పాటు- సిబిఐ, డైరెక్టరేట్ ఆఫ్ ఇం-టె-లిజెన్స్‌కు కూడా ఫిర్యాదు చేస్తున్నామని తెలిపారు. మొత్తం 700 పేజీలకు పైగా బుక్‌లెట్ తయారుచేసి దర్యాప్తు సంస్థలకు పంపిస్తున్నట్లు- వెల్లడించారు. ఈ కుంభకోణంలో తప్పకుండా దోషులకు శిక్ష పడుతుందని .. ఎవ్వరూ తప్పించుకోలేరని ఆశాభావం వ్యక్తం చేశారు. పౌరసరఫరాల శాఖలో జరిగిన ఈ కుంభకోణంపై బిజెపి స్పందించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందని అన్నారు. ఈ దోపిడీని బయటపెట్టామని అన్నారు. రూ.423 కోట్లు- వివిధ బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ అయ్యాయని చెప్పారు. ఎన్నిసార్లు కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు అడిగినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడమే ఈ కుంభకోణం జరిగిందని అనడానికి రుజువని అన్నారు. ఈ అవినీతి ఇంకా కొనసాగుతూనే ఉందని తెలిపారు. ధాన్యం కొనుగోలు టెండర్లలో మొదటి నుంచి అవకతవకలు జరిగాయని మాజీ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ప్రభుత్వ ఖజానాల్లోకి రావాల్సిన డబ్బులు ప్రైవేటు- వ్యక్తుల ఖాతాల్లోకి వెళ్లాయని ఆరోపించారు. ఈ స్కాంపై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని తెలిపారు. ఈ కుంభకోణంపై ఎసిబి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. దర్యాప్తు సంస్థల మీద తమకు విశ్వాసం ఉందని, అందుకే రాష్ట్రంతో పాటు కేంద్రంలో దర్యాప్తు సంస్థలకు ఈ కుంభకోణంపై ఫిర్యాదు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ స్కాంపై కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి ఇప్పటికైనా నోరు తెరవాలని డిమాండ్ చేశారు..

# పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

పేద విద్యార్థులకు మెరుగైన విద్య, అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యతా లక్ష్యంగా పని చేస్తున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవార ఆయన, కలెక్టర్ సందీప్ కుమార్ ఝ తో కలిసి వేములవాడ అర్బన్ మండలంలోని అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో పిఎం ఉషా పథకం క్రింద 9 కోట్ల 20 లక్షల నిధులతో మహిళా వసతి గృహము హాస్టల్ భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ శాసనసభ్యుడిగా ఎన్నికైన తర్వాత తొలిసారి అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల పర్యటించిన సందర్భంగా బాలికలు హాస్టల్ వసతి లేక పడుతున్న ఇబ్బందులను గమనించి సీఎం దృష్టికి తీసుకుని వెళ్ళానని అన్నారు. విద్య పట్ల ప్రభుత్వానికి ఉన్న ప్రాముఖ్యత, పేదలు చదువుకునే పాఠశాలలు, కళాశాలలు, రెసిడెన్షియల్ విద్యా సంస్థల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత కల్పిస్తూ పనిచేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం హాస్టల్ నిర్మాణానికి 10 కోట్లు మంజూరు చేసిందని అన్నారు. 2005 సంవత్సరంలో అగ్రహారం డిగ్రీ కళాశాలలో సైన్స్ వింగ్ ఏర్పాటు కోసం అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి సహకారంతో ఏర్పాటు చేశామని ఆయన గుర్తు చేశారు. హాస్టల్ వసతి కారణంగా ఎక్కువమంది బాలికలు ఉన్నత చదువులు చదువుకుంటారని ప్రభుత్వ విప్ పేర్కొన్నారు. రెసిడెన్షియల్ విద్యార్థులు చదువుకునే పేద పిల్లల కోసం ప్రజా ప్రభుత్వం 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్ చార్జీల పెంచామని అన్నారు. పేద పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని లక్ష్యంతో కామన్ డైట్ మేన్యూ ప్రవేశ పెట్టామని అన్నారు. నూతనంగా 11 వేల టీచర్ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేసి ప్రభుత్వ పాఠశాలలో నియమించామని అన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించిన బదిలీలు పదోన్నతులు పారదర్శకంగా చేశామని అన్నారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకుని వస్తున్నామని, ఐటిఐ కళాశాలను రతన్ టాటా కంపెనీతో అనుసంధానం చేసుకొని అడ్వాన్స్ ట్రేడ్ సెంటర్లుగా మారుస్తున్నామని అన్నారు. 200 కోట్ల రూపాయలను ఖర్చు చేసి 20 నుంచి 25 ఎకరాల స్థలంలో యంగ్ ఇండియా సమీకృత గురుకుల నిర్మాణ పనులు ప్రభుత్వం చేపట్టిందని అన్నారు. మేడిపల్లి మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంజూరు చేసుకున్నమని అన్నారు. వేదాలకు సంబంధించిన ఆల్ ఇండియా పరీక్షలు వేములవాడ రాజన్న ఆలయంలో జరగాయని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని విద్యా సంస్థలను వేములవాడ ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తామని తెలిపారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝు మాట్లాడుతూ నాగ పంచమి రోజు పీఎం ఉష పథకం క్రింద 9 కోట్ల 20 లక్షల రూపాయలతో అగ్రహారం లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద బాలికల వద్ద గృహ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. 18 నెలల కాలంలో ఈ భవన నిర్మాణ పనులు పూర్తి చేసి విద్యార్థినులకు అందుబాటులో ఉంచుతామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు స్థానిక నాయకులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సమిష్టి కృషితో జిల్లాను అభివృద్ధిలో
# అగ్రభాగాన నిలుపుదాం

## అధికారులతో సమీక్షలో జిల్లా ఇంచార్జి మంత్రి అనసూయ సీతక్క

## ఎరువుల కొరత తలెత్తకుండా చక్కగా వ్యవరిస్తున్నారని జిల్లా యంత్రాంగానికి ప్రశంస

## పాల్గొన్న ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి నిజామాబాద్, మే 29 :**



అందరూ కలిసికట్టుగా పనిచేస్తూ, సమిష్టి కృషితో నిజామాబాద్ జిల్లాను అభివృద్ధిలో అగ్రభాగాన నిలుపుదామని నిజామాబాద్ ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి,, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమం, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క పిలుపునిచ్చారు.మంగళవారం నిజామాబాద్ జిల్లా అధికారులతో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ, పోచారం శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి ఇంచార్జి మంత్రి ధనసరి అనసూయ సీతక్క కీలక అంశాలపై సుదీర్ఘ సమీక్ష జరిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, సీజనల్ వ్యాధుల నియంత్రణ, వన మహోత్సవం, భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, ఎరువులు, మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక పరిపుష్టికి చేపడుతున్న కార్యక్రమాలు, గృహజ్యోతి, మిషన్ భగీరథ, పంచాయతీరాజ్ పనితీరు తదితర అంశాలతో పాటు తాగునీరు, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంపై మంత్రి సమీక్ష నిర్వహించారు. శాసన సభ్యులు సుదర్శన్ రెడ్డి, డాక్టర్ భూపతి రెడ్డి, ధన్పాల్ సూర్యనారాయణ, రాకేష్ రెడ్డి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ట్రైనీ కలెక్టర్ కరోలినా చింగ్తియాన్ మావీ, అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా అంశాల వారీగా వివరాలను కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి ఇంచార్జి మంత్రి దృష్టికి తెచ్చారు. భారీ వర్షాల నేపథ్యంలో ముందస్తుగానే అప్రమత్తతతో కూడిన అన్ని చర్యలు తీసుకున్నామని, కలెక్టరేట్ లో, ఇతర శాఖల కార్యాలయాలలో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేశామని, ఎస్.డీ.ఆర్.ఎఫ్ బృందాలు కూడా అందుబాటులో ఉన్నాయని, పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందని అన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని, వ్యాధులు ప్రబలిన సందర్భాల్లో తక్షణమే స్పందించేలా రాపిడ్ యాక్షన్ టీంలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలలో ప్రగతి సాధించామని, రేషన్ కార్డుల పంపిణీ, సన్న బియ్యం పంపిణీ సజావుగా సాగుతోందని అన్నారు. ఈ సందర్భంగా ఇంచార్జి మంత్రి మాట్లాడుతూ, వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన నిజామాబాద్ జిల్లాలో ఎరువుల కొరత తలెత్తకుండా జిల్లా యంత్రాంగం ప్రణాలికాబద్ధంగా వ్యవ హరిస్తుండడం అభినందనీయమని ప్రశం సించారు. వానాకాలం పంట సీజన్ ముగిసే వరకు కూడా ఇదే తరహాలో పని చేయాలని సూచించారు. ప్రస్తుత వర్షాకాలంలో ప్రమాదాలకు ఆస్కారం లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా సీజనల్ వ్యాధులు సోకకుండా వచ్చే రెండు నెలల పాటు ఎంతో అప్రమత్తతో వ్యవహరించాలని హితవు పలికారు. పారిశు ధ్యం నిర్వహణపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, ప్రజలలో అవగాహన పెంపొందించేందుకు గ్రామగ్రామాన శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. తాగునీరు కలుషితం కాకుండా, పైప్ లైన్ లీకేజీలు లేకుండా అనునిత్యం పర్యవేక్షణ జరపాలని అన్నారు. ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో పాము కాటు మందు, ఇతర అన్ని రకాల ఔషధాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా పర్యటించాలని, అప్పుడే వారి దృష్టికి సమస్యలు వస్తాయని, తద్వారా వాటిని పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు కూరగాయల సాగు విషయంలో ప్రోత్సహించేలా ఉపాధి హామీ పథకం ద్వారా తోడ్పాటును అందించే అంశాన్ని పరిశీలిస్తామని, నిజామాబాద్ జిల్లాలో దీనిని మొదటగా ప్రయోగాత్మక పద్ధతిలో అమలు చేసిన అనంతరం రాష్ట్రం అంతటా వర్తింపజేస్తామని మంత్రి వెల్లడించారు. నీటి పారుదల, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించిన పెండింగ్ పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ బడులలో మౌలిక సదుపాయాలను మరింతగా మెరుగుపర్చేలా కృషి చేస్తామని, ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చొరవ చూపుతామని అన్నారు. ఉమ్మడి జిల్లాను అన్ని రంగాలలో సమగ్ర అభివృద్ధి సాధించేలా అందరి సహకారంతో ముందుకు వెళ్తామని ఇంచార్జి మంత్రి స్పష్టం చేశారు. అంగన్వాడి భవనాలు, మహిళా శక్తి భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయించాలని సూచించారు. మహిళల సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, వడ్డీ లేని రుణాలు, ప్రమాద బీమా, లోన్ బీమా తదితర ప్రయోజనాల గురించి విస్తృత ప్రచారం నిర్వహిస్తూ మహిళలందరూ స్వయం సహాయక సంఘాలలో సభ్యులుగా చేరేలా ప్రోత్సహించాలని హితవు పలికారు. కాగా, సీఎంఆర్ ధాన్యం అందించకుండా అవకతవకలకు పాల్పడిన రైస్ మిల్లర్లపై రెవెన్యూ రికవరీ యాక్టుతో పాటు నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. డిఫాల్ట్ మిల్లులపై ఇప్పటివరకు తీసుకున్న చర్యల గురించి సమగ్ర వివరాలతో నివేదిక అందించాలని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు పలు అంశాలను ప్రస్తావించగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఇంచార్జి మంత్రి అనసూయ సీతక్క సంబంధిత అధికారులను ఆదేశించారు. సమీక్షా సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, రాష్ట్ర రైతు, వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు సుదం లక్ష్మి, అన్ని శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, సంరక్షించాలి

## : మొక్కలు నాటిన ప్రభుత్వ విప్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

వాతావరణ సమతుల్యత.. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని.. వాటిని సంరక్షించాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. వన మహోత్సవాన్ని వేములవాడ శ్రీ రాజ రాజేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన తిప్పాపూర్ గోశాలలో మంగళవారం నిర్వహించగా, ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయి, ఆవరణలో కదంబ, ఇతర మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడారు. రాను రాను అడవుల విస్తీర్ణం తగ్గుతుండడంతో వాతావరణ కాలుష్యం పెరుగుతుందని, ఆక్సిజన్, పర్యావరణ ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా తమ తమ ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. గ్రామాల్లో.. పట్టణాల్లోని ఖాళీ స్థలాల్లో పండ్ల, పూల మొక్కలు నాటాలని కోరారు. మొక్కలు నాటేటప్పుడు స్తంభాల కింద, గోడల వద్ద పెట్టవద్దని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం.. సీఎం రేవంత్ రెడ్డి వేములవాడ రాజన్న ఆలయం, నియోజకవర్గం, పట్టణ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని, భారీగా నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. వేములవాడ ఆలయం, పట్టణ అభివృద్ధి పై సీఎం ప్రత్యేక దృష్టి పెడుతున్నారని పేర్కొన్నారు. అలాగే తిప్పాపూర్ గోశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్నారని వివరించారు. రాష్ట్రంలో నాలుగు అధునాతన పద్ధతిలో విశాలమైన గోశాలల నిర్మాణానికి సీఎం అధ్యక్షతన కేబినెట్ ఆమోదించిందని గుర్తు చేశారు. వేములవాడ ఆలయానికి సంబంధించి కూడా ఆధునాతన వసతులతో గోశాల పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని దీనికి సంబంధించి స్థలం కూడా గుర్తించామని వెల్లడించారు. వన మహోత్సవంలో భాగంగా అటవీ శాఖ, ఇతర శాఖల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. పౌరులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడంతో ప్రస్తుతంతో పాటు భవిష్యత్ తరాలకు ఎంతో మేలు చేకూరుతుందని పేర్కొన్నారు. కదంబ మొక్కలకు మొక్కలు దేవత మూర్తులకు ఎంతో ప్రీతిపాత్రమైనవని వివరించారు.

**ఐ.ఎస్.ఓ సర్టిఫికేషన్ కోసం కృషి: కలెక్టర్**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన తిప్పాపూర్ గోశాలకు ఐఎస్ఓ సర్టిఫికెట్ వచ్చేలా కృషి చేస్తున్నామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వెల్లడించారు. తిప్పాపూర్ గోశాల ఆవరణలో సివిల్ వర్క్స్ కొనసాగుతున్నాయని వాటిని విప్ తో కలిసి పరిశీలించామని తెలిపారు. కోడెలకు పచ్చి గడ్డి సరఫరాలో ఇబ్బంది కలగకుండా ప్రత్యేక ప్రణాళిక ప్రకారం ముందుకు వెళు తున్నామని తెలిపారు. మర్రిపల్లిలో 40 ఎకరాలు, నాంపల్లిలో 20 ఎకరాల ప్రభుత్వ భూమిలో పచ్చి గడ్డి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పెంచేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టామని వివరించారు. మూడు నెలల్లో పచ్చి గడ్డి అందుబాటులోకి రానుందని వెల్లడించారు. కోడెలకు అవసరమైన పచ్చిగడ్డి ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని కాంట్రాక్టర్లపై ఆధారపడే ఇబ్బంది ఉండదని ఈ విషయంలో స్వయం సమృద్ధి సాధించామని స్పష్టం చేశారు. ఆ మేరకు డబ్బులు ఆదా అవుతాయని వెల్లడించారు. గోశాలలో ఒక్కో సమస్య ప్రణాళిక ప్రకారం పరిష్కరిస్తున్నామని తెలిపారు. మొరాదాబాద్ లోని గోశాలకు ఐఎస్ఓ సర్టిఫికెట్ వచ్చిందని గుర్తు చేశారు.



తిప్పాపూర్ గోశాల కూడా ఐఎస్ఓ సర్టిఫికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నామని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వనమహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఇంచార్జి ఈవో రాధాబాయి మున్సిపల్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇంచార్జి మంత్రికి ఘన స్వాగతం

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి నిజామాబాద్ బ్యూరో**

నిజామాబాద్ ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క మంగళవారం నిజామాబాద్ జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించేందుకు ఐ.డీ.ఓ.సీకి చేరుకున్న సందర్భంగా మంత్రికి కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, ఇతర జిల్లా అధికారులు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. సమీక్ష అనంతరం టీఎన్జీఓ, టీజీఓ, ఇతర సంఘాల ప్రతినిధులు, మీడియా ప్రతినిధులు ఇంచార్జి మంత్రిని కలిసి వినతి పత్రాలు అందజేశారు.





# రేషన్ కార్డు రాని వాళ్ళు కంది శ్రీనివాస్ రెడ్డి క్యాంప్ ఆఫీస్ లో సంప్రదించండి.

## - జహీర్ రంజాని

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

రేషన్ కార్డు పంపిణీ ప్రక్రియ 90 శాతం పూర్తయిందని,రానివాళ్లు కంది శ్రీనివాస్ రెడ్డి క్యాంప్ ఆఫీసులో సంప్రదించాలని మంగళవారం ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన సమావేశంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని తెలియజేశారు. మీడియా సమావేశంలో జహీర్ రంజాన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 18,19 నెలలలో ఎన్ని సంక్షేమ పథకాలను అమలు చేయడం బహుశా ఏ పార్టీకి సాధ్యం కాలేదన్నారు.రేషన్ కార్డు పంపిణీ ప్రక్రియ దాదాపు 90 శాతం పూర్తయిందని, ఇంకా రేషన్ కార్డు రానివారు కంది శ్రీనివాస్ రెడ్డి క్యాంప్ ఆఫీస్ లో సంప్రదించాలని,ప్రతి వారం ప్రజా దర్బార్ నిర్వహించడం జరుగుతుందని, చాలామంది ప్రజలు తమ సమస్యలతో వస్తున్నారని వారి సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రజాభవన్ లో ప్రతిరోజు,భోజనం ఏర్పాట్లు కూడా చేయడం జరుగుతుందన్నారు.ప్రజాపాలనలో భాగంగా ప్రజా సంక్షేమ పథకాలైన 500 కి గ్యాస్ సిలిండర్, గృహ జ్యోతి జీరో కరెంట్ బిల్లు,మహిళలకు ఉచిత ప్రయాణం,రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని కానీ స్థానిక బిజెపి నాయకులు కేంద్ర ప్రభుత్వం పంపిణీ చేస్తుందని చెబుతున్నారు. అలాంటప్పుడు పక్కనున్న మహారాష్ట్రలో సన్న బియ్యం పంపిణీ ఎందుకు జరగడంలేదని జహీర్ రంజాని అన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్న కాంగ్రెస్ నాయకులకు సంప్రదించాలని వారి సమస్యలు వెంటనే పరిష్కరించబడతాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉపాధి కల్పనలో, ప్రజా సంక్షేమంలో అభివృద్ధి ఎలా జరుగుతుందనేది ప్రజలు గమనిస్తున్నారని మునుముందు ఆదిలాబాద్ పట్టణ అభివృద్ధి కోసం రాబోవు స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి విజయం చేకూర్చాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో నాయకులు ఖిజర్ పాషా,షౌకత్ అలీ, సోనియా మంథాని,హాకీం తదితరులు పాల్గొన్నారు.




# టిటిడికి విరాళంగా ఇంటిని రాసిచ్చిన దంపతులు

**తిరుమల,జూలై29(సమయజ్యోతి):**

ఇటీవల మృతిచెందిన మాజీ ఐఆర్ఎస్ అధికారి భాస్కర్‌రావు స్ఫూర్తితో హైదరాబాద్‌కు చెందిన దంపతులు తమ ఇంటిని టిటిడికి విరాళంగా ఇచ్చారు. ఈ మేరకు అదనపు ఈవోకు సంబంధిత పత్రాలను అందజేశారు. మల్కాజ్‌గిరిలోని వసంతపురి కాలనీకి చెందిన టి.కనకదుర్గ ప్రసాద్, సునీతా దేవి దంపతులకు సంతానం లేదు. తమ తదనంతరం రూ.18.75లక్షల విలువైన 250 గజాల ఇల్లు శ్రీవారికి చెందేలా వీలునామా రాసి స్వామిపై అపారమైన భక్తిని చాటుకున్నారు. ఇటీవల మాజీ ఐఆర్ఎస్ అధికారి భాస్కర్‌రావు వీలునామా ద్వారా రూ.3కోట్ల విలువైన ఇల్లు, రూ.66లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లను విరాళంగా ఇచ్చిన విషయం తెలిసిందే. ఆయన నుంచి స్ఫూర్తి పొందిన మల్కాజ్‌గిరికి చెందిన దంపతులు తమ ఇంటికి సంబంధించిన ఆస్తి పత్రాలను తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరికి అప్పగించారు. భక్తితో ఇంటిని విరాళంగా ఇవ్వడం ఇతర భక్తులకు కూడా స్ఫూర్తిగా నిలుస్తుందని వెంకయ్యచౌదరి అన్నారు. టి.కనకదుర్గ ప్రసాద్, సునీతా దేవి దంపతులను ఆయన అభినందించారు.

## మంత్రి సార్ డి. ఎం. ఆర్. ఎం హాస్పటల్ ను ప్రభుత్వ పరంగా చేయండి

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.**

అమరచింత మండల కేంద్రంలో ఉన్న డి. ఎం. ఆర్. ఎం హాస్పటల్ లో అరకొర ప్రభుత్వ సేవలు ప్రజలకు అందుతున్నవి.గత పాలకులు డి. ఎం. ఆర్. ఎం హాస్పటల్ ను ప్రభుత్వ పరంగా చేస్తామని హామీలు ఇచ్చారు కాని ఆ హామీలు అమలు నోచుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరవాత గత ఏడాది జనవరి మాసంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజానర్సింహా డి. ఎం. ఆర్. హాస్పటల్ ను ప్రభుత్వ పరంగా చేస్తామని హామీ ఇచ్చారు ఆ హామీ నేటికి నెరవేరాలేదు. మక్తల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ప్రాతినిత్యం వహిస్తున్న డాక్టర్ వాకిటి శ్రీహరి రాష్ట్ర పాడి పరిశ్రమల, మత్స్య, క్రీడల శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించడం నియోజకవర్గ ప్రజలు అదృష్టంగా భావిస్తున్నాను.అమరచింత డి. ఎం. ఆర్. ఎం హాస్పిటల్ ను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకోని పోయి డి. ఎం. ఆర్. ఎం హాస్పటల్ ను ప్రభుత్వ పరంగా చేసి మండల ప్రజలకు 24 గంటలు వైద్య సేవలు అందించాలని పలువురు కోరుతున్నారు.




## ఆహార భద్రత కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా,ఎమ్మెల్యే పాయల్ శంకర్

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

ఆహార భద్రత కార్డుల పంపిణీ లో భాగంగా మంగళవారం జైనథ్ మండలం లోని శ్రీ లక్ష్మీ నారాయణ కళ్యాణ మండపం లో ఏర్పాటు చేసిన జైనథ్,బోరజ్,సాత్నాల,బేల మండలాల లబ్ధిదారులకు రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా,ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కొత్త రేషన్ కార్డులు జైనథ్ 147,బోరజ్ 50, సాత్నాల 37,బేల 20 మొత్తం 254 కార్డులు కొంతమంది లబ్దిదారులకు జిల్లా కలెక్టర్,ఎమ్మెల్యే రేషన్ కార్డుల పత్రాలను అందజేశారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని,రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులు లేని అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులను అందజేస్తుందని అన్నారు.సన్న బియ్యం,రేషన్ కార్డులు,ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు మహాలక్ష్మి పథకం అందించి ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం కల్పించి, మహిళలను కోటీశ్వరులు చేయాలన్న ప్రభుత్వ దృఢ సంకల్పాన్ని ముందుకు తీసుకెళ్లడానికి ఎన్నో కార్యక్రమాలు, అభివృద్ధి పనులు చేపడుతున్నదని



అన్నారు.రేషన్ కార్డులలో పేర్లు నమోదు కాని వారు నమోదు చేయించుకోవాలని, రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని అన్నారు. ఎవరైనా చనిపోయిన లేదా రేషన్ కార్డులలో పేర్లు తప్పుగా నమోధై ఉంటే స్వచ్ఛందంగా వారి పేర్లు తీసివేయించాలని కోరారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం,రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కృషి చేయాలని, ప్రభుత్వాలు అందించే పథకాలు లబ్ది దారులకు చేరాలని అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి,గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నరసయ్య,ఆర్డీఓ స్రవంతి,సివిల్ సప్లయ్ అధికారి వాజిద్,మండలాల తాసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఆత్మకూరు మార్కెట్ చైర్మన్ గా ఎం. డి. రహిమతుల్లా ప్రమాణ స్వీకారం

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి ఆత్మకూరు వనపర్తి జిల్లా.**



ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సినియర్ నాయకుడు,రాష్ట్ర పాడి పరిశ్రమల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ముఖ్య అనుచరుడు కరాటే మాస్టర్ ఎం. డి. రహిమతుల్లా ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ గా బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు మార్కెట్ యార్డు ప్రాంగణంలో రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేస్తారు. వీరి తో పాటు వైస్ చైర్మన్ గా నర్వ కృష్ణారెడ్డి, పాలకవర్గ డైరక్టుర్లు గా టి. రవి కాంత్, ఎస్. శ్యామ్ కుమార్, పి. విష్ణు, డి. మోహన్, కామలాకర్ గౌడ్, రాజు, డి. గోవర్ధన్, అరవింద్ రెడ్డి, మన్యమ్మ, నరేష్, వెంకటయ్య, సత్యన్నలు ప్రమాణ స్వీకారం చేస్తారు. ఈ కార్యక్రమానికి రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నల్లగొండ శ్రీను, మండల అధ్యక్షులు రాయచూరు పరమేష్, కాంగ్రెస్ పార్టీ సినియర్ నాయకుడు తులసిరాజ్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు.

## ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం పై ప్రభుత్వం సానుకూలం

### పిఆర్ టియు జిల్లా అధ్యక్షులు పి.మోహన్

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

ప్రభుత్వం ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంపై సానుకూలంగా ఉందని, పిఆర్ టియు కృషితో వారం రోజుల్లో ఉపాధ్యాయ పదోన్నతుల షెడ్యూల్ విడుదల కానుందని బాల్కొండ మండల కేంద్రంలో మంగళవారం జిల్లా అధ్యక్షులు పి.మోహన్ పేర్కొన్నారు. కేజీబీవీ టీచర్ల రెగ్యులరైజేషన్ కు కృషి చేస్తున్నామని అన్నారు. మోడల్ స్కూల్ టీచర్లకు 010 ప్రకారం జీతాలు వచ్చేందుకు, కోర్టు తీర్పు ప్రకారం నేషనల్ ఇంక్రిమెంట్ల అమలు, 317 జీవో కు సంబంధించి ఇప్పటికే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలవడం జరిగిందని, త్వరలోనే ప్రభుత్వాన్ని ఒప్పిస్తామని తెలిపారు. గురుకుల పాఠశాలల వేళల మార్పిడికి ప్రభుత్వాన్ని ఒప్పించామని తెలిపారు.కార్యక్రమంలో మండల అధ్యక్షులు వేల్పూర్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రతాపరెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ప్రశాంత్ కుమార్, సురేష్ కుమార్, శంకర్, మండల జిల్లా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



## సిఎం రమేశ్ ఇంటికి వెళ్లావా లేదా

### రమేశ్ వ్యాఖ్యలపై ఎందుకు సమాధానం లేదు

### కెటిఆర్‌కు సవాల్ చేసిన మంత్రి సీతక్క

**హైదరాబాద్,జూలై29(సమయజ్యోతి):**



బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు మంత్రి సీతక్క సవాల్ విసిరారు. రాజ్యసభ ఎంపి సిఎం రమేష్ ఇంటికి వెళ్లిన విషయంపై కెటిఆర్ ఎందుకు స్పష్టత ఇవ్వడంలేదని అడిగారు. కెటిఆర్ అబద్దాలకోరు అనేది సిఎం రమేష్ మాటల్లో తెలుస్తుందన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపితో బిఆర్ఎస్ కుమ్మక్కు కాలేదని కెటిఆర్ ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్కశాతం ఓట్లు తేడా వస్తే పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ ఓట్లన్నీ బిజెపికి వెళ్లాయని.. కెటిఆర్ గుండెపై చేయి వేసుకొని ఈ విషయంపై క్లారిటీ– ఇవ్వాలని సీతక్క డిమాండ్ చేశారు. లిక్కర్ స్కామ్‌లో ఎంఎల్‌సి కవిత అరెస్టు తరువాత తన ఇంటికి కెటిఆర్ వచ్చారని రాజ్యసభ ఎంపి సిఎం రమేష్ సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. కవితను విడుదల చేస్తే బిఆర్ఎస్‌ను బిజెపిలో విలీనం చేస్తానన్నారని సిఎం రమేష్ మీడియాతో చెప్పారు. తన వల్లే కెటిఆర్గెలిచారని రమేష్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. కెటిఆర్ గురించి చెప్పాలంటే చాలా విషయాలు ఉన్నాయని తనకు సంస్కారం అడ్డువస్తుందన్నారు. కవిత అరెస్ట్ తర్వాత నువ్వే నా ఇంటికి వచ్చావు. బీజేపీలో బీఆర్ఎస్‌ను విలీనం చేస్తానని అప్పుడే చెప్పావు. కవితను విడుదల చేస్తే బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేస్తానని నువ్వు చెప్పిన విషయం మరిచిపోయావా? అని ప్రశ్నించారు. అలాగే, 'నా వల్లే నువ్వు ఎన్నికల్లో గెలిచావు. కేవలం 300 ఓట్ల మెజారిటీతో గెలిచిన విషయం నీకు తెలుసు. నీ గురించి చెప్పాలంటే చాలా విషయాలు ఉన్నాయి, కానీ నా సంస్కారం అడ్డువస్తోందని సీఎం రమేష్ అన్నారు. ఈ క్రమంలో కేటీఆర్‌కు మంత్రి సీతక్క సవాల్ విసిరారు. సీఎం రమేష్ ఇంటికి వెళ్లిన విషయంపై కేటీఆర్ సమాధానం చెప్పాలన్నారు. కేటీఆర్ అబద్ధాలు మాట్లాడుతారనేది ఎంపీ రమేష్ మాటల్లో చూశాం.. ఎన్ని అబద్ధాలు చెప్పినా.. కొద్దీ రోజుల్లో నిజం తెలుస్తుందని మంత్రి సీతక్క వెల్లడించారు.

## రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా మాజీ ఎంపీ సోయం బాపూరావు

### సన్మానించిన మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజానీ,టౌన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

ఆదిలాబాద్ పట్టణంలోని అమరావతి కాలనీలో గల మాజీ ఎంపీ,రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపూరావు ని మంగళవారం ఆదిలాబాద్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజని,టౌన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పుష్పగుచ్ఛము అందజేసి,శాలువాతో సన్మానించారు.నూతనంగా రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేసినందుకు మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.మాజీ ఎంపీ,రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపూరావు మాట్లాడుతూ రాజ్ గోండ్ సేవ సమితికి అటు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ ప్రజల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.పట్టణంలో ఏవైనా సమస్యలు ఉంటె తన దృష్టికి తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి సమస్యలు వివరించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ మున్సిపల్ వైస్ చైర్మెన్ తో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఖిజార్ పాషా,జిల్లా మహిళ ఉపాధ్యక్షురాలు సోనియా మంథాని,హాకిం తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధిని చూసి ఓర్వలేక విమర్శలు

### వైసిపి తీరుపై మండిపడ్డ మంత్రి రాంప్రసాద్ రెడ్డి

**తిరుపతి,జూలై29(సమయజ్యోతి):**

అభివృద్ధి చూసి ఓర్వలేకే వైసీపీ విమర్శలు చేస్తోందని రోడ్డు రవాణా మంత్రి రాంప్రసాద్ రెడ్డి వైసీపీ పార్టీపై నిప్పులు చెరిగారు. తాజాగా తిరుపతిలో మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు చంద్రబాబు శ్రమిస్తున్నారన్నారు. రోజుకు 18 గంటలు పనిచేస్తూ... రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. సింగపూర్ లాగా అమరావతిని అభివృద్ధి చేస్తామని పదేళ్ల ముందే మాట ఇచ్చారని గుర్తు చేశారు. ఇందుకు అనుగుణంగా సింగపూర్ ప్రభుత్వ ఆర్కిటెక్ లతో అద్భుతమైన డిజైన్ చేయించారన్నారు. గతంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం వేల కోట్ల రూపాయలు అక్రమాలు చేశారని ఆరోపించిందని తెలిపారు. ఒక్క రూపాయి కూడా అవినీతి జరగలేదని స్పష్టం అయ్యిందన్నారు. ప్రపంచంలోనే అత్యున్నత ప్రమాణాలతో నిర్మాణం చేపట్టేలా సీఎం ప్రణాళికలు చేస్తున్నారని వెల్లడించారు. కళ్లులేని వైసీపీ కబోధులు దుష్ప్రచారం చేయడం బాధాకరమన్నారు. అభివృద్ధి చూసి ఓర్వలేకే వైసీపీ విమర్శలు చేస్తోందని తెలిపారు. కక్ష్య పూరితంగా చర్యలు తీసుకోవాలంటే వైసీపీ నాయకులను ఇప్పటికే అరెస్ట్ చేసి ఉండొచ్చు.. మేము వైసీపీ నాయకులను ఎవరిని టచ్ చేయలేదని చెప్పారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడిన వారిని చట్ట పరంగా శిక్షించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. నకిలీ డిస్లరీలు ఏర్పాటు– చేసి వేలాదిమంది ప్రాణాలు బలిగొన్నారని రాంప్రసాద్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం చెప్తే.. న్యాయస్థానాలు, జడ్జీలు శిక్ష వేసే పరిస్థితి ఉందా? అని ప్రశ్నించారు. ప్రజలను మభ్యపెట్టేందుకు వైసీపీ ప్రయత్నిస్తోందని.. ప్రభుత్వంలో ఉన్న సమయంలో తప్పు చేశారు కాబట్టే ఇప్పుడు శిక్ష అనుభవిస్తు న్నారన్నారు. తెలుగుదేశంలో ఉన్నప్పుడు రోజా క్రమశిక్షణగా ఉన్నారని చెప్పారు. వైసీపీలోకి వెళ్లిన తరువాత రోజా క్రమశిక్షణ తప్పారని విమర్శించారు. రోజాపై అభాండాలు, విమర్శలు తాము చేయమని.. మహిళలు అంటే ఈ ప్రభుత్వానికి చాలా గౌరవం ఉందన్నారు. మహిళలకు మూడు ఉచిత సిలిండర్లు ఇస్తున్నాం, ఫ్రీ ట్రాన్స్పోర్ట్ ఇవ్వబోతున్నామని తెలిపారు. వాళ్ల నాయకుని వద్ద మెప్పు పొందేందుకు రోజా ప్రయత్నాలు చేస్తోందన్నారు. స్కాములు, తప్పులు చేసిన వారు జైల్లోకి వెళ్తున్నారని.. వైసీపీ లో ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలుగా పనిచేసిన వాళ్ళు జైల్లో ఊసలు లెక్క పెడుతున్నారన్నారు.

## బీసీ రిజర్వేషన్ల విషయంలో మభ్య పెడుతున్న కాంగ్రెస్

### పాత రిజర్వేషన్లతో ఎన్నికలు జరిపేలా కుట్రలు

### ఢిల్లీకి వెళతామని కొత్త డ్రామాలకు తెర లేపారు

### ఆగస్ట్ 8న కరీంనగర్ వేదికగా బిసి సభ

### మాజీమంత్రి తలసాని శ్రీనివాస యాదవ్

**హైదరాబాద్,జూలై29(సమయజ్యోతి):**




బీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రజలను కాంగ్రెస్ మభ్య పెడుతోందని భారత రాష్ట్ర సమితి నేత, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. చివరికి పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్ని కలకు వెళ్తుందని వ్యాఖ్యా నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆడు తున్న నాటకాలను ప్రజలు తిప్పికొట్టాలని కోరారు. మాజీ స్పీకర్ మధు సూదనాచారి, పార్టీ నేతలతో కలిసి తెలంగాణ భవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ నేతలు హామీ ఇచ్చారు. ఎలా చేస్తారని అప్పుడు అడిగితే మా వ్యూహం మాకు ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నెపమంతా భాజపా, భారత రాష్ట్ర సమితిపై నెట్టేస్తోంది. 42 శాతం రిజర్వేషన్ల ప్రకారమే స్థానిక ఎన్నికలు నిర్వహించాలన్నారు. కార్పొరేషన్ ఛైర్మన్ పదవుల విషయంలో బీసీలకు ఎందుకు ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. భారత రాష్ట్ర సమితి తరఫున కూడా రాష్ట్రపతిని కలిసి.. 42 శాతం రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాలని కోరతాం. అధికార యంత్రాంగంలోనూ కీలకమైన స్థానాలను ఓ అగ్రవర్ణం వారికే ఇచ్చారు. కార్పొరేషన్ పదవుల్లో సగం బీసీలకు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తలసాని డిమాండ్ చేశారు. ఆగస్టు 8వ తేదీన కరీంనగర్ జిల్లాలో బీసీల భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు– ఈ సదర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ల అమలుపై తెలంగాణ భవన్‌లో మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన బీసీ ముఖ్య నాయకులు సమావేశమయ్యారు. మొదటి నుండి కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేస్తూ వస్తుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ తరపున త్వరలోనే బీసీ ప్రతినిధుల బృందం రాష్ట్రపతిని కలవనుందని తెలిపారు. ఓట్ల కోసమే కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలు ఇచ్చిందని మండిపడ్డారు. పారదర్శకత లేకుండా కులగణన జరిపి, హడావుడి గా అసెంబ్లీలో ప్రభుత్వం బిల్లును పెట్టిందన్నారు. రాష్ట్రపతి వద్ద బిల్లు పెండింగ్‌లో ఉండగానే ఆర్డినెన్స్ తీసుకొస్తామనడం రాజ్యాంగ విరుద్ధం. 9వ షెడ్యూల్‌లో చేర్చితేనే చట్టబద్ధత లభిస్తుందని అసెంబ్లీలో తాము స్పష్టం చేసినం. అమలు కాదని తెలిసే కాలయాపన చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మభ్య పెడుతుందన్నారు. ఢిల్లీలో ధర్నా చేస్తామనడం కొత్త డ్రామాకు కాంగ్రెస్ కుట్ర చేస్తోందని అన్నారు. బిజెపి, కాంగ్రెస్ పార్టీల వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్తాము. మీ చేతుల్లోనే ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీలో 42 శాతం రిజర్వేషన్ ఎందుకు అమలు చేయరు. మిగిలిన మూడు మంత్రి పదవులను బీసీలకు ఇచ్చి చిత్తశుద్ధి నిరూపించుకోవాలి. వివిధ ప్రభుత్వ శాఖలలో కూడా బీసీలను అణచివేస్తున్నారు. 42 శాతం రిజర్వేషన్ అమలు చేయకుండా ఎన్నికలు జరిపితే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బొంద పెట్టేందుకు బీసీలు సిద్ధంగా ఉన్నారని తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు.

# టీమిండియా గొప్ప పోరాట పటిమ ప్రదర్శించింది

## 2-2తో సిరీస్ ను సమం చేస్తాం - ధీమా వ్యక్తం చేసిన కోచ్ గౌతం గంభీర్



ఇంగ్లాండ్ తో ఈనెల 31 నుంచి లండన్ లోని ద ఓవల్ మైదానంలో జరిగే ఐదో టెస్టు కోసం టీమిండియా ప్లేయింగ్ లెవన్ గురించి చర్చ నడుస్తోంది. ముఖ్యంగా జట్టులో స్టార్ బౌలర్ జస్ ప్రీత్ బుమ్రా ఆడతాడా..? లేదా అనే దానిపై సందిగ్ధత నెలకొంది. నిజానికి ఈ టెస్టు ప్రారంభానికి ముందే బుమ్రా కేవలం మూడు టెస్టులు మాత్రమే ఆడతాడాని టీమ్ మేనేజ్మెంట్ ప్రకటించింది. అందుకు తగ్గట్టుగానే తొలి టెస్టులో ఆడిన బుమ్రా.. రెండో టెస్టులో పెవలియన్ కు పరిమితమయ్యాడు. మూడు, నాలుగు టెస్టులో తను ఆడాడు. దీంతో తనకు కేటాయించిన మూడు టెస్టులు ముగిశాయి. అయితే జట్టు ప్రాధాన్యత రిత్యా ఐదో టెస్టులో తను ఆడతాడా... లేదా అన్న దానిపై జట్టు హెడ్ కోచ్ గౌతం గంభీర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ప్రస్తుతం జట్టులో పేసర్లంతా ఫిట్ గా ఉన్నారని, అయితే బుమ్రా ఆడటంపై మాత్రం నిర్ణయం తీసుకోలేదని చెప్పాడు. సిరీస్ లో మూడు టెస్టులే ఆడినప్పటికీ, బుమ్రా మాత్రం అదరగొట్టాడు. టీమిండియా తరపున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ గా నిలిచాడు. ఇప్పటివరకు 14 వికెట్లను కేవలం 26 సగటుతో మాత్రమే తీశాడు. ఇందులో రెండుసార్లు ఐదు వికెట్ల ప్రదర్శన ఉండటం విశేషం. ప్రత్యర్థి జట్టు కూడా బుమ్రా బౌలింగ్ ను ఆచితూచి ఆడుతుండగా, మిగతా వారిపైన మాత్ర విరుచుకుపడుతుంది. ఐదో టెస్టుకు సంబంధించి గంభీర్ మాట్లాడుతూ.. తమ జట్టు అనుభవ రహితంగా ఉందని, అయినప్పటికీ గొప్ప పోరాట పటిమ ప్రదర్శించిందని కొనియాడాడు. ఇదే స్ఫూర్తితో ఐదో టెస్టును గెలిచి, 2-2తో సిరీస్ ను సమం చేస్తామని ధీమా వ్యక్తం చేశాడు.గంభీర్ మాటలను బట్టి, ప్లేయింగ్ లెవన్ లో మార్పులు తప్పేలా కనిపించేటట్లు లేదు. బుమ్రా, మహ్మద్ సిరాజ్ తమంతట తాము తప్పుకుంటే తప్పా, వారు ప్లేయింగ్ లెవన్ లో ఆడతారు. ఒకవేళ ఈ ఇద్దరిలో ఎవరు ఆడకపోయినా, అర్షదీప్ సింగ్ ను ఆడించే అవకాశముంది. మూడో పేసర్ గా విఫలమైన అన్షుల్ కాంబోజ్ ను తప్పించి, అతని స్థానంలో ఆకాశ్ దీప్ ను ఆడించవచ్చు. బ్యాటింగ్ లైనప్ లో ఓపెనర్లుగా యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ ఆడతారు. మూడోస్తానంలో సాయి సుదర్శన్ కు మరో ఛాన్స్ దక్కుతుంది. నెం.4లో కెప్టెన్ శుభమాన్ గిల్ ఆడతాడు. గాయంతో రిషభ్ పంత్ దూరం కావడంతో అతని స్తానంలో ధ్రువ్ జురెల్ ఆడటం ఖాయంగా మారింది. అయితే తను ఏడో నెంబర్లో బ్యాటింగ్ చేసే అవకాశముంది. దీంతో ఐదు, ఆరు స్తానాల్లో వరుసగా వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజాలను ఆడించే చాన్స్ ఉంది. ఒకవేళ వికెట్ స్పిన్ కు అనుకూలిస్తే శార్దూల్ ఠాకూర్ స్తానంలో కుల్దీప్ యాదవ్ ను ఆడించొచ్చు. ఏదేమైనా పిచ్ పరిస్థితి, ఆటగాళ్ల లభ్యతను బట్టి టీమిండియా మేనేజ్ మెంట్ ఈ విషయంపై తుది నిర్ణయం తీసుకునే అవకాశముంది.

# మహేష్ తాంబే సరికొత్త వరల్డ్ రికార్డు..



క్రికెట్ అభిమానులంతా ఆశ్చర్యపోయే విధంగా ఫిన్‌లాండ్ క్రికెట్ జట్టుకు చెందిన బౌలర్ మహేష్ తాంబే అద్భుతమైన రికార్డును నెలకొల్పాడు. ఎస్టోనియా క్రికెట్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో కేవలం 8 బంతుల్లో 5 వికెట్లు తీసి చరిత్ర సృష్టించాడు. దీంతో టీ20 ఇంటర్నేషనల్ క్రికెట్‌లో అత్యంత వేగంగా 5 వికెట్లు తీసిన బౌలర్‌గా మహేష్ తాంబే ప్రపంచ రికార్డును తన పేరున లిఖించుకున్నాడు. ఈ ఘనత సాధించడానికి ఆయన కేవలం 2 ఓవర్లలో 19 పరుగులు మాత్రమే ఇచ్చాడు. గతంలో ఈ రికార్డు బహ్రెయిన్‌కు చెందిన జునైద్ అజీజ్ పేరిట ఉండేది. ఆయన 2022లో జర్మనీపై 10 బంతుల్లో 5 వికెట్లు పడగొట్టారు. కానీ, మహేష్ తాంబే అంతకంటే తక్కువ బంతుల్లోనే ఈ రికార్డు పూర్తి చేశాడు.ఆదివారం జరిగిన ఫిన్‌లాండ్ వర్సెస్ ఎస్టోనియా మూడో టీ20 మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఎస్టోనియా 19.4 ఓవర్లలో 141 పరుగులు చేసింది. ఒకానొక దశలో ఎస్టోనియా 14.3 ఓవర్లలో 104 పరుగులు చేసి, 8 వికెట్లు చేతిలో ఉండటంతో మంచి స్థితిలో ఉంది. కానీ మసూద్ మూడో వికెట్‌గా వెనుదిరిగిన తర్వాత వికెట్లు వరుసగా పడిపోయాయి. మహేష్ తాంబేతో పాటు జునైద్ ఖాన్ 2 వికెట్లు తీయగా, అమ్జాద్ షేర్, అఖిల్ అర్జునం, మాధవ ఒక్కో వికెట్ పడగొట్టారు.తాంబే కేవలం 8 బంతుల్లోనే 5 వికెట్ల ఘనత సాధించి చరిత్ర సృష్టించాడు. అతను 5 వికెట్లు పడగొట్టిన బ్యాట్స్‌మెన్‌లు %-% స్టెఫెన్ గోచ్, సాహిల్ చౌహాన్, ముహమ్మద్ ఉస్మాన్, రూపమ్ బారువా, ప్రణయ్ గీవాలా. ఫిన్‌లాండ్ జట్టు 142 పరుగుల లక్ష్యాన్ని 18.1 ఓవర్లలో 5 వికెట్ల తేడాతో ఛేదించి విజయం సాధించింది. అరవింద్ మోహన్ 60 బంతుల్లో 1 సిక్స్, 6 ఫోర్లతో అజేయంగా 67 పరుగులు చేసి విజయంలో కీలక పాత్ర పోషించాడు. 3 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఇది నిర్ణయాత్మక మ్యాచ్. ఈ విజయం ఫిన్‌లాండ్‌కు 2-1 తేడాతో సిరీస్‌ను అందించింది. 39 ఏళ్ల మహేష్ తాంబే 2021లో ఫిన్‌లాండ్ తరపున అంతర్జాతీయ క్రికెట్‌లోకి ఎంట్రీ ఇచ్చాడు. ఇప్పటివరకు అతను 28 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడి మొత్తం 28 వికెట్లు పడగొట్టాడు.

# 95 ఏళ్ల రికార్డు పై కన్నేసిన శుభమన్ గిల్

భారత్-ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్‌లో భారత యువ సంచలనం శుభమన్ గిల్ పరుగుల సునామీ సృష్టిస్తున్నాడు. ఇప్పటివరకు ఆడిన 4 టెస్టుల్లో 8 ఇన్నింగ్స్‌లలో ఏకంగా 722 పరుగులు సాధించి ఈ సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. ఇక్కడితో ఆగకుండా ఇప్పుడు 95 ఏళ్ల నాటి డాన్ బ్రాడ్‌మాన్ అజేయ టెస్ట్ రికార్డును బద్దలు కొట్టేందుకు రెడీ అవుతున్నాడు. సిరీస్‌లోని చివరి టెస్టులో రెండు అద్భుతమైన ఇన్నింగ్స్‌లు ఆడితే, క్రికెట్ చరిత్రలో ఎవరికీ సాధ్యం కాని ఘనతను గిల్ సాధించగలడు. అంటే, ఒక టెస్ట్ సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మెన్‌గా డాన్ బ్రాడ్‌మాన్‌ను వెనక్కి నెట్టి చరిత్ర సృష్టిస్తాడు. ఇంగ్లాండ్‌తో ఓవల్‌లో జరిగే చివరి టెస్ట్‌లో శుభమన్ గిల్ ఒకసారి కాదు, ఏకంగా నాలుగు సార్లు డాన్ బ్రాడ్‌మాన్‌ను అధిగమించే అవకాశం ఉంది. టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఒక సిరీస్‌లో అత్యధిక పరుగులు (974) సాధించిన రికార్డు ఆస్ట్రేలియాకు చెందిన దిగ్గజ క్రికెటర్ డాన్ బ్రాడ్‌మాన్ పేరిట ఉంది. ఈ రికార్డును ఆయన 1930లో ఇంగ్లాండ్ గడ్డపై జరిగిన యాషెస్ సిరీస్‌లో నెలకొల్పారు. ఇప్పుడు శుభమన్ గిల్ ఈ 95 ఏళ్ల పాత రికార్డును బద్దలు కొట్టడానికి కేవలం 253 పరుగులు దూరంలో ఉన్నాడు. ఇంగ్లాండ్‌తో జరుగుతున్న ప్రస్తుత సిరీస్ చివరి టెస్ట్‌లో గిల్ ఈ అద్భుతాన్ని చేయగలడు. ఒకవేళ శుభమన్ గిల్ ఈ రికార్డును సాధిస్తే, ఓవల్ టెస్ట్‌లో అతను మొత్తం 4 సార్లు డాన్ బ్రాడ్‌మాన్ రికార్డులను బద్దలు కొట్టినట్లు అవుతుంది.ఒక టెస్ట్ సిరీస్‌లో బ్యాట్స్‌మెన్ చేసిన అత్యధిక పరుగులు 974. ఇది డాన్ బ్రాడ్‌మాన్ పేరుతో ఉంది. అయితే, గిల్ ఈ రికార్డును చేరుకోవడానికి ముందు, డాన్ బ్రాడ్‌మాన్ సృష్టించిన మరో మూడు పరుగుల రికార్డులను కూడా దాటాల్సి ఉంటుంది. డాన్ బ్రాడ్‌మాన్ 1934లో ఇంగ్లాండ్ గడ్డపై జరిగిన యాషెస్ సిరీస్‌లో 758 పరుగులు సాధించారు. ఆ తర్వాత, 1931-32లో సౌత్ ఆఫ్రికా జట్టు ఆస్ట్రేలియా పర్యటనకు వచ్చినప్పుడు డాన్ బ్రాడ్‌మాన్ 806 పరుగులు చేశారు. మళ్ళీ 1936-37లో ఇంగ్లాండ్ జట్టు యాషెస్ కోసం ఆస్ట్రేలియాకు వచ్చినప్పుడు, డాన్ బ్రాడ్‌మాన్ ఆ సిరీస్‌లోని 5 టెస్టుల 9 ఇన్నింగ్స్‌లలో 810 పరుగులు చేశారు.శుభమన్ గిల్ టార్గెట్ డాన్ బ్రాడ్‌మాన్ 974 పరుగుల రికార్డును ఛేదించడమే. ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులు కూడా అతడు అలా చేయాలని ఆశిస్తున్నారు. అయితే, గిల్ ఆ మార్కును అందుకుంటున్నప్పుడు, డాన్ బ్రాడ్‌మాన్ గతంలో సృష్టించిన మరో 3 రికార్డులను కూడా బద్దలు కొట్టబోతున్నాడని అర్థం. అంటే, ఇంగ్లాండ్‌తో ఓవల్‌లో జరిగే చివరి టెస్ట్‌లో గిల్ కేవలం 2 ఇన్నింగ్స్‌లు ఆడినప్పటికీ, బ్రాడ్‌మాన్ పరుగుల రికార్డులను 4 సార్లు బద్దలు కొట్టే అవకాశం ఉంది.ప్రస్తుతం ఇంగ్లాండ్‌తో జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో శుభమన్ గిల్ 4 టెస్టుల 8 ఇన్నింగ్స్‌లలో 90.25 సగటుతో 722 పరుగులు సాధించాడు. ఇందులో 4 సెంచరీలు కూడా ఉన్నాయి. అతని మిగిలిన ఇన్నింగ్స్‌లు కూడా అదే దూకుడుతో ఉంటే, బ్రాడ్‌మాన్ ప్రపంచ రికార్డు అయిన 974 పరుగుల మార్కును మరింత దగ్గరవుతాడు. అయినప్పటికీ, ఇంకా అవకాశం ఉంది. ఒక టెస్ట్ సిరీస్‌లో అత్యధిక పరుగుల రేసులో తన కంటే 4 సార్లు ముందున్న బ్రాడ్‌మాన్‌ను గిల్ ఎన్నిసార్లు అధిగమిస్తాడో చూడాలి. ఒకటి, రెండు, మూడు లేదా మొత్తం 4 సార్లు అలా చేసి 95 ఏళ్ల ప్రపంచ రికార్డును బద్దలు కొడతాడా అనేది ఆసక్తికరంగా మారింది.



# టెస్ట్ క్రికెట్‌లో రికార్డుల వర్షం కురిపిస్తున్న జడేజా



రవీంద్ర జడేజా మోకాలికి 2022 ఆగస్టులో గాయం అయింది. కానీ, ఇప్పుడు ఆయన పూర్తిగా కోలుకుని, టీమిండియాలోకి తిరిగి వచ్చి దాదాపు రెండున్నరేళ్లు అవుతోంది. తిరిగి వచ్చినప్పటి నుంచి టెస్ట్ క్రికెట్‌లో జడేజా ప్రదర్శన గురించి మాత్రమే అందరూ మాట్లాడుకుంటున్నారు. పరుగులు, వికెట్లు, హాఫ్ సెంచరీలు.. ఇలా ఎన్నో రికార్డుల్లో ఆయన పేరు ముందున్నాయి. గాయం నుంచి కోలుకున్నాక జడేజా పెద్ద పెద్ద ఆటగాళ్లపైనే పైచేయి సాధించడం విశేషం. 2022 ఆగస్టులో గాయపడిన జడేజా, 5 నెలలు ఆటకు దూరమయ్యాడు. 2023 ఫిబ్రవరిలో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీతో మళ్ళీ టీమిండియాలోకి వచ్చాడు. గాయం తర్వాత ఎంత బాగా ఆడతాడో, దానికి ట్రైలర్‌గా రంజీ ట్రోఫీలో ఒక మ్యాచ్ ఆడాడు. తమిళనాడుతో జరిగిన ఆ మ్యాచ్‌లో 8 వికెట్లు తీశాడు. అందులో 7 వికెట్లు ఒకే ఇన్నింగ్స్‌లో వచ్చాయి.ఆ ట్రై మ్యాచ్‌లో బాగా ఆడిన జడేజా, టీమిండియా తరఫున టెస్ట్ క్రికెట్‌లో బరిలోకి దిగినప్పుడు కూడా తన పవర్ ఏ మాత్రం తగ్గలేదని నిరూపించాడు. గాయం నుంచి తిరిగి వచ్చి రెండేళ్లకు పైగా అవుతోంది. ఈ సమయంలో ఎప్పుడూ తన ప్రదర్శనలో తగ్గలేదు. గాయం తర్వాత అతని ఆటలో స్థిరత్వం స్పష్టంగా కనిపిస్తుంది. ఈ స్థిరమైన ప్రదర్శన వల్ల రవీంద్ర జడేజాకు చాలా లాభం చేకూరింది. గాయం నుంచి తిరిగి వచ్చాక టెస్ట్ క్రికెట్‌లో ఆయన మూడో అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మెన్, రెండో అత్యంత విజయవంతమైన బౌలర్. అత్యధిక అర్ధ సెంచరీలు సాధించడంలో రెండో స్థానంలో ఉన్నాడు. ఒక మ్యాచ్‌లో 10 వికెట్లు తీసిన వారిలో నెంబర్ వన్గా ఉన్నాడు. అంతేకాదు, జడేజా ఇప్పుడు టెస్ట్ ఆల్ రౌండర్ ర్యాంకింగ్స్‌లో కూడా నెంబర్ 1గా నిలిచాడు.2022 ఆగస్టులో గాయం నుంచి కోలుకున్న తర్వాత రవీంద్ర జడేజా టెస్ట్ క్రికెట్‌లో 24 మ్యాచ్‌లు ఆడాడు. వాటిలో 1301 పరుగులు చేయడంతో పాటు 88 వికెట్లు తీశాడు. ఈ సమయంలో ఆయన 11 సార్లు అర్ధ సెంచరీకి పైగా స్కోర్లు సాధించాడు (2 సెంచరీలు కూడా ఉన్నాయి). అలాగే, 2 సార్లు ఒకే టెస్ట్ మ్యాచ్‌లో 10 వికెట్లు తీసి అద్భుతం చేశాడు. గాయం నుంచి తిరిగి వచ్చిన తర్వాత, రవీంద్ర జడేజాను టెస్ట్ క్రికెట్‌లో ఆపడం కష్టంగా మారింది. అతని బ్యాటింగ్ సగటు విరాట్ కోహ్లీ, ట్రావిస్ హెడ్, బాబర్ అజామ్, మార్నస్ లబుషేన్, కేఎల్ రాహుల్, బెన్ స్టోక్స్ వంటి గొప్ప ఆటగాళ్ల కంటే మెరుగ్గా ఉంది. అలాగే, అతని బౌలింగ్ సగటు కూడా మిచెల్ స్టార్క్, నాథన్ లియోన్, మార్క్ వుడ్, క్రిస్ వోక్స్, బెన్ స్టోక్స్ వంటి బౌలర్ల కంటే తక్కువగా ఉంది.

## భారత మహిళా చెస్‌లో నూతన అధ్యాయం

జార్జియాలోని బటూమిలో జరిగిన ఫిడే ప్రపంచ కప్ 2025 ఫైనల్స్‌లో 19 ఏళ్ల దివ్య దేశ్‌ముఖ్ భారత చెస్ చరిత్రలో అద్భుతమైన అధ్యాయాన్ని లిఖించింది. ఈ చారిత్రాత్మక విజయంతో కేవలం ఒక టైటిల్ గెలవడమే కాకుండా.. భారత మహిళా చెస్‌కు సరికొత్త దిశానిర్దేశం చేసింది. దివ్య సాధించిన ఈ విజయం మహిళా చెస్ రంగంలో మరింత మంది యువ ప్రతిభావంతులకు స్ఫూర్తినిస్తుందని గ్రాండ్ మాస్టర్ ఆర్బీ రమేష్ అభిప్రాయపడ్డారు.దివ్య దేశ్‌ముఖ్ ఫిడే మహిళల ప్రపంచ కప్ 2025 టైబ్రేకర్స్‌లో దిగ్గజ క్రీడాకారిణి కోనేరు హంపిని ఓడించి, ఈ టైటిల్‌ను గెలిచిన మొదటి భారతీయురాలిగా నిలిచింది. అంతే కాదు ఆమె దేశానికి 88వ గ్రాండ్‌మాస్టర్‌గా అవతరించింది. ఈ ఘనత సాధించిన నాలుగో భారతీయ మహిళగా (కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక, ఆర్. వైశాలి తర్వాత) ఆమె చరిత్ర సృష్టించింది.ఫిడే మహిళల ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్ పూర్తిగా భారతీయ క్రీడాకారిణుల మధ్య జరిగింది. ఇది భారతీయ చెస్ క్వీన్ కోనేరు హంపి, నాగ్‌పూర్ నుంచి వచ్చిన యువ ఛాలెంజర్ దివ్య దేశ్‌ముఖ్ మధ్య జరిగింది. రాపిడ్ గేమ్స్‌లో ఒక డ్రా కాగా.. రెండో గేమ్‌లో దివ్య నల్లపావులతో అద్భుత విజయాన్ని సాధించింది. వరల్డ్ నంబర్ 5, ప్రస్తుత వరల్డ్ రాపిడ్ ఛాంపియన్ అయిన కోనేరు హంపి చేసిన చిన్న పొరపాట్లను దివ్య తెలివిగా ఉపయోగించుకుంది.”దివ్య దేశ్‌ముఖ్ టాన్ జోంగ్‌యీ, హారిక, ఇప్పుడు హంపిని ఓడించింది. ఈ విజయం సాధించడానికి ఆమె అత్యుత్తమ ఆటగాళ్లను ఓడించింది” అని ప్రపంచ చెస్‌లో అత్యంత గొప్ప కోచ్‌లలో ఒకరైన గ్రాండ్‌మాస్టర్ ఆర్బీ రమేష్ మైఖేల్‌తో ప్రత్యేకంగా మాట్లాడుతూ అన్నారు. ఇంత చిన్న వయస్సులో ఈ విజయాన్ని సాధించడం నిజంగా అద్భుతమన్నారు. అనేక మంది భారతీయ చెస్ ప్రతిభావంతుల ఎదుగుదలను పర్యవేక్షించిన రమేష్.. దివ్యలో వచ్చిన మార్పు పట్ల గర్వం వ్యక్తం చేశారు. ఆమె ఇక కేవలం దూకుడుగా ఆడే క్రీడాకారిణి కాదన్నారు. ఆమె ఇప్పుడు పటిష్టమైన స్థానాలను ఆడుతోంది, ఎండ్‌గేమ్‌లను అన్వేషిస్తోందని చెప్పారు. ఒక యూనివర్సల్ ప్లేయర్‌గా మారుతోందని.. ఇది పరిపక్వతకు నిదర్శనమని కొనియాడారు. ఫిడే మహిళల ప్రపంచ కప్ 2025 విజేతగా దివ్య దేశ్‌ముఖ్ 50,000 డాలర్లు (సుమారు ?41.6 లక్షలు) ప్రైజ్ మనీ గెలుచుకుంది. రన్నరప్‌గా నిలిచిన కోనేరు హంపికి 35,000 డాలర్లు (సుమారు ?29.1 లక్షలు) లభించాయి. అయితే ఓపెన్ విభాగంలో విజేతకు 110,000 డాలర్లు లభిస్తుండగా.. మహిళా విభాగంలో సగం కంటే తక్కువ ప్రైజ్ మనీ ఉండటం గమనార్హం.”టై-బ్రేక్‌లో, ఆట ఏ వైపుకైనా వెళ్లి ఉండవచ్చు, ఎందుకంటే ఇద్దరూ మంచి ఆటగాళ్లు, చాలా అలసిపోయారు. ఎవరైనా కుప్పకూలి తప్పులు చేసే అవకాశం ఉందని రమేష్ వ్యాఖ్యానించారు. “కాబట్టి దివ్య తన ఆలోచనలను అదుపులో ఉంచుకుని, చివరి తప్పు



చేయకపోవడం చాలా మంచి విషయం. అటువంటి పెద్ద టోర్నమెంట్‌లో, కీలకమైన ఆటలో ఇది చాలా ముఖ్యం.” అని పేర్కొన్నారు. ఆమె విజయం భారత చెస్ చరిత్రలో ఒక ముఖ్యమైన మలుపు అని కోచ్ రమేష్ స్పష్టం చేశారు.ఇంతకు ముందు కేవలం ముగ్గురు భారతీయ మహిళలు మాత్రమే గ్రాండ్ మాస్టర్ టైటిల్ ను సాధించారని.. ఇప్పుడు ఒక టీనేజర్ ఈ ఘనతను సాధించిందని కోచ్ రమేష్ వెల్లడించారు. ఇది ఒక కీలక క్షణమని.. కేవలం వ్యక్తిగత మైలురాయి మాత్రమే కాదని, దేశంలో మహిళా చెస్‌కు ఒక జ్యోతిని వెలిగించిన క్షణమని ప్రశంసలు కురిపించారు. ఏళ్లుగా పురుషుల విభాగంలో గుకేష్, అర్జున్, ప్రజ్ఞానంద వంటి టీనేజ్ సంచలనాలను భారత్ తయారు చేసింది. అయితే రమేష్ చెప్పినట్లుగా, మహిళల విభాగంలో అలాంటి స్ఫూర్తి కనిపించలేదు. “ఈ విజయం ఆ పరిస్థితిని మార్చగలదు,” అని ఆయన అన్నారు. ఇది ఎక్కువ మంది బాలికలను 18 ఏళ్లు నిండకముందే గ్రాండ్‌మాస్టర్‌లుగా మారాలని కలలు కనేలా ప్రోత్సహిస్తుందని ఆయన స్పష్టం చేశారు. అహ్మదాబాద్‌లో ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌గా నిలవడం నుంచి బుడాపెస్ట్‌లోని చెస్ ఒలింపియాడ్‌లో బంగారు పతకానికి సహకరించడం వరకు, దివ్య ఎదుగుదల స్థిరంగా, అద్భుతంగా ఉంది. అయితే, బటూమి 2025 ఆమెకు ఒక పట్టాభిషేకం లాంటిది. ఒక ప్రపంచ కప్ ఛాంపియన్, ఒక గ్రాండ్‌మాస్టర్, ఒక టీనేజ్ ట్రెయిల్‌బ్లేజర్‌గా దివ్య దేశ్‌ముఖ్ కేవలం ఒక ట్రోఫీని గెలవడమే కాకుండా - కొత్త తలుపులను తెరిచింది.

# మహావతార్ నరసింహ అద్భుతం

ప్రస్తుతం భారతీయ బాక్సాఫీస్ వద్ద పురాణగాథలకు మంచి డిమాండ్ ఉంది. తెలిసిన కథే అయినా ఆసక్తికరంగా తీర్చిదిద్ది అందిస్తే ప్రేక్షకులు ఆదరిస్తున్నారని ఇటీవల పలు సినిమాలు నిరూపించాయి. ఇప్పుడు ఇదే బాటలో పయనిస్తోంది 'మహావతార్ నరసింహ', ప్రముఖ నిర్మాణసంస్థ హోంబలే ఫిల్మ్స్ నుంచి వచ్చిన ఈ విజువల్ వండర్‌కు చిన్నా, పెద్దా అందరూ ఫిదా అవుతున్నారు. ముఖ్యంగా 3డీలో సరికొత్త అనుభూతిని పంచుతోంది. తాజాగా మూవీని చూసిన అగ్ర కథానాయకుడు ప్రభాస్ చిత్ర బృందాన్ని మెచ్చుకున్నారు. పవర్‌ఫుల్ విజన్‌తో 'మహావతార నరసింహ'ను వాస్తవంలోకి తీసుకొచ్చిన హోంబలే ఫిల్మ్స్‌కు శు భాకాంక్షలు. సినిమా నాకెంతో నచ్చింది. యానిమేషన్ రూపంలో తీర్చిదిద్దిన యాక్షన్ సన్నివేశాలు, కథాగమనం అద్భుతంగా ఉన్నాయి. ఈ అపురూప విజయం సాధించిన దర్శకుడు అశ్విన్‌కుమార్, చిత్ర బృందానికి అభినందనలని పేర్కొన్నారు. ప్రభాస్ పోస్ట్‌కు హోంబలే చిత్రబృందం స్పందించింది. సినిమాపై ఆయన అభిప్రాయంపై కృతజ్ఞతలు తెలిపింది.



# ఉస్తాద్ భగత్ సింగ్ క్లైమాక్స్ పార్ట్ పూర్తి

పవన్ కల్యాణ్ అభిమానులు ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'ఉస్తాద్ భగత్‌సింగ్' ఒకటి. పవన్ కల్యాణ్ - హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న ఈ సినిమా షూటింగ్ అప్‌డేట్‌ను నిర్మాణసంస్థ తాజాగా షేర్ చేసింది. దీని -క్లైమాక్స్ పూర్తయినట్లు- తెలిపింది. పవన్ కల్యాణ్ ఎంతో అంకితభావంతో దీని షూటింగ్‌లో పాల్గొన్నారంటూ ఆయనకు కృతజ్ఞతలు చెప్పింది. ఎన్నో భావోద్వేగాలతో కూడిన ఉస్తాద్ భగత్‌సింగ్ క్లైమాక్స్ పూర్తయింది. నబకాంత మాస్టర్ పర్యవేక్షణలో యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ జరిగింది. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ- సీఎంగా బాధ్యతలను నిర్వర్తిస్తూనే.. మరోవైపు 'హరి హర వీరమల్లు' ప్రచారంలో పవన్ కల్యాణ్ భాగమయ్యారు. అదే మెరుపు వేగంతో 'ఉస్తాద్ భగత్‌సింగ్' షూటింగ్‌లో కూడా పాల్గొన్నారు. ఇది ఆయన అంకితభావానికి, కష్టపడి పనిచేసే స్వభావానికి నిదర్శనమని నిర్మాణ సంస్థ తెలిపింది ఈ విషయాన్ని తెలుపుతూ సెట్‌లో పవన్, హరీశ్ శంకర్‌ల ఫొటోను పంచుకుంది. గబ్బర్ సింగ్' తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో రానున్న చిత్రం కావడంతో దీనిపై సినీప్రియులు ఎన్నో అంచనాలు పెట్టుకున్నారు. ఇందులో పవన్ కల్యాణ్ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, స్పెషల్ వీడియోలు సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేశాయి. ఇక పవన్ సరసన శ్రీలీల, రాశీ ఖన్నా నటిస్తున్నారు. త్వరలోనే దీని విడుదల తేదీని ప్రకటించనున్నారు.




# కింగ్డమ్ నుంచి రగిలే రగిలే లిరికల్ సాంగ్ విడుదల

## తమిళంలో వాయిస్ ఓవర్ ఇచ్చిన సూర్య




విజయ్ దేవరకొండ ప్రధానపాత్రలో రానున్న 'కింగ్డమ్' గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కింది. భాగ్య శ్రీ బోర్సే కథానాయికగా కనిపించనున్నారు. జులై 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీని ప్రచారంలో భాగంగా 'రగిలే రగిలే' అంటూ సాగే లిరికల్ సాంగ్‌ను విడుదల చేశారు 'మృత్యువు జడిసేలా.. శత్రువు బెదిరేలా..పద పద..' అనే పవర్‌ఫుల్ లిరిక్స్‌ను కృష్ణకాంత్ రాయగా.. సిద్ధార్థ్ బస్రూర్ ఆలపించారు. ఈసందర్భంగా చెన్నైలో ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌ను ఏర్పాటు-చేశారు. అందులో విజయ్ మాట్లాడుతూ హీరో సూర్యకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. టీ-జర్‌కు వాయిస్ ఓవర్ ఇస్తారా అని అడగ్గానే అంగీకరించారని తెలిపారు. కింగ్డమ్' కథ అనుకోగానే దీన్ని తమిళంలో కూడా కచ్చితంగా విడుదల చేయాలని భావించాం. ఈ సినిమా విడుదలకు ముందు ముఖ్యంగా ఇద్దరికి కృతజ్ఞతలు చెప్పాలి. వారిలో ఒకరు హీరో సూర్య. నాకు మొహమాటం ఎక్కువ. ఎవరిని సాయం అడగలేను. 'కింగ్డమ్' తమిళ టీజర్‌కు సూర్య వాయిస్ ఇస్తే బాగుంటుందని దర్శకుడు తెలిపారు. నేను ఈ మాట అడగ్గానే సూర్య ఓకే చెప్పారు. ఆయన పవర్‌ఫుల్ వాయిస్ టీజర్‌ను మరింత పవర్‌ఫుల్‌గా చేసింది. థాంక్యూ సూర్య అన్న అని అన్నారు. ఇక రెండో వ్యక్తి మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్.. అతడు ఈ సినిమాకు ప్రాణం పెట్టాడు. ఇప్పటికీ దీని పనుల్లోనే బిజీగా ఉన్నాడు. అతడిని కిడ్నాప్ చేసి నాతోపాటే ఉంచుకోవాలని ఉంది. ఈ సినిమా విషయంలో నేను చెప్పిన అప్‌డేట్స్ కంటే అనిరుధ్ చెప్పినవే వైరల్ అయ్యాయి. ఇటీ-వల జరిగిన ఈవెంట్‌లో కూడా ఈ చిత్రం మా అందరికీ మైల్‌స్టోన్ అవుతుందని అనిరుధ్ చెప్పాడు. ఆ మాటనే ఎంతోమంది షేర్ చేశారు. మరో రెండు రోజుల్లో 'కింగ్డమ్' మీ ముందుకురానుంది. మీ అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను అని తెలిపారు.

# చందమామల కథ స్ఫూర్తితో విశ్వంభర

చిరంజీవి కథానాయకుడిగా వశిష్ఠ దర్శకత్వంలో రానున్న సోషియో ఫాంటసీ ఫిల్మ్ 'విశ్వంభర'కి సంబంధించిన ఆసక్తికర విషయాల కోసం చిరు అభిమానులతో పాటు-సినీప్రియులంతా ఎదురుచూస్తున్నారు. తాజాగా చిత్ర దర్శకుడు ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ కొన్ని సంగతులు పంచుకున్నారు. దీని టీజర్ విడుదలయ్యాక 'అవతార్'కు కాపీ అంటూ వచ్చిన ట్రోల్స్‌పై మాట్లాడారు. టీజర్ నాకు నచ్చింది కాబట్టి నేను రిలీజ్ చేశాను. అందులో కనిపించిన పాప కాస్ట్యూమ్‌ను చూసి అందరూ నేను అవతార్ సినిమా కాపీ చేసి దాన్ని రూపొందించానని అన్నారు. టీజర్‌లో కనిపించిన కొండలు,ఆ పాప చెవులు చూసి అలా భావించారు. కానీ, కొండలను 'అవతార్' కంటే ముందు ఎన్నో సినిమాల్లో చూపించారు. ఇక చెవులు కూడా పెద్దగా ఉండడం గతంలో చాలా సినిమాల్లోని పాత్రల్లో చూపారు. నేను చందమామ కథలు చూసి స్ఫూర్తి పొంది అలా కాస్ట్యూమ్ డిజైన్ చేయించాను. అవతార్ చూసి కాపీ కొట్టాననే బదులు ఈ కథలను చూసి కాపీ కొట్టాను అంటే చాలా ఆనందించేవాడిని. చందమామ కథల్లో జ్వాలాదీపం అనే సిరీస్ ఉంటుంది. అందులో ఉన్నవే అవతార్‌లో చూపించారని అన్నారు. ఇందులో ఐదుగురు హీరోయిన్స్ ఉన్నారంటూ వార్తలు వస్తున్నాయి. మెయిన్ హీరోయిన్ త్రిష, సెకండ్ లీడ్ ఆషిక వాళ్లిద్దరు మాత్రమే ఉన్నారు. విడిగా నటీమణులు కొన్ని పాత్రల్లో కనిపిస్తారు. స్క్రీన్‌పై వీళ్లందరూ చాలా ఫ్రెష్‌గా ఉంటారు. వీఎఫ్ఎక్స్ వర్క్ కారణంగానే దీని విడుదల ఆలస్యమవుతుంది. ఇక ఇప్పటికే చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ సినిమా విడుదల తేదీని త్వరలోనే ప్రకటించనున్నారు.




# సతీ లీలావతిగా లావణ్య త్రిపాఠి

లావణ్య త్రిపాఠి, దేవ్ మోహన్ ప్రధానపాత్రల్లో రానున్న చిత్రం 'సతీ లీలావతి' తాతినేని సత్య ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. తాజాగా దీని టీ-జర్‌ను టీ-మ్ విడుదల చేసింది. సోషల్ మీడియాలో వచ్చే కౌంటర్స్, సరదాగా సాగే పంచ్‌లతో ఈ వీడియో నవ్వులు పూయిస్తోంది. మిక్కీ జే మేయర్ ఈ చిత్రానికి సంగీతం అందించారు. త్వరలోనే దీని విడుదల తేదీని ప్రకటించనున్నారు.



# తరుణ్‌కు హిట్ ఇచ్చిన నువ్వులేక నేను లేను..



2002లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన అందమైన కుటుంభ ప్రేమకథ చిత్రం 'నువ్వు లేక నేను లేను'. హీరో తరుణ్ కు మంచి బ్రేక్ ఇచ్చిన సినిమా ఇది. కానీ ఈ సినిమాలో అసలు మొదటగా మహేశ్ బాబు తో చేయాలనుకున్న విషయం ఆసక్తికరంగా మారింది. తాజాగా ఈ సినిమాకి దర్శకత్వం వహించిన కాశీ విశ్వనాథ్ ఒక ఇంటర్వ్యూలో ఈ ఆసక్తికర విషయం వెల్లడించారు.. సినిమా స్క్రిప్ట్ రెడీ అయిన తర్వాత, నిర్మాత సురేష్ బాబు ఈ కథను మహేశ్ బాబుతో చేద్దామా? అని అడిగారు. దానికి కాశీ విశ్వనాథ్ స్పందిస్తూ - 'మహేశ్ తో సినిమా అంటే ఇంకా ఆలస్యం అవుతుంది. ఆయన డేట్స్ కోసం పెద్ద లైన్ ఉంటుంది. ఇప్పటికే నాకు ఆలస్యమైంది. ఇదే తరుణ్‌కు బాగా సరిపోతుందని చెప్పారు. అలా చివరికి మహేశ్ బాబు అవకాశాన్ని వదిలివేయడంతో తరుణ్ ఛాన్స్ దక్కించుకున్నాడు. ఈ చిత్రం విడుదలై మంచి విజయాన్ని సాధించడంతో పాటు-, ఆయన కెరీర్‌కు మరో మైలురాయిగా నిలిచింది' అని తెలిపారు.. ఒక కథ, ఒక నిర్ణయం.. నటుడి భవిష్యత్తునే మార్చేస్తుంది అనడానికి ఇదే నిదర్శనం.

# వార్నర్‌కు బాహుబలి కిరీటం




డేవిడ్ వార్నర్.. క్రికెట్ అభిమానులకే కాదు.. సినీప్రియులకు ఎంతో ఇష్టమైన వ్యక్తి. తెలుగు సినిమా పాటలకు తనదైన ÷-టసైల్‌లో డ్యాన్స్ వేస్తూ అలరిస్తుంటారు. 'బాహుబలి' సినిమాపై ఆయన చేసిన వీడియోలు కూడా అప్పట్లో సోషల్ మీడియాలో తెగ వైరల్ అయ్యాయి. ఇప్పుడీ క్రికెటర్‌కు మన దర్శకధీరుడు రాజమౌళి 'బాహుబలి' కీరిటాన్ని పంపనున్నారు. ఇండియన్ సినిమాను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లింది 'బాహుబలి'. ఈ చిత్రం విడుదలై 10 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో దీన్ని మరోసారి ప్రపంచ ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఈ సందర్భంగా డేవిడ్ గతంలో తాను ధరించిన బాహుబలి కాస్ట్యూమ్ లుక్స్‌ను తాజాగా మరోసారి పంచుకున్నారు. 'కిరీటం ఉన్న ఫొటో బాగుందా? లేని పిక్ నచ్చిందా?' అని క్యాప్షన్ పెట్టారు. దీనికి రాజమౌళి రిప్లై ఇచ్చారు. హాయ్ డేవిడ్.. మీరిప్పుడు మాహిష్మతి సామ్రాజ్యానికి నిజమైన రాజులా తయారవ్వండి. నేను ఈ కిరీటాన్ని పంపుతున్నానని అన్నారు. దానికోసం ఎదురుచూస్తుంటానని క్రికెటర్ చెప్పారు. 'మీరు ఆస్ట్రేలియాలో ఈ సినిమాను మరోసారి చూడండి' అని టీమ్ మరో కామెంట్ పెట్టింది. దీనికి వార్నర్ ఓకే అంటూ థంబ్ పెట్టారు. రెండు భాగాలుగా అలరించిన ఈ బ్లాక్‌బస్టర్ ఇప్పుడు ఒకే పార్ట్‌గా రానుంది. 'బాహుబలి: ది ఎపిక్ పేరుతో ప్రపంచవ్యాప్తంగా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకురానుంది. తెలుగు, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో ఇది విడుదల కానున్న విషయం తెలిసిందే.

EDITED, PRINTED AND PUBLISHED BY FAISAL KHAN PRINTED AT UJALA PRESS, LIG, 211 APHB COLONY ADILABAD, TELANGANA.
PUBLISHED FROM H.NO.4-4-120/C/3, SANJAY NAGAR COLONY, ADILABAD, TELANGANA STATE. EDITOR : FAISAL KHAN, RNI : APTEL/2013/53323, CELL : 94400 62685